సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 13
బుధవారం 5-4-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'


టైటాన్స్ ఆడుతూ పాడుతూ..
రాణించిన సాయి సుదర్శన్. గుజరాత్‌కు వరుసగా రెండో విజయం -12లో


వృద్ధి రేటుకు ప్రపంచబ్యాంక్ కోత
భారత్ జీడీపీ వృద్ధి రేటు 6.3 శాతానికి పరిమితమవుతుందని అంచనా -13లో


సిక్కింలో భారీ హిమపాతం
సిక్కింలోని నాథూ లా ప్రాంతంలో సంభవించిన భారీ హిమపాతం ధాటికి ఏడుగురు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸


ట్విట్టర్ లోగో మారింది
మైక్రో–బ్లాగింగ్ సైట్ ట్విట్టర్ లోగోను ఆ సంస్థ సీఈఓ ఎలాన్ మస్క్ మార్చేశారు. లోగోలో నీలిరంగు బుల్లి పిట్ట స్థానంలోకి వేట కుక్క వచ్చి చేరింది.
వివరాలు 6లో ▸


పేర్లు మార్చినా నిజం మారదు
అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టుకున్నా.. నిజం మారదని భారత్ పునరుద్ఘాటించింది.
వివరాలు 6లో ▸

బండి సంజయ్ అరెస్టు

టెన్త్ పేపర్ల లీకేజీ కేసులోనే..?
- కరీంనగర్‌లో అర్ధరాత్రి సమయంలో అదుపులోకి.. తీవ్రంగా ప్రతిఘటించిన సంజయ్, కార్యకర్తలు
- హైదరాబాద్ వైపు తరలించిన పోలీసులు
- సంజయ్ అరెస్టును ఖండించిన బీజేపీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్ / కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో మంగళవారం హైడ్రామా చోటు చేసుకుంది. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఇంటికి పెద్ద సంఖ్యలో చేరుకున్న నగర పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య భారీ తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. టెన్త్ పేపర్ల లీకేజీకి సంబంధించి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. కాగా సంజయ్‌ను హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ అదనపు డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్‌రావు , సీఐలు నటేష్, లక్ష్మీబాబు, దామోదర్‌రెడ్డి దాదాపు 50 మందికి పైగా పోలీసులు అర్ధరాత్రి సమయంలో బండి సంజయ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామని సహకరించాలని కోరారు. తన అరెస్టుకు కారణంగా చూపించాలని, తనకు వారెంటు చూపాలంటూ పోలీసులతో సంజయ్ వాగ్వాదానికి దిగారు. మరో వైపు బండి సంజయ్‌పై అరెస్టు చేస్తున్నారనే ప్రచారంతో బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో సంజయ్‌ను పోలీసులు ఇంటి నుండి బలవంతంగా బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పోలీసుల ప్రయత్నాన్ని కార్యకర్తలు ప్రతిఘటించారు. పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేస్తూ ఆయన
మిగతా 5వ పేజీలో ▶


మంగళవారం అర్ధరాత్రి బండి సంజయ్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

చరిత్రాత్మక వేడుకగా అంబేడ్కర్
విగ్రహావిష్కరణ

దేశ ప్రజలు సంబురపడేలా శోభాయమానంగా జరపాలి
- అంబేడ్కర్ ఔన్నత్యాన్ని మరింత గొప్పగా చాటిచెప్పేలా సభ..
- విగ్రహంపై హెలికాప్టర్ నుంచి పూలు చల్లుతూ పుష్పాంజలి
- బౌద్ధ భిక్షువులతో వారి సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమం.. ఏకైక ముఖ్యఅతిథిగా అంబేడ్కర్ మునిమనవడిని ఆహ్వానించాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తయిన విగ్రహావిష్కరణను అత్యంత వైభవోపేతంగా, చరిత్రాత్మక వేడుకగా, కన్నుల పండువగా దేశం గర్వించే రీతిలో జరపాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. తెలంగాణ సమాజంతోపాటు యావత్ దేశ ప్రజలు సంబురపడేలా శోభాయమానంగా, గొప్పగా మహా విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు. దేశం గర్వించదగ్గ స్థాయిలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్న తరుణంలో ఆవిష్కరణ సభ కూడా అంతే ఉన్నత స్థాయిలో, అంబేడ్కర్ ఔన్నత్యాన్ని మరింత గొప్పగా ప్రపంచానికి చాటిచెప్పేలా ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా
మిగతా 3వ పేజీలో ▶

చాంబర్‌లోకి తొలుత సీఎం
- ఆ తర్వాత మంత్రులు, అధికారులు, సిబ్బంది
- 30న కొత్త సచివాలయం ప్రారంభోత్సవంపై సమీక్షలో కేసీఆర్
- ప్రారంభోత్సవానికి 2,500 మంది

-వివరాలు 3లో

ఫ్లాష్.. ఫ్లాష్

హైదరాబాద్‌లో కాల్పులు ఒకరి మృతి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో మంగళవారం అర్ధరాత్రి కాల్పులు కలకలం సృష్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టప్పాచబుత్ర పోలీసుస్టేషన్ పరిధిలోని షబాబ్ బిల్డింగ్స్ ప్రాంతంలో క్రాంతి అనే వ్యక్తి, అతని అనుచరులు జరిపిన కాల్పుల్లో రాహుల్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కాల్పులు జరిపిన వెంటనే క్రాంతి, అతని అనుచరులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే టప్పాచబుత్ర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రాజధానిలో పేదలు ఉండొద్దంటే ఎలా?
- ఏపీ రాజధాని పిటిషనర్లను ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం
- ఇళ్ల స్థలాల కేటాయింపు అభివృద్ధిలో భాగమే.. ఫలానా వారికి ఇళ్ల స్థలాలివ్వొద్దని చెప్పజాలరు
- సుప్రీంలో విచారణ కొనసాగుతున్నందున రాజధాని వ్యవహారాన్ని జటిలం చేయలేం

- వివరాలు 10లో▶



హిందీ 'టెన్'షన్

హనుమకొండ జిల్లా కమలాపూర్ సెంటర్ నుంచి బయటకు టెన్త్ ప్రశ్నపత్రం

స్నేహితుడి కోసం ఓ మైనర్ నిర్వాకం
- ఒకరి నుంచి మరొకరికి.. పలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు
- అప్రమత్తమైన మంత్రి.. సమగ్ర విచారణకు అధికారులకు ఆదేశం
- వరంగల్ సీపీ రంగనాథ్ పర్యవేక్షణలోదర్యాప్తు
- రాష్ట్ర బీజేపీ చీఫ్ బండి సంజయ్‌తో పాటు 110 మందికి పేపర్
- అది పేపర్ లీక్ కాదు.. కాపీయింగ్ కోసం ప్రయత్నం: సీపీ రంగనాథ్
- మైనర్‌తో పాటు నలుగురిపై కేసు
- జువెనైల్ హోంకు బాలుడు.. ఇద్దరికి రిమాండ్.. పరారీలో ఒకరు



సాక్షిప్రతినిధి, వరంగల్: టెన్త్ హిందీ ప్రశ్నపత్రం కూడా అవుటైంది. టెన్త్ పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే తాండూరులో తెలుగు ప్రశ్నపత్రం లీకవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే కాగా.. ఈ వ్యవహారం సద్దుమణగక ముందే, రెండోరోజే హిందీ పేపర్ కూడా బయటకు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసింది. మంగళవారం పరీక్ష ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాట్సాప్ గ్రూపులలో హిందీ ప్రశ్నపత్రం చక్కర్లు కొట్టడం ప్రారంభమయ్యింది. ఈ మేరకు అందిన సమాచారంతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంటనే ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, పోలీసు కమిషనర్, ఎస్పీలు, డీఈవోలతో మాట్లాడారు. సమగ్ర విచారణకు ఆదేశించారు. దీంతో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో పోలీసులు సోషల్ మీడియాలో వైరలైన పోస్టింగ్‌ల ఆధారంగా దర్యాప్తు జరిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి హిందీ క్వశ్చన్ పేపర్ బయటకు వచ్చినట్లు తేల్చారు. ఓ మైనర్ బాలుడితో పాటు నలుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ ఏవీ రంగనాథ్ వివరాలను వెల్లడించారు. కమలాపూర్ మండలానికి చెందిన ఓ బాలుడు (16) తన స్నేహితుడికి చిట్టీలు అందించడం కోసం ఈ పని చేశాడని, దీన్ని సోషల్ మీడియాలో
మిగతా 5వ పేజీలో ▶

సీపీ చెప్పిందిదీ..

9.30
పరీక్ష ప్రారంభం

9.45
ప్రశ్నపత్రం ఫొటోలు తీసిన మైనర్ బాలుడు

9.46
మౌటం శివ గణేష్‌కు వాట్సాప్‌లో పంపాడు

9.59
శివ గణేష్ 2019-20 అనే వాట్సాప్ గ్రూపునకు ఫార్వర్డ్ చేశాడు

10.00
గుండెబోయిన మహేశ్.. ప్రశాంత్‌కు పంపించాడు

10.46
ప్రశాంత్ జర్నలిస్టుల గ్రూపుతో పాటు బండి సంజయ్‌కి, మరో 110 మందికి పోస్టు చేశాడు

లీకేజీలో బీజేపీ కుట్ర కోణం 2లో
ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, పెద్ది సుదర్శన్ రెడ్డి

అప్రతిష్టపాలు చేసేందుకే...
టెన్త్ పరీక్షల విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసే విధంగా ప్రతిపక్షాలు దుందుడుకుగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయాల కోసం విద్యార్థులను పావుగా ఉపయోగించుకోవడం ప్రతిపక్షాలకు తగదు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రకు బలికావద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నా.
- సబితా ఇంద్రారెడ్డి, మంత్రి



పోస్టల్ ఉద్యోగుల అలసత్వమే..
- సిబ్బంది లేకుండానే ఆటోలో జవాబు పత్రాలు..
- 9 మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం
- ఇద్దరు పోస్టాఫీస్ సిబ్బందిపై వేటు

అక్రమాలకు పాల్పడితే ఉద్యోగాలు పోతాయ్ 2లో

రామోజీ అతీతుడా?

సాక్షి, రాజమహేంద్రవరం: బ్రహ్మయ్య అండ్ కో కంపెనీ చార్టెర్డ్ అకౌంటెంట్‌ను (సీఏ)ను అరెస్టుచేస్తే అందరు సీఏలపై దాడి ఎలా అవుతుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. తప్పు ఎవరుచేసినా తప్పేనని, చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. అది రామోజీరావు అయినా, మరెవరైనా అంతా సమానమేనన్నారు. సాక్షాత్తూ తిరుమల టీటీడీ హుండీలో వేసే విదేశీ కరెన్సీ విషయంలో ముందస్తు అనుమతి తీసుకోవడంలో జాప్యం చేసినందుకు రూ.10 కోట్ల ఫైన్ వేశారని ఉండవల్లి గుర్తుచేశారు. వెంకటేశ్వరస్వామి కంటే అతీతుడినని రామోజీరావు భావిస్తున్నారని ఆయన మండిపడ్డారు. విజయ్‌మాల్యా, రామోజీరావు ఇద్దరూ చేసింది ఒక్కటే అని వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్గదర్శిలో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తాను 2006 నుంచి చెబుతూనే ఉన్నానని.. తాను ఆరోపించినట్లుగానే అక్రమాలు వెలుగుచూస్తున్నాయన్నారు. మార్గదర్శిని రామోజీ ఇష్టమెచ్చినట్లు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇక మార్గదర్శిలో తప్పు జరిగిందని ఎవరైనా ఫిర్యాదు ఇచ్చారా అని ప్రశ్నిస్తున్నారని.. ఆర్థిక నేరాల్లో ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా చర్యలుంటాయన్నారు. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ గోపాలకృష్ణారెడ్డి పదవిలో ఉండగానే మార్గదర్శి వ్యవహారాన్ని తప్పుబట్టారన్నారు. అందులో జరిగే అక్రమాలపై కర్ణాటక నుంచి ఫిర్యాదు వచ్చిందని తన ఆత్మకథలో ఆయన పేర్కొన్నట్లు గుర్తుచేశారు.

సీఏలు నన్ను దూషించడం తగదు
'మార్గదర్శి కేసులో బ్రహ్మయ్య అండ్ కో
మిగతా 10వ పేజీలో ▶

తప్పుచేస్తే ఎవరికైనా శిక్షలుంటాయి
- మార్గదర్శి వ్యవహారంలో సీఏల విమర్శలు తగదు.. విజయ్ మాల్యా, రామోజీరావు ఇద్దరూ చేసింది ఒక్కటే..
- డిపాజిటర్ల పేర్లు వెల్లడించాలి..
- మాజీ ఎంపీ ఉండవల్లి వ్యాఖ్యలు





విచారణపై స్టే ఇవ్వలేం
- మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు.. ఏపీ సీఐడీ దర్యాప్తు కొనసాగించుకోవచ్చని వెల్లడి
- ఈ కేసులో ఏజీ వాదనలు వినిపిస్తారు.. అప్పటివరకు ఆదేశాలు ఇవ్వొద్దు
- కోర్టుకు ఏపీ స్పెషల్ జీపీ విజ్ఞప్తి

- వివరాలు 10లో

సాంకేతికంగా పోలీసుల అదుపులో ట్రంప్

నేనే నేరమూ చేయలేదు



హష్ మనీ కేసులో ట్రంప్ వాదన
- మన్‌హాటన్ కోర్టులో విచారణకు హాజరు..
- తర్వాత 34 అభియోగాలు వినిపించిన జడ్జి
- మోహరించిన మీడియా, భారీ భద్రత
- అమెరికాలో న్యాయం అడుగంటింది: ట్రంప్
- థర్డ్ వరల్డ్ కంట్రీగా మారిందంటూ ధ్వజం

హష్ మనీ చెల్లింపుల కేసులో తనపై నమోదైన క్రిమినల్ నేరాభియోగాలను అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదు. తాను ఏ నేరమూ చేయలేదంటూ కోర్టు ముందు వాంగ్మూలమిచ్చారు. ప్రపంచమంతటి దృష్టినీ ఆకర్షించిన ఈ సంచలనాత్మక కేసులో మంగళవారం ఆయన మన్‌హాటన్ క్రిమినల్ కోర్టు ముందు విచారణకు హాజరయ్యారు.
- వివరాలు 6లో

ఒక్క ఆధార్.. 11,000 సిమ్ కార్డులు!

యూపీలోని మీరట్‌లో జారీ చేసిన అధికారులు
- ఇందులో రెండు సిమ్‌లు వినియోగించిన సైబర్ నేరస్తులు
- కేవైసీ మోసం కేసు విచారణలో గుర్తించిన సీఓఈసీఎస్
- టెలికం విభాగాన్ని అప్రమత్తం చేసిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలికి చెందిన మహేశ్వర్ (పేరు మార్చాం) ప్రముఖ ఐటీ కంపెనీలో ఉద్యోగి. ఒక రోజు నో యువర్ కస్టమర్ (కేవైసీ) అప్‌డేట్ చేసుకోవాలని, లేకపోతే బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుందని అతని సెల్‌ఫోన్‌కు సందేశం వచ్చింది. దీంతో నిజమేనని నమ్మిన మహేశ్వర్.. మెసేజ్‌లోని లింక్‌పై క్లిక్ చేసి, అందులో బ్యాంకు ఖాతా నంబరు, ఇతరత్రా వ్యక్తిగత వివరాలు నమోదు చేశాడు. అంతే.. ఆ తర్వాత కొన్ని సెకన్లకే తన ఖాతాలో సొమ్ము విత్‌డ్రా అయినట్టు బ్యాంకు నుంచి సందేశం వచ్చింది. అతను కంగారు నుంచి తేరుకునేలోపు ఖాతా మొత్తం ఖాళీ చేసేశారు సైబర్ నేరస్తులు. దీంతో లబోదిబోమంటూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో బాధితుడికి సందేశం వచ్చిన ఫోన్ నంబర్, దానికి అనుసంధానించిన గుర్తింపు కార్డును, బ్యాంకు ఖాతా వివరాలను సైబరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ (సీఓఈసీఎస్)లో విశ్లేషించగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.
- సైబర్ మోసాలు, డేటా లీకు, నకిలీ వెబ్‌సైట్లు వంటి సైబర్ నేరాలకు సంబంధించిన

మిగతా 5వ పేజీలో ▶

నేను అధ్యక్షుడిగా ఉన్నంతకాలం బీఆర్‌ఎస్‌తో పొత్తుండదు



మీడియాతో చిట్‌చాట్‌లో స్పష్టం చేసిన పీసీసీ చీఫ్ రేవంత్
- ఈ అంశంపై రాహుల్‌గాంధీ ఇప్పటికే తేల్చి చెప్పారని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చి మాఫియాలా తయారైన భారత్ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) పార్టీతో పొత్తు ఉండదని పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగినంత కాలం బీఆర్‌ఎస్‌తో పొత్తు మాటే తలెత్తదని పేర్కొన్నారు. ఈ విషయమై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇదివరకే తేల్చిచెప్పారని, పొత్తు విషయంలో ఆయన స్పష్టంగా ఉన్నారని తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యూహాన్ని తెలంగాణలో కేసీఆర్ అమలు చేస్తున్నారని, బీజేపీతో పోరాటం చేస్తున్నట్లుగా కలరింగ్ ఇస్తూ కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో
మిగతా 3వ పేజీలో ▶

నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: విదర్భ నుంచి ఉన్న ద్రోణి మంగళవారం జార్ఖండ్ నుంచి ఇంటీరియర్ ఒడిశా, కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ మీదుగా ఇంటీరియర్ తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టం నుండి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద కొనసాగుతోంది. దీంతో బుధ, గురువారాల్లో తెలంగాణలో అక్కడక్కడ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశ ముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయి. గురువారం కొన్ని జిల్లాల్లో అక్కడ క్కడ ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.1	26.7
ఆదిలాబాద్	40.0	23.7
నిజామాబాద్	38.8	25.9
మహబూబ్‌నగర్	38.1	25.5
మెదక్	38.0	21.1
భద్రాచలం	37.6	27.0
హైదరాబాద్	37.6	25.0
కడప	37.3	25.4
రామగుండం	37.0	26.2
ఖమ్మం	37.0	26.0
విజయవాడ	36.0	26.0
హనుమకొండ	36.0	24.5
తిరుపతి	36.0	23.0
నల్లగొండ	35.0	22.4

లీకేజీలో బీజేపీ కుట్ర కోణం

- బీజేపీ కార్యకర్త ప్రోద్బలంతోనే హిందీ పేపర్ బయటకు..
- నర్సంపేట, అంథోల్ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, క్రాంతి కిరణ్




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరీక్షల లీకేజీ వ్యవహారంలో బీజేపీ కుట్ర కోణం ఉందన్న తమ అనుమానాలు నిజమయ్యాయని నర్సంపేట, అంథోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, క్రాంతి కిరణ్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కమలాపూర్‌లో బీజేపీ కార్యకర్త ప్రోద్బలంతోనే టెన్త్ హిందీ పేపర్ బయటకు వచ్చిందని, బీజేపీ కార్యకర్త ప్రశాంత్ బయటకు తెచ్చిన ప్రశ్నాపత్రాన్ని బండి సంజయ్‌కు వాట్సాప్ ద్వారా పంపించారని పేర్కొన్నారు. బాధ్యత గల ఎంపీగా తనకొచ్చిన సమాచారాన్ని బండి పోలీసులకు ఇవ్వకపోవడం నేరమేనన్నారు. సంజయ్‌పై స్పీకర్ అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు పేపర్ లీకేజీలను కావాలని సృష్టిస్తున్న బీజేపీ కుట్రలను బహిర్గతం చేసేందుకు పోలీసులు లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి బీజేపీ అగ్రనాయకత్వం చేసిన కుట్రలో భాగమే ఈ లీకేజీలనే అనుమానాలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పేపర్ లీక్ చేసిన వ్యక్తి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు పంపినట్లు తేలిందని వివరించారు.

క్లుప్తంగా...

ప్రజా ఉద్యమంగా పేపర్ లీకేజీ నిరసన

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు

పంజగుట్ట: తెలంగాణలో విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించారని, దేశంలోనే విద్యకు అతి తక్కువ బడ్జెట్ కేటాయిస్తున్న రాష్ట్రం ఇదేనని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న నిరసనను ప్రజా ఉద్యమంగా మార్చండి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.చక్రధర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ప్రసంగించారు.

టెన్త్ పరీక్షలు సరిగ్గా నిర్వహించకుంటే 'జైల్ భరో'

మాజీ ఎంపీ మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఇప్పటివరకు రెండు పరీక్షల పేపర్లు లీక్ కావడం దారుణమని, ఇప్పటికైనా ప్రభుత్వం టెన్త్ పరీక్షలను సక్రమంగా నిర్వహించకపోతే 'జైల్‌భరో' కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడారు. కాగా, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై విపక్షాలు, ప్రజాసంఘాలతో కలిసి పోరాడేందుకు మల్లు రవి చైర్మన్‌గా ఏర్పాటు చేసిన పోరాట కమిటీలో మరో ఆరుగురు సభ్యులను చేర్చారు.

గ్రూప్–1 పేపర్ లీక్‌పై దర్యాప్తు చేయండి

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో అవినీతిపై దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ నేతలు సీబీఐని కోరారు. ఈ మేరకు మల్లు రవి నేతృత్వంలో నేతలు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీబీఐ డైరెక్టర్‌కు రాసిన లేఖను మంగళవారం కోఠిలోని సీబీఐ కార్యాలయంలో అందించారు.

కుక్కలు, ఇతర జంతువుల దాడులతో ఏటా 18-20 వేల రేబిస్ మరణాలు
ఇందులో 93 శాతం మరణాలు కుక్కకాట్ల వల్లే సంభవిస్తున్న వైనం
దాడులకు పాల్పడుతున్న శునకాల్లో 63 శాతం వీధికుక్కలే
పరిశోధన వివరాలను ప్రచురించిన ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్

100 కోట్లు: ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుక్కల సంఖ్య.
70 కోట్లు: వివిధ దేశాల్లో వీధికుక్కల సంఖ్య.
ప్రపంచంలో వీధికుక్కలు లేని మొదటి దేశం నెదర్లాండ్స్
2030: రేబిస్ మరణాలను పూర్తిగా నియంత్రించేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలు నిర్దేశించుకున్న గడువు.



రెండు సెకన్లకో దాడి..

అరగంటకో మరణం

దేశంలో కుక్కల స్వైరవిహారం • ఐసీఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రతి రెండు సెకన్లకు ఒక కుక్కకాటు నమోదవుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఫలితంగా అరగంటకో మరణం సంభవిస్తున్నట్లు తేలింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ సంయుక్తంగా పరిశోధన నిర్వహించాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐజేఎంఆర్) ఈ అధ్యయన ఫలితాలను ప్రచురించింది.

దేశంలో కోటిన్నర వీధికుక్కలు...

- భారత్‌లో 2 కోట్ల కుక్కలు ఉండగా అందులో వీధికుక్కల సంఖ్య 1.53 కోట్లుగా ఉంది. వీధికుక్కలు పెరగడానికి ప్రధాన కారణం... వ్యర్థాలను తీసుకెళ్లే పద్ధతి సక్రమంగా లేకపోవడమేనని ఐసీఎంఆర్ అధ్యయనం పేర్కొంది. అందువల్లే వ్యర్థాలు ఉన్న దగ్గర వీధికుక్కల సంతతి పెరుగుతోందని విశ్లేషించింది.

3 రకాల శునకాలు..


- మనుషుల మీద ఆధారపడే దాన్ని బట్టి కుక్కలను ఇంట్లో పెంచుకొనేవి, సామాజిక అవసరాలకు ఉపయోగించేవి, వీధికుక్కలుగా విభజించారు. అయితే ప్రధానంగా వీధికుక్కలతోనే సమస్యలు వస్తున్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కుక్కల సంతతి నియంత్రణకు సరైన ప్రణాళికలు రచించకపోవడం, జంతు హక్కుల కార్యకర్తల కార్యకలాపాల వల్ల కుక్కకాట్లు అధికమవుతున్నాయి.

ఏటా సుమారు 20 వేల మంది మృతి

- ఐసీఎంఆర్-ఎయిమ్స్ అధ్యయనం ప్రకారం దేశంలో కుక్కకాట్లు, ఇతరత్రా జంతువుల కాటు కారణంగా సంభవించే రేబిస్‌తో ఏటా 18 వేల నుంచి 20 వేల మంది వరకు మృత్యువాతపడుతున్నారు. దేశంలో నమోదవుతున్న రేబిస్ మరణాల్లో 93% కుక్కకాటు ద్వారానే సంభవిస్తున్నాయి. అందులో 63% వీధికుక్కల ద్వారానే చోటుచేసుకుంటున్నాయి. పట్టణాల్లో 60%, గ్రామాల్లో 64% వీధికుక్కల ద్వారా రేబిస్ వ్యాప్తి చెందుతోంది.

ఆస్పత్రుల ప్రాంగణాల్లో తిష్ట...

దేశంలో ఎన్నో ఆసుపత్రులు కుక్కలకు ఆవాస కేంద్రాలుగా ఉంటున్నాయి. రోగులు పడేసే ఆహార వ్యర్థాలను తింటూ అక్కడే తిష్ట వేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. తిండి దొరకనప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహణ సరిగ్గాలేని శవాగారాల్లోకి చొరబడి శవాలను సైతం పీక్కుతింటున్నాయి.



కుక్కల నియంత్రణ ఇలా...

- దేశవ్యాప్తంగా ఏకకాలంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ కష్టసాధ్యమైనందున నోటి ద్వారా వేసే టీకాలను అభివృద్ధి చేసి కుక్కలకు ఆహారంలో కలిపి అందించాలి. దీనివల్ల వాటి జాతిని వీలైనంత మేర కట్టడి చేయవచ్చు.
- వీధికుక్కల కట్టడికి మున్సిపాలిటీ, వెటర్నరీ, ఎన్జీవోలు, కుక్కల సంరక్షణ కేంద్రాలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి.
- వీధికుక్కల వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలను చైతన్యపరచాలి.

అక్రమాలకు పాల్పడితే ఉద్యోగాలు పోతాయ్

టెన్త్ పరీక్షల్లో నిర్లక్ష్యం సహించం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి హెచ్చరిక
- అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారంటూ అసంతృప్తి
- మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచన
- పేపర్లు లీక్ కాలేదని, ఎవరూ ఆందోళన చెందొద్దని విజ్ఞప్తి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సబిత

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడేవారిని ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగిస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న పరీక్షలను అధికారులు తేలికగా తీసుకుంటున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో టెన్త్ ప్రశ్నపత్రాలు లీక్ కాలేదని, మాస్ కాపీయింగ్ వంటిదేమీ జరగలేదని, ఈ విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణపై మంత్రి మంగళవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడారు.

జిరాక్స్ షాప్‌లను మూసివేయించండి

ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలను చేపట్టిందని సబిత తెలిపారు. పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఈ విషయంలో ఏవిధమైన అపోహలకు, అనుమానాలకు తావు లేదని పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మిగతా నాలుగు పరీక్షల నిర్వహణ విషయంలో మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. ఈ పరీక్షల నిర్వహణలో దాదాపు 55 వేల మంది అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు, ఎల్రక్టానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దని చెప్పారు. పరీక్షల విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బందికి కూడా ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేశారు. పరీక్షా పేపర్ల రవాణా విషయంలో మరింత భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేయడంతో పాటు జిరాక్స్ షాప్‌లను మూసి వేయించాలని అన్నారు.

కీలక అధికారుల్లో సమన్వయం లేదు

అధికారుల మధ్య సమన్వయం పూర్తిగా దెబ్బతిన్నదని, కీలకమైన అధికారులు తమకు నచ్చినట్టు పనిచేయడం వల్లే ఇలాంటి పరిణామాలు తలెత్తుతున్నాయని విద్యాశాఖ అధికారులతో మంత్రి సబిత అన్నారు. లీకేజీల వ్యవహారంలో ఓ ముఠా పని చేస్తోందనే అనుమానాలు పాఠశాల విద్య కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళేందుకు ఓ అధికారి ప్రయత్నించడంపై మంత్రి ఆరా తీసినట్టు తెలిసింది. పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని ప్రతిపక్షాలు ఆయుధంగా తీసుకుంటున్నాయని, అధికారులు తమకేమీ పట్టనట్టు ఉండటంలో ఉద్దేశమేంటని ప్రశ్నించినట్టు సమాచారం. ఇంటర్ పరీక్షల విషయంలో బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ తీసుకున్న ముందస్తు చర్యలను ప్రస్తావించిన మంత్రి.. వాటిని ఆదర్శంగా తీసుకునే ప్రయత్నం చేయాలని సూచించినట్లు తెలిసింది.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

టెన్త్ పరీక్షల విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసే విధంగా ప్రతిపక్షాలు దుందుడుకుగా వ్యవహరిస్తున్నాయని మంత్రి విమర్శించారు. తమ రాజకీయాల కోసం విద్యార్థులను పావుగా ఉపయోగించుకోవడం ప్రతిపక్షాలకు తగదని హితవు పలికారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రకు బలికావద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ముందస్తు పథకం ప్రకారమే అవుట్

- విద్యార్థులకు చీటీలు అందించేందుకు బందెప్ప, సమ్మప్ప ప్లాన్
- వాట్సాప్‌లో ప్రశ్నపత్రం రాగానే జవాబులు తయారు చేసిన సమ్మప్ప
- తాండూరు జిరాక్స్ సెంటర్‌లో మైక్రో జిరాక్స్ తీయించిన వైనం
- అప్పుడే పట్టుకున్న పోలీసులు



ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

తాండూరు: ఇద్దరు టీచర్లు ముందస్తుగా వేసుకున్న పథకం మేరకే తాండూరులో సోమవారం టెన్త్ తెలుగు ప్రశ్నపత్రం బయటకు వచ్చిందని తేలింది. పేపర్ బయటకు వచ్చిన తర్వాత విద్యార్థులకు చీటీలు అందించాలని వారు ప్లాన్ వేశారని తాండూరు సీఐ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే వారిద్దరూ ఎవరి కోసం ఈ పని చేశారనే దానిపై ప్రకటనలో స్పష్టత కొరవడింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల–1 పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ (రిలీవర్)గా విధులు నిర్వహించిన బందెప్ప, చెంగోల్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు ఎస్.సమ్మప్ప స్నేహితులు. టెన్త్ క్లాస్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా బందెప్పకు విద్యాశాఖ అధికారులు డ్యూటీ వేయడంతో.. విద్యార్థులకు చీటీలు అందించాలని ఇద్దరూ పథకం వేశారు. ఇందులో భాగంగానే 5వ నంబర్ గదిలో ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ నుంచి బందెప్ప ప్రశ్నపత్రం తీసుకున్నాడు. ఆఫీస్ రూమ్‌లో దాచిపెట్టిన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి సమ్మప్పకు పంపించాడు. ఈ సమయంలోనే సమ్మప్పతో పాటు బిగ్‌న్యూస్ అనే వాట్సాప్ గ్రూపులోకి కూడా ఫొటోలు వచ్చాయి. కొద్ది సేపటి తర్వాత ఈ విషయాన్ని గుర్తించిన బందెప్ప గ్రూప్ నుంచి ఫొటోలు డిలీట్ చేశాడు. కానీ అప్పటికే కొంతమంది సభ్యులు బందెప్ప పంపిన ఫొటోలు స్క్రీన్ షాట్లు తీసి వైరల్ చేశారు.

పలు సెక్షన్ల కింద కేసులు.. రిమాండ్

సమ్మప్ప ప్రశ్నపత్రం తన వద్దకు రాగానే జవాబులు తయారు చేసి పట్టణంలోని విద్య జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి విద్యార్థులకు పంపించేందుకు మైక్రో జిరాక్స్ తీయించాడు. అయితే అప్పటికే పరీక్షా కేంద్రంలో బందెప్పను విచారించిన తాండూరు పోలీసులు, అతనిచ్చిన సమాచారంతో సమ్మప్ప వద్దకు చేరుకున్నారు. సమ్మప్ప గైడ్‌ల నుంచి సేకరించిన ప్రశ్నపత్రంలోని జవాబులను జిరాక్స్ సెంటర్ వద్ద స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం బందెప్ప, సమ్మప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు శివ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

ఆగని లీక్‌లపై ఆందోళన

విద్యార్థుల్లో పెరుగుతున్న టెన్షన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాల వరుస లీకేజీల ఘటనలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్నాళ్లుగా బోర్డు పరీక్షలకు సిద్ధమైన విద్యార్థుల్ని 'పరీక్షలు రద్దు చేస్తారా?' అనే భయం వెంటాడుతోంది. మరోవైపు తాము కష్టపడి చదివి పరీక్షలు రాస్తే ప్రశ్నపత్రాల లీకేజీల ద్వారా అందిన పేపర్లతో కొంత మందికి మంచి మార్కులు సంపాదిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. లీకైన పేపర్‌తో ఏదైనా పాఠశాలకు సంబంధం ఉందని తేలితే అక్కడ చదివే విద్యార్థులందరూ బలయ్యే అవకాశం ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా..టెన్త్ పేపర్ల లీకేజీ వ్యవహారం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ ఝాన్సీ విమర్శించారు. ఈ ఘటనలపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

'విద్యాశాఖ మంత్రిని తొలగించాలి'

సాక్షి, హైదరాబాద్: కేబినెట్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితను వెంటనే బర్తరఫ్ చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టెన్త్ తెలుగు, హిందీ పేపర్ల లీకేజీపై న్యాయ నిపుణులతో చర్చించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఒక ప్రకటనలో సూచించారు. లీకేజీ వెనకాల ఎంతటి వారున్నా వదిలిపెట్టవద్దని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు టీచర్లపై వేటు

- సర్వీస్ నుంచి తొలగించిన విద్యాశాఖ
- టెన్త్ పేపర్ల లీక్‌పై చర్యలు
- ఇద్దరు అధికారుల సస్పెన్షన్.. విద్యార్థి ఐదేళ్ల డిబార్

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పేపర్ల లీక్‌కు సంబంధించి ముగ్గురు టీచర్లపై విద్యాశాఖ వేటు వేసింది. తాండూరు ఘటనలో ఇద్దరు, కమలాపూర్ ఘటనలో ఒక టీచర్‌ను సర్వీస్‌నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ శ్రీదేవసేన మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో తెలుగు పేపర్ లీకేజీ ఘటనలో నిందితులుగా ఉన్న ఎస్.బందెప్ప, సమ్మప్పపై.. విచారణ బృందం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నట్టు ప్రకటించారు. మరోపక్క హనుమకొండ జిల్లా కమలాపూర్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో పేపర్ బయటకు వెళ్లిన ఘటనకు బాధ్యుడిగా ఆ రూమ్ ఇన్విజిలేటర్‌గా ఉన్న సబియా మదావత్‌ను సర్వీస్ నుంచి తొలగించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శివప్రసాద్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ టి.శ్రీధర్‌ను సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్టు శ్రీదేవసేన తెలిపారు. విద్యార్థి శివకుమార్‌ను ఐదేళ్ల పాటు డిబార్ చేసినట్టు వివరించారు.

పోస్టల్ ఉద్యోగుల అలసత్వమే..

- సిబ్బంది లేకుండానే ఆటోలో జవాబు పత్రాలు
- తొమ్మిది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం
- పేపర్ల బండిల్ మిస్సింగ్ కేసులో మొదలైన విచారణ
- ఇద్దరు పోస్టాఫీస్ సిబ్బందిపై వేటు



సోమవారం టెన్త్ జవాబు పత్రాలతో వెళ్తున్న ఆటోకు సంబంధించిన సీసీటీవీ దృశ్యం

సాక్షి, ఆదిలాబాద్/ఉట్నూర్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో పదో తరగతి జవాబు పత్రాల బండిల్ మిస్సింగ్ కేసులో పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే కనిపిస్తోంది. సోమవారం ప్రథమ భాష పరీక్ష తర్వాత జవాబు పత్రాలను పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఉట్నూర్ పోస్టాఫీసుకు అందించారు. ఇక్కడ బండిళ్లను తయారు చేసి బస్సు ద్వారా వరంగల్‌కు పంపించాలి. పోస్టాఫీస్ నుంచి ఆటోలో సిబ్బంది ఎంటీఎస్, ఈడీ ప్యాకర్ వెంటఉండి వాటిని బస్టాండ్‌కు తరలించాలి. అయితే ఈ సిబ్బంది ఎవరూ వెంట లేకుండానే ఆటోలో వేసి వారు తమ ద్విచక్ర వాహనం ద్వారా వెళ్లారు. బస్టాండ్‌కు వెళ్లిన తర్వాత 11 బండిల్స్ (కట్ట) నుంచి ఒకటి మిస్ అయ్యింది. పోస్టుమాస్టర్ ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని పేపర్ బండిల్ కోసం వెతికినప్పటికీ దొరకలేదు. మంగళవారం ఉదయం కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీఈవో ప్రణీత ఉట్నూర్ చేరుకున్నారు. మొదట పోస్టాఫీసుకు వెళ్లగా సెలవు కారణంగా వారు అందుబాటులో లేరు. దీంతో వీరు స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరుకొని డీఎస్పీ నాగేందర్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న అధికారులు పూర్తి విషయాలపై ఆరా తీశారు. కాగా, నిజామాబాద్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్‌రావు ఉట్నూర్ చేరుకొని బండిల్ మిస్సింగ్ విషయంలో విచారించారు. ఇదిలా ఉంటే పోలీసులు పోస్టల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఆటో వెళ్లిన దారిలో రోడ్డు పక్కన ఉన్న సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం వరకు పేపర్ బండిల్ దొరకలేదు. పరీక్ష రాసిన 9 మంది విద్యార్థుల జవాబు పత్రాల బండిల్ మిస్సింగ్‌తో ఆ విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

ఇద్దరిపై వేటు

టెన్త్ జవాబు పత్రాల బండిల్ మిస్సింగ్ ఘటనలో పోస్టాఫీస్ ఉద్యోగి ఎంటీఎస్ రజితపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ క్రమంలోనే ఆమె అస్వస్థతకు గురికాగా ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నాగరాజును బాధ్యతల నుంచి తప్పించారు.

మల్యాలలో సిట్ దూకుడు..!

- గ్రూప్–1లో 100 మార్కులు దాటిన వారిని విచారించిన అధికారులు
- 40 మంది పరీక్ష రాసినట్లు గుర్తించిన బృందం
- అభ్యర్థుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న అధికారులు



మల్యాలలో విచారణ చేస్తున్న సిట్ దర్యాప్తు బృందాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మల్యాల: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) దూకుడు పెంచింది. ఈ కేసులో ఏ-2 అట్ల రాజశేఖర్‌రెడ్డి జగిత్యాల జిల్లా మల్యాల మండలానికి చెందినవాడు కావడం, ఇక్కడి నుంచి 100 మందికిపైగా అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1లో 100 మార్కులు సాధించారన్న ఆరోపణలు రావడంతో సిట్ అధికారులు ఈ మండలంపై దృష్టి సారించారు. 40 మంది అభ్యర్థుల జాబితాతో మంగళవారం సిట్ ఐదు బృందాలుగా రంగంలోకి దిగింది. 20 మంది అభ్యర్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రశ్నించింది. పరీక్షకు ముందు ఎక్కడున్నారు.. ఎక్కడ కోచింగ్ తీసుకున్నారు.. ఎన్ని మార్కులు వచ్చాయి.. గతంలో ఏమైనా పరీక్షలు రాశారా.. అందులో ఎన్ని మార్కులు వచ్చాయి.. అని ఆరా తీశారు. గతంలో వచ్చిన మార్కులకు.. తాజాగా వచ్చిన మార్కులకు మధ్య వ్యత్యాసాన్ని సరిపోలుస్తూ.. వారి ప్రతిభ, సామర్థ్యాలను అంచనా వేశారు. మల్యాల మండలం నుంచి గ్రూప్–1 పరీక్ష రాసినవారిలో కేవలం ఐదుగురికి 100 మార్కులు దాటాయని, మిగిలినవారికి 100లోపే వచ్చాయని సమాచారం. సిట్ సభ్యులు అడిగిన ప్రశ్నల ఆధారంగా అభ్యర్థుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు. ఈ విచారణ మరో రెండు, మూడు రోజులపాటు కొనసాగే అవకాశం ఉంది.

వీడియో కాల్‌లోనూ విచారణ

సిట్ విచారణ సమయంలో కొందరు అభ్యర్థులు అందుబాటులో లేరు. దీంతో వారి కుటుంబసభ్యుల సహకారంతో వీడియో కాల్ చేసి అభ్యర్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అదే సమయంలో అభ్యర్థుల్లో ఎవరెవరు విదేశాల నుంచి వచ్చారు.. అనే విషయంపైనా ఆరా తీశారు. ఇప్పటికే సిట్ స్థానిక పోలీసుల సాయంతో పరీక్షకు ముందు యూరోపా, అమెరికా, న్యూజిలాండ్ నుంచి ఎవరైనా అభ్యర్థులు వచ్చారా..? అన్న విషయంపై సమగ్ర సమాచారం సేకరించింది. మరోవైపు కరీంనగర్‌లోనూ కొందరు సహకారం అందజేశారని సమాచారం. ఆ వ్యక్తుల సమాచారం సైతం సిట్ ఇప్పటికే సేకరించిందని తెలిసింది.

సిట్ కస్టడీకి ఆ ముగ్గురూ..

- తిరుపతయ్య, ప్రశాంత్, రాజేంద్రకుమార్‌ను మూడు రోజులు విచారించనున్న అధికారులు
- వేరే వారికి కూడా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు ఇచ్చారా అనే కోణంలో విచారణ

సాక్షి,హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ స్కాంకు సంబంధించి ముగ్గురు నిందితులను సిట్ అధికారులు మంగళవారం కస్టడీలోకి తీసుకున్నారు. తిరుపతయ్య, ప్రశాంత్, రాజేంద్రకుమార్‌లను 3 రోజులపాటు విచారించేందుకు చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకొని కింగ్‌కోఠి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించారు. ఆపై తమ కార్యాలయానికి తరలించి విచారణ ప్రారంభించారు. గురువారం వరకు వారిని ప్రశ్నించనున్నారు. ఏఈ ప్రశ్నపత్రం విక్రయంలో మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం మన్సూర్‌పల్లి తండా సర్పంచ్ కుమారుడు కేతావత్ రాజేశ్వర్ అలియాస్ రాజు కీలకంగా వ్యవహరించాడు. అతని ద్వారానే తిరుపతయ్య ఈ స్కామ్‌లో ఇరుక్కున్నాడు. ఎనిమిదేళ్లుగా గండీడ్ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇతడికి తిరుపతయ్యతో పరిచయం ఉంది. ఏఈ పరీక్ష రాసే అభ్యర్థులను తీసుకురావాలని, ప్రశ్నపత్రం విక్రయించగా వచ్చిన సొమ్ములో కమీషన్ ఇస్తానని రాజేశ్వర్ ఎర వేశాడు. దీంతో తిరుపతయ్య 'ఉపాధి హామీ' ద్వారా పరిచయమైన రాజేంద్రకుమార్, ప్రశాంత్‌ను సంప్రదించాడు. వారిని రాజేశ్వర్ వద్దకు తీసుకువెళ్లి బేరసారాలు చేశాడు. అడ్వాన్స్ తీసుకుని మరో నిందితుడు డాక్యా ద్వారా ఓ లాడ్జి వద్ద ప్రశ్నపత్రం ఇప్పించాడు. వాళ్లు అడ్వాన్స్‌గా రూ.8 లక్షలు ఇచ్చారు.

ఈ ప్రశ్నపత్రాలు మరెవరికైనా చేరాయా?

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు మరెవరికైనా చేరాయా అనే కోణంపై సిట్ దృష్టి పెట్టింది. దీనికోసమే ఈ ముగ్గురు నిందితులను ప్రశ్నించే అవకాశముంది. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 100కుపైగా మార్కులు పొందిన 121 మందిని ప్రశ్నించే ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేయాలని భావిస్తోంది. ఈ నెల 11న హైకోర్టుకు స్టేటస్ రిపోర్టు సమర్పించాల్సి ఉండటంతో ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు అభ్యర్థులను సిట్ ఆఫీసుకుపిలిచి విచారించగా మంగళవారం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లి అభ్యర్థులను ప్రశ్నిస్తున్నారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



టేకుమట్లలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

జైపూర్: పదో తరగతి పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించలేని కేసీఆర్ ప్రభుత్వానికి పరిపాలించే అర్హత లేదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. దీనికి బాధ్యతగా విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 20వ రోజు మంగళవారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గంగిపల్లి నుంచి ఎల్కంటి మీదుగా టేకుమట్ల గ్రామం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి భట్టి మాట్లాడారు. వరంగల్, తాండూర్‌లో టెన్త్ ప్రశ్నప్రతాల లీకేజీపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నప్రతాల లీకేజీతో ఇప్పటికే నిరుద్యోగులు నిరాశ చెందుతుండగా ఇప్పుడు టెన్త్ పేపర్ లీక్‌తో విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఓపెన్‌కాస్టులే ఉండవన్న కేసీఆర్ ఇప్పుడు ఓపెన్ కాస్టు గనులను ఏర్పాటు చేస్తూ ఏపీకి చెందిన వ్యక్తులకు ప్రాజెక్టు అప్పగించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని భట్టి ఆరోపించారు. జైపూర్ పవర్ ప్లాంటును కూడా ప్రైవేటుకు అప్పగించి స్థానికులకు అన్యాయం చేశారన్నారు. ఆనాటి ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని తీసేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి అక్రమంగా దోపిడీకి పాల్పడగా.. ఆ ప్రాజెక్టుల ముంపుతో ఏటా రైతులు వేల ఎకరాల్లో పంటలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరోసారి కేసీఆర్ వస్తే సింగరేణి సంస్థ భవిష్యత్‌లో ఉండదని, దోపిడీ రాజ్యం పోవాలని ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా...

బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం: సీఎం



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త, భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకమని, దళిత సమాజాభివృద్ధికి గొప్ప సేవలందించారని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయవేత్తగా, సామాజిక సమానత్వం కోసం ఆయన జీవితకాల పోరాటం చేశారని తెలిపారు. సంస్కరణ శీలిగా భారతదేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచివుండే గొప్ప దార్శనికుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.

మహావీరునికి సీఎం నివాళి

సత్యాన్వేషణ ద్వారానే మానవ జీవితానికి అర్థవంతమైన దారి దొరుకుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. జైన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుని జయంతి సందర్భంగా సీఎం శుభాకాంక్షలు తెలిపారు.


సీఎం తప్పు మాట్లాడితే రాజీనామా చేస్తా: దానం



సాక్షి, హైదరాబాద్: 'ఏ అంశం మీదనైనా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో చర్చించేందుకు బీజేపీ మేధావులు రావొచ్చు. చర్చలో సీఎం తప్పుగా మాట్లాడితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా'అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్‌తో కలిసి నాగేందర్ మంగళవారం బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రాణాలు కాపాడే మందులపై కేంద్ర ప్రభుత్వం పన్నులు విధించడం దుర్మార్గమన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ వెనుక బీజేపీ కుట్రలు ఉన్నట్లు అర్థమవుతోందని గాదరి కిషోర్ అన్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాని మోదీ తన విద్యార్హత గురించి స్పష్టత ఇవ్వాలని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు.

టెన్త్ పరీక్షలు కూడా సరిగా నిర్వహించకపోతే ఎట్లా మేడం?

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్ష పత్రాలు లీకవుతున్న తీరుపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విస్మయం వ్యక్తం చేశారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి ఈ మేరకు ట్విట్టర్‌లో కామెంట్ చేశారు. 'మంత్రి గారూ.. కనీసం టెన్త్ పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేకపోతే ఎట్ల మేడం? 'అని ప్రశ్నించారు.

కేసీఆర్ అవినీతిపై చర్యలేవీ: పొన్నాల



సాక్షి, హైదరాబాద్: దేశంలో అత్యంత అవినీతి ముఖ్యమంత్రి కేసీఆరేనని గతంలో చాలా సార్లు ప్రధానిమోదీ, బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఆరోపించారని, కానీ కేసీఆర్ చేస్తున్న అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమికి చైర్మన్‌ను చేస్తే దేశ వ్యాప్తంగా ఎన్నికలకు ఖర్చు పెడతానని చెప్పేంత స్థాయిలో కేసీఆర్‌కు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని వ్యాఖ్యానించారు.

సీఎం నిర్ణయం చరిత్రాత్మకం

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై పలు సంఘాలు, మేధావుల హర్షం



మాట్లాడుతున్న సుఖ్‌దేవ్ తోరట్. చిత్రంలో ఘంటా చక్రపాణి, అల్లం నారాయణ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): నగరం నడిబొడ్డున అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు, సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం పట్ల పలు సంఘాలు, జాతీయ మేధావులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం రవీంద్రభారతిలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, సమత, సైనిక్‌దళ్, ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూజీసీ మాజీ చైర్మన్ సుఖ్‌దేవ్ తోరట్ మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ యావత్ సమాజానికి దిశానిర్దేశం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి మాట్లాడుతూ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తు విగ్రహం సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారి పరిపాలన భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు. అనంతరం రవీంద్రభారతి నుంచి ట్యాంక్‌బండ్ వద్ద నిర్మిస్తున్న 125 అడుగుల విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

చాంబర్‌లోకి తొలుత సీఎం

- ఆ తర్వాత మంత్రులు, అధికారులు, సిబ్బంది
- 30న కొత్త సచివాలయం ప్రారంభోత్సవంపై సమీక్షలో కేసీఆర్
- పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం కార్యక్రమం
- ప్రారంభోత్సవానికి 2,500 మంది



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 30న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ భవన సముదాయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్షించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. దీని ప్రకారం సచివాలయం ప్రారంభం కాగానే ముందుగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తన చాంబర్‌లో ఆసీనులు కానున్నారు. ఆ తర్వాత మంత్రులు, కార్యదర్శులు సీఎంవో, సచివాలయ సిబ్బంది వారి చాంబర్లలోకి వెళ్లి కూర్చోనున్నారు. సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఉదయం శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ప్రారంభ కార్యక్రమం జరగనుంది. సంబంధిత సమయాన్ని త్వరలో ప్రకటించనున్నారు. సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని శాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్లు, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు మేయర్లు తదితరులు కలిపి దాదాపు 2,500 మంది హాజరవుతారని అంచనా.

నాలుగు ద్వారాలు

నూతన సచివాలయంలో రక్షణ సహా పలు రకాల పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. సచివాలయం నాలుగు దిక్కుల్లో ప్రధాన ద్వారాలున్నాయి. తూర్పు ద్వారాన్ని (మెయిన్ గేట్) ముఖ్యమంత్రి, సీఎస్, డీజీపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, చైర్మన్లు ఇంకా ముఖ్యమైన ఆహ్వానితులు, దేశ, విదేశీ అతిథులు, ప్రముఖుల కోసం మాత్రమే వినియోగించనున్నారు. వాయవ్య (నార్త్-వెస్ట్) ద్వారాన్ని అవసరం వచ్చినప్పుడే తెరవనున్నారు. ఈశాన్య (నార్త్-ఈస్ట్) ద్వారం గుండా సచివాలయ సిబ్బంది కార్యదర్శులు, అధికారుల రాకపోకలు సాగించనున్నారు. అదే వైపు పార్కింగ్ కూడా ఉండనుంది. ఆగ్నేయ (సౌత్-ఈస్ట్) ద్వారాన్ని కేవలం సందర్శకుల కోసమే తెరవనున్నారు. సచివాలయ సందర్శన సమయం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఉండనుంది. వికలాంగులు, వృద్ధుల కోసం విద్యుత్‌తో నడిచే బగ్గీల ఏర్పాటు చేయనున్నారు. ప్రైవేటు వాహనాలకు సచివాలయంలోకి అనుమతి లేదు. సచివాలయ రక్షణకు సంబంధించి డీజీపీ విధివిధానాలు రూపొందించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

సమీక్షలో సీఎం తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు...

- ఖాళీ జాగలున్న వారికి రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించే గృహలక్ష్మి పథకం అమలుకు సత్వరమే విధివిధానాలను రూపొందించాలి.
- పోడు భూముల పట్టాల పంపిణీని త్వరలో ప్రారంభించాలి.
- దళితబంధు పథకాన్ని కొనసాగించాలి.
- గొర్రెల పంపిణీని సత్వరమే ప్రారంభించాలి.

..వేడుకగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించతలపెట్టిన విగ్రహావిష్కరణ, అనంతరం నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై సీఎం కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బౌద్ధ సంప్రదాయ పద్ధతిలో...

'ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పూల జల్లు కురిపిస్తూ ఘనమైన రీతిలో పుష్పాంజలి ఘటించాలి. గులాబీలు, తెల్ల చామంతి, తమలపాకులతో అల్లిన భారీ పూలమాలను రూపొందించాలి. బౌద్ధ భిక్షువులను ఆహ్వానించి వారి సంప్రదాయ పద్ధతిలోనే కార్యక్రమాన్ని నిర్వహించాలి'అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అత్యద్భుతంగా విగ్రహం ఆవిష్కృతమైంది..

'ఊహించినదానికంటే అత్యద్భుతంగా విగ్రహ రూపం ఆవిష్కృతమైంది. ప్రసన్నవదనంతో నిలుచుని వున్న అంబేడ్కరుడు ఒక తాత్విక జ్ఞానిగా అలరిస్తున్నాడు'అని సీఎం కేసీఆర్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. విగ్రహ రూపశిల్పి, 98 ఏళ్ల పద్మభూషణ్, రామ్‌వంజీ సుతార్ కృషిని ప్రశంసించారు. ఆయన్ను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించాలని నిర్ణయించారు.

ఆశయాల అనుసరణ కోసమే..

'సామాజిక న్యాయం కోసం పోరాడిన అంబేడ్కర్ కృషి, త్యాగం అజరామరం. దళితులు, గిరిజనులు బహుజనులు, భారతదేశ ప్రజలే కాదు... వివక్షను ఎదుర్కొనే ప్రతి చోటా అంబేడ్కర్ ఆశయం సాక్షాత్కారమవుతుంది. అంబేడ్కర్ విశ్వమానవుడు. అత్యున్నత స్థాయిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అంటే ఆయన అత్యున్నత ఆశయాలను అనుసరించేందుకు నిత్యం స్ఫూర్తి పొందడమే' అని సీఎం అన్నారు. ఆయన ఆశల కోసం ప్రజాప్రతినిధులు, యావత్ ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలనే గొప్ప సంకల్పంతోనే రాష్ట్ర సచివాలయానికి ఆయన పేరు పెట్టుకున్నామన్నారు. నాలుగు దశాబ్దాల కిందే తాను ఎమ్మెల్యేగా దళితుల స్థితిగతులను, ప్రపంచంలోని అణగారిన వర్గాలతో పోల్చుతూ అధ్యయనం చేయాలనే తలంపుతో 'సెంటర్ ఫర్ సబాల్టర్న్ స్టడీస్'అనే అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. అంటరానితనం పేరుతో దుర్మార్గమైన రీతిలో వివక్షకు గురవుతున్న దళితుల అభ్యున్నతికి, అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం అంబేడ్కర్ పడిన శ్రమ, చేసిన కృషిని ఆసియా ఖండంలో మరొకరు చేయలేదని స్పష్టం చేశారు.

సమావేశంలో సీఎం తీసుకున్న నిర్ణయాలు

- విగ్రహావిష్కరణకు సచివాలయ అధికారులు, సిబ్బంది, అన్ని శాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు హాజరుకావాలి.
- ప్రతి నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున మొత్తం 119 నియోజకవర్గాల నుంచి 35,700 మంది బహిరంగ సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- అంబేడ్కర్ పాటలు ఆ మహనీయునికి తెలంగాణ సాంస్కృతిక నీరాజనం అర్పించాలి.
- అంబేడ్కర్ మునిమనవడు ప్రకాశ్ అంబేడ్కర్‌ను ఏకైక ముఖ్యఅతిథిగా ఆహ్వానించాలి.

మధ్యాహ్నం 2 గంటలకు సభ..

ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభమై 5 గంటలకు ముగుస్తుంది. సీఎస్ శాంతి కుమారి ప్రారంభోపన్యాసం తర్వాత సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ముఖ్య అతిథి ప్రకాశ్ అంబేడ్కర్ ప్రసంగిస్తారు. అనంతరం సీఎం కేసీఆర్ సందేశం ఉంటుంది.

తమ్మినేని వర్సెస్ షర్మిల

- కమ్యూనిస్టులు బీఆర్‌ఎస్‌కు బీ టీం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సమక్షంలోనే షర్మిల విమర్శలు
- షర్మిల వ్యాఖ్యలను ఖండించిన తమ్మినేని
- తమ ఆఫీసులో విమర్శ సరికాదని హితవు



మీడియాతో మాట్లాడుతున్న తమ్మినేని. చిత్రంలో షర్మిల

సాక్షి, హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల మధ్య రాజకీయ దుమారం చెలరేగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగ సమస్యపై కలసి పనిచేసే అంశంపై చర్చించేందుకు మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన షర్మిల... కాసేపు తమ్మినేని వీరభద్రంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై పోరు కోసం టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో తెలంగాణ స్టూడెంట్స్ యాక్షన్ ఫర్ వేకెన్సీస్ అండ్ ఎంప్లాయిమెంట్ (టీ-సేవ్) అనే ఫోరం ఏర్పాటుకు ప్రతిపాదించారు. అనంతరం షర్మిల, తమ్మినేని విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి మధ్య వాదనలు తలెత్తాయి.

ఇద్దరి మధ్య విమర్శలు.. ప్రతివిమర్శలు

'సీపీఎం చేసిన ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు వైఎస్సార్‌టీపీ మద్దతివ్వలేదని తమ్మినేని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అన్నా.. (తమ్మినేనిని ఉద్దేశించి) ఎప్పుడైనా విపక్ష పార్టీలకు కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారా? ఈ అంశంపై నాకు ఎప్పుడైనా ఫోన్ చేశారా? నేను బీజేపీకి బీ టీం అయినట్లు, నేను నాటకాలు ఆడుతున్నట్లు తమ్మినేని ఆరోపిస్తున్నారు. నాటకాలు మేము ఆడలేదు. మునుగోడు ఉప ఎన్నికలో కేసీఆర్‌కు బీ టీంగా పనిచేసింది కమ్యూనిస్టులే. వైఎస్సార్‌టీపీ ఇంతవరకు ఏ పార్టీకి బీ టీంగా పనిచేయలేదు'అని షర్మిల తమ్మినేని ముందే నిలదీశారు. దీంతో పక్కనే ఉన్న తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ 'వైఎస్సార్ కూతురిగా, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలిగా సీపీఎం కార్యాలయానికి వచ్చి మాతో మాట్లాడతామంటే ఆహ్వానించాం. కానీ సోదరి ఆ మర్యాద నిలుపుకోవట్లేదు. పార్టీలకు రాజకీయ వైఖరులు ఉంటాయి. మునుగోడులో మేము ఏమీ చాటుగా చేయలేదు. బాహాటంగానే బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నాం. దానికిగల రాజకీయ వైఖరి ఏమిటో చెప్పాం. పైకొకటి లోనకటి చేసే రాజకీయ పార్టీ కాదు సీపీఎం. ఇదొక జాతీయ పార్టీ. వారికి బీ టీం.. వీరికి బీ టీం అని మా ఆఫీసుకు వచ్చి మాట్లాడే సాహసం చేయడం మంచిది కాదు. ఆమె మాట్లాడినట్లుగా నేను మాట్లాడలేను. ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా'అని పేర్కొన్నారు. అయితే షర్మిల వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. కాగా, నిరుద్యోగ సమస్యపై విపక్షాల ఐక్య పోరాటానికి షర్మిల చేసిన ప్రతిపాదనపై తమ పార్టీ కమిటీలో చర్చించి నిర్ణయం చెబుతామన్నారు. అయితే దేశంలో మతోన్మాదానికి ఆజ్యంపోయడంతోపాటు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీతో కలసి రాష్ట్రంలో పోరాడే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు.

కూనంనేనికి వినతిపత్రం...

తమ్మినేనితో భేటీ అనంతరం షర్మిల సీపీఐ కార్యాలయానికి వెళ్లారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో భేటీ అయ్యారు. నిరుద్యోగుల సమస్యలపై కలసి పోరాడదామని విజ్ఞప్తి చేస్తూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై అన్ని పార్టీలు కలిసొచ్చి 'టీ-సేవ్'ఏర్పాటు చేద్దామని తాను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఎవరు ప్రతిపాదించారనేది ముఖ్యంకాదని, ఎవరో ఒకరు ప్రతిపాదించకపోతే ముందుకు వెళ్లదన్నారు. కూనంనేని తమ ఆహ్వానాన్ని స్వాగతించారన్నారు. బీజేపీయేతర కూటమి అయితే కలసి రావడానికి సిద్ధమని చెప్పారన్నారు. కూనంనేని మాట్లాడుతూ షర్మిల ప్రతిపాదనపై తమ పార్టీ కమిటీలో మాట్లాడతామని చెప్పారు.

సీట్ల సర్దుబాటుతోనే రాజకీయ ఐక్యత

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని స్పష్టీకరణ
- బీఆర్‌ఎస్ ఐకమత్యంతో వ్యవహరించాలని వ్యాఖ్య... ఎన్నికల్లో సీపీఎం, సీపీఐలు కీలకపాత్ర పోషిస్తాయని వెల్లడి



తమ్మినేని




కూనంనేని

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలని సీపీఎం, సీపీఐ భావిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతామని, తమ బలాన్ని పెంచుకుంటామని చెప్పా రు. బీజేపీ తప్పుడు పద్ధతుల్లో రాష్ట్రంలో ఎదిగేందుకు, అధికారం దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. వామపక్ష భావజాలం బలంగా ఉన్న, సాయుధ పోరాటం జరిగిన తెలంగాణలో బీజేపీ అడుగుపెట్టాలనుకోవడం దుస్సాహసమేనని పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న బీఆర్‌ఎస్ ఐకమత్యంతో వ్యవహరించాలని, రాబో యే ఎన్నికల్లో వీలైతే బీఆర్‌ఎస్‌తో సీట్ల సర్దుబాటు పొత్తు కుదుర్చుకుంటామని చెప్పారు. 2024 ఎన్నికల్లో పొరపాటున బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం విచ్ఛిన్నం కాక తప్పదన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేసే క్రమంలోనే తెలంగాణలో తాము ఏకమయ్యామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో తమ్మినేని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆ రెండు పార్టీల నేతలు చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, చెరుపల్లి సీతారాములు, జాన్‌వెస్లీ సమావేశమయ్యారు. అనంతరం తమ్మినేని, కూనంనేని మీడియాతో మాట్లాడారు.

షర్మిల తీరు హాస్యాస్పదం: కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో భాగస్వామి అయితే ఆమెను విచారించడాన్ని, శిక్ష విధించడాన్ని తమ పార్టీ లు సమర్థిస్తాయని తమ్మినేని అన్నారు. అయితే కవితపై పెడుతున్న కేసులు ప్రతిపక్షాలను లొంగ తీసుకునేందుకు ఆడుతున్న నాటకాలు తప్ప వాటిల్లో వాస్తవం లేదన్నారు. అదానీ దోపిడీకి వ్యతిరేకంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, పోరాటాలు చేయాలని షర్మిలకు ఎందుకు గుర్తు రాలేదని తమ్మినేని ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకతీతంగా విపక్షాలు కలిసి మాట్లాడుకోవాలనడం హాస్యాస్పదమని విమర్శించారు.

మంచైనా, చెడైనా కలిసే ముందుకు..

తాము అన్నదమ్ముల్లా ఉన్నామని, మంచైనా, చెడైనా ఇక కలిసే ముందుకు నడుస్తామని కూనంనేని స్పష్టం చేశారు. తమ రెండు పార్టీలు కలిస్తే 40 నుంచి 50 నియోజకవర్గాల్లో అభ్యర్థిని గెలిపించే, ఓడించే శక్తి ఉంటుందని అన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీల మధ్య మరింత ఐక్యత దిశగా ఈ నెల 9న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సీపీఐ, సీపీఎంల ఉమ్మడి సభ జరుగుతుందని తెలిపారు.



రాజ్‌దీప్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోండి

ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ వ్యతిరేక కూటమికి తనను చైర్మన్‌గా చేస్తే దేశవ్యాప్తంగా ఎన్నికల ఖర్చును భరిస్తానని సీఎం కేసీఆర్ చెప్పినట్లు ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఈ మేరకు టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్‌కు లేఖరాశారు. రాజ్‌దీప్ వ్యాఖ్యలపై తగిన విచారణ జరిపించాలని, ఈ ఉదంతంలో దృఢంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని కోరారు. అనంతరం గాంధీభవన్‌లో నిరంజన్ విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు వినాశకాలే విపరీత బుద్ధి అనే రీతిలో ఉన్నాయని మండిపడ్డారు. అడ్డగోలు అవినీతితో వేల కోట్ల రూపాయలు సంపాదించి దేశ రాజకీయాలను నడపాలని కేసీఆర్ భావిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ చెప్పినట్లు రాజ్‌దీప్ వ్యాఖ్యానించి 24 గంటలు గడుస్తున్నా ఇప్పటివరకు బీఆర్‌ఎస్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అయ్యే ఖర్చును భరించే స్థాయిలో ఎలా సంపాదించారో విచారణ జరిపించాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

చెరుకు సుధాకర్ పిటిషన్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని, ఇటీవల బెదిరింపులకు పాల్పడ్డారని చెరుకు సుధాకర్ హైకోర్టును ఆశ్రయించారు. కోమటిరెడ్డిపై హత్యాప్రయత్నం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి.. నల్లగొండ కోర్టును ఆశ్రయించాలని పిటిషనర్ల (సుధాకర్, చెరుకు సుహాస్)ను ఆదేశిస్తూ, పిటిషన్‌ను కొట్టివేశారు. కాగా, తన అనుచరులు చెరుకు సుధాకర్‌ను చంపేస్తారని, అందుకోసం 100 కార్లలో తిరుగుతున్నారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నట్లు ఓ ఆడియో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే.

..బీఆర్‌ఎస్‌తో పొత్తుండదు

▶ మొదటి పేజీ తరువాయి

చిట్‌చాట్‌లో మాట్లాడారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో బీజేపీ ఇచ్చిన టాస్క్‌నే కేసీఆర్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అక్కడి సీఎం కేజ్రీవాల్‌పై కేసు తప్ప రాష్ట్రంలో లక్షల కోట్లు దోపిడీ చేసిన కేసీఆర్‌పై చిన్న కేసు కూడా కేంద్రం నమోదు చేయలేదన్నారు. తానింతవరకు కేసీఆర్ కుటుంబంపై ఫిర్యాదు చేసిన ఒక్క అంశంపైనా కేంద్ర వ్యవస్థలు స్పందించలేదని, విచారణ జరిపించలేదని, దీన్నిబట్టే ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఏంటో అర్థమవుతుందని రేవంత్ అన్నారు. పార్లమెంట్‌లోని విపక్ష పార్టీల సమావేశాలకు బీఆర్‌ఎస్ హాజరైనంత మాత్రాన కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. ఒక ఇంటి కాకి ఇంకో ఇంటిపై వాలే ప్రసక్తే లేదన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 20 స్థానాలే...

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 80 కంటే తక్కువ స్థానాలు వస్తాయని అంచనా వేస్తున్నామని, పూర్తి మెజార్టీ కట్టబెట్టాలని ప్రజలను కోరుతున్నామని రేవంత్ అన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 20 కంటే తక్కువ స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని, బీజేపీ సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భూదోపిడీ, ఏరులై పారుతున్న మద్యం, పరీక్ష పేపర్ల లీక్‌తో తెలంగాణ ప్రజలను కేసీఆర్ నానా గోస పెడుతున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ ఏర్పడిన నాటి నుంచి జరిగిన పరీక్షలన్నిపంటిపైనా విచారణ జరిపించాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు రేవంత్ తెలిపారు. ఇక తాను కొడంగల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని, టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతానని తెలిపారు.

పరీక్షలు కాదు... ప్రభుత్వాన్నే రద్దు చేయాలి: రేవంత్

సాక్షి, హైదరాబాద్: లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులతో సీఎం కేసీఆర్ చెలగాటమాడుతున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలన గాలికొదిలేసి రాజకీయ విధ్వంసంలో మునగడంతోనే ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయని ఆరోపించారు. పదో తరగతి నుంచి టీఎస్‌పీఎస్సీ వరకు అన్ని వ్యవస్థలూ కుప్పకూలిపోయాయని మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. ఇక కేసీఆర్‌కు ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండే అర్హత లేదని, ఇప్పుడు రద్దు చేయాల్సింది పరీక్షలు కాదని, ఈ ప్రభుత్వాన్నే రద్దు చేయాలని తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. పదోతరగతి పేపర్ లీకేజీ నేపథ్యంలో నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నేతలను అరెస్టు చేయడాన్ని రేవంత్ తీవ్రంగా ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై ఏఐసీసీ ఫోకస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై ఏఐసీసీ ఫోకస్ పెంచింది. నియోజకవర్గాల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ బలోపేతానికి గాను ప్రత్యేకంగా రూపొందించిన లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం)కు రాష్ట్ర ఇంచార్జ్‌గా ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను నియమించింది. తెలంగాణతో పాటు మరో 11 రాష్ట్రాలకు ఇంచార్జ్‌లను నియమిస్తూ ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ శివాజీరావ్ మోఘే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఉన్న రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేసేందుకు ఈ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నీ సర్టిఫికెట్ బయటపెట్టు

- ఎమ్మెస్సీ పొలిటికల్ సైన్స్ సర్టిఫికెట్ చూపించాలి
- కేసీఆర్‌కు బండి సంజయ్ సవాల్



కంటోన్మెంట్, కాచిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దమ్ముంటే ఎమ్మెస్సీ పొలిటికల్ సైన్స్ సర్టిఫికెట్ బయటపెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ సవాలు విసిరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న నగరానికి రానున్న నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్ సభా వేదిక ఏర్పాట్లను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె లక్ష్మణ్, ఇతర పార్టీ ముఖ్య నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ కేసీఆర్.. దొంగ పాస్‌పోర్ట్, దొంగ సర్టిఫికెట్లు తయారు చేయడంలో మాస్టర్ డిగ్రీ చేసినట్లున్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అంటే బీరు...రమ్... స్కాచ్ పార్టీ అని ధ్వజమెత్తారు.

ప్రజలు తరలిరావాలి: కిషన్ రెడ్డి

ఈనెల 8 వతేదీ ఉదయం 8.30 గంటలకు ప్రధాన మంత్రి మోదీ పాల్గొనే పరేడ్ గ్రౌండ్ సభకు ప్రజలు భారీగా తరలి రావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ అంటే..


సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అంటే.. బీ.. బలాత్కారీస్, ఆర్.. రేపిస్ట్స్, ఎస్.. సెక్సువల్ అబ్యూసర్స్.. అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ నిర్వచిస్తూ ట్వీట్ చేశారు. 'సెక్సువల్ వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ట్విటర్ టిల్లు (కేటీఆర్)తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.. గవర్నర్‌ను అవమానించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీకి ప్రభుత్వ విప్‌గా పదోన్నతి కల్పించారు.. ఓ మహిళా సర్పంచ్‌ను వేధించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ వైద్యశాఖ మంత్రి సీఎం ప్రోగ్రామ్‌లో పాల్గొంటారని ట్వీట్‌లో పేర్కొన్నారు.

కేసీఆర్‌పై విచారణ జరగాల్సిందే

దేశంలోని విపక్ష పార్టీల కూటమికి తనను చైర్మన్‌గా నియమిస్తే 2024లో జరిగే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల ఎన్నికల ఖర్చు మొత్తం తానే భరిస్తానని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనపై విచారణ జరిపించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అంత డబ్బు కేసీఆర్‌కు ఎక్కడి నుంచి వచ్చిందో తేల్చాలన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆ పార్టీ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.

బీజేపీలో 'మున్నాభాయ్ ఎంబీబీఎస్'లు

- కేటీఆర్ ట్వీట్
- ఇద్దరు తెలంగాణ బీజేపీ ఎంపీలపై నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు
- అవి నకిలీవని తేలితే అనర్హత వేటు వేస్తారా అంటూ స్పీకర్‌కు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేతల విద్యార్హతలపై సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌లో ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీ రామారావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చూడబోతే బీజేపీలో 'మున్నాభాయ్ ఎంబీబీఎస్'తరహా నేతలు అనేక మంది ఉన్నట్లున్నారని ట్వీట్ చేశారు. తెలంగాణకు చెందిన ఇద్దరు బీజేపీ ఎంపీలు రాజస్తాన్, తమిళనాడు యూనివర్సిటీల పేరిట నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు కలిగిఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సర్టిఫికెట్లను పరిశీలించి అవి నకిలీవని తేలితే వారిపై అనర్హత వేటు వేస్తారా'అని లోక్‌సభ స్పీకర్‌ను కేటీఆర్ ప్రశ్నించారు.

'అది ఈ శతాబ్దంలోనే అతి పెద్ద జోక్'

సీబీఐ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో లంచగొండులను వదలొద్దు అంటూ చేసిన ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ 'ఈ శతాబ్దంలోనే అతి పెద్ద జోక్'(జోక్ ఆఫ్ ది సెంచరీ) అని మరో ట్వీట్ చేశారు. దేశంలో 200కు పైగా పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పవర్ స్టేషన్లు, సిమెంట్ ప్లాంట్లు, గనులు, డిఫెన్స్ ఫ్యాక్టరీలు,, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితరాలతో 23 రాష్ట్రాల్లో 87శాతం భూభాగం అదాని గ్రూప్ పరిధిలో ఉందంటూ వస్తున్న వార్తలను ప్రస్తావిస్తూ 'ఆత్మనిర్భర్ ఓ నినాదం.. అదాని నిర్భర్ భారత్ మాత్రమే వాస్తవం'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



మనల్ని రూపొందించేది మన ఆలోచనలే.
మనం ఏం ఆలోచిస్తే అదే అవుతాం.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, ఏప్రిల్, 5

చైనా వింత చేష్టలు!

దౌత్యం ఒక ప్రత్యేక కళ. అవతలి పక్షం నుంచి రాబట్టుకోవాలన్నా, మనం ఇచ్చేది ఘనంగా కనబడేట్టు చేయాలన్నా నేర్పుతో, ఓర్పుతో, చాకచక్యంతో మాట్లాడాల్సివుంటుంది. చైనాది మొరటు పద్ధతి. అక్కడి పాలకులకు ఆంతరంగికంగా ఇబ్బందులెదురైనా, సరిహద్దు అవతల తనకు నచ్చని పరిణామం చోటుచేసుకున్నా వెంటనే తన సైనికులను హద్దు దాటించి అలజడి రేకెత్తించటం అలవాటు. అలాంటిది కుదరనప్పుడు నామకరణ మహోత్సవానికి దిగటం రివాజు. తాజాగా చైనా చేసిందదే. ఒక ప్రాంతానికి దక్షిణ టిబెట్ ప్రాంతమని పేరెట్టి, మాండరిన్ భాషాపదమైన జంగ్ నన్‌గా దాన్ని వ్యవహరిస్తూ మన అరుణాచల్ ప్రదేశ్ అందులో భాగమని ఎప్పటినుంచో వాదిస్తోంది. ఆ రాష్ట్ర రాజధాని ఇటానగర్‌కు సమీపంలోని పట్టణంతో సహా 11 ప్రాంతాలకు తన సొంత పేర్లతో తాజా జాబితా విడుదల చేసింది. ఇందులో అయిదు పర్వత శిఖరాలు, రెండు జనావాస ప్రాంతాలు, రెండు నదులు, మరో రెండు ఇతర స్థలాలు ఉన్నాయి. లోగడ 2017లో ఒకసారి, 2021లో మరోసారి చైనా ఈ నామకరణ మహోత్సవాలు చేసింది. చైనా దబాయింపులపై ఎప్పటికప్పుడు మన దేశం అభ్యంతరం చెబుతూనే వస్తోంది. ఇప్పుడు తాజాగా పేర్ల జాబితా విడుదల చేస్తూ 'చారిత్రక, పాలనాపర అంశాల ప్రాతిపదికగా' కొత్త పేర్లు పెట్టామని చైనా పౌర వ్యవహారాల మంత్రిత్వ శాఖ చెప్పుకుంటోంది.

చరిత్ర తిరగేస్తే జనం ఒకచోటు నుంచి మరో చోటుకు స్వేచ్ఛగా సంచరిస్తూ వెళ్లటం, ఎక్కడ జీవనం సవ్యంగా గడుస్తుందనిపిస్తే అక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవటం కనబడుతుంది. ఈ ఆవాసాలకూ, దారిలో తారసపడే ప్రదేశాలకూ, నదులకూ, పర్వతాలకూ పేర్లు పెట్టడం కూడా మామూలే. దేశాలు తమ తమ సరిహద్దుల్ని ఖరారు చేసుకోవటం ఇంచుమించు 17వ శతాబ్దంలో మొదలైంది. ఇరుగు పొరుగు దేశాలతో సరిహద్దుల విషయంలో సమస్య ఏర్పడినప్పుడల్లా చరిత్రలో ఆ ప్రాంతాలకు మాండరిన్ భాషలో ఫలానా పేరుందని, కనుక అది తమదేనని మర్కట తర్కానికి దిగటం చైనాకు తెలిసిన విద్య. మన దేశంతో మాత్రమే కాదు... దక్షిణాసియాలో ఇంచుమించు చాలా దేశాలతో దానికి ఇదే తగువు. ఉదాహరణకు దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని రెండు ప్రధాన ద్వీప సమూహాల్లోని స్ప్రాట్లీ, పరాశల్ దీవుల విషయంలో బ్రూనై, ఇండొనేసియా, మలేసియా, ఫిలిప్పైన్స్, తైవాన్, వియత్నాంలతో చైనాకు లడాయి నడుస్తోంది. శతాబ్దాల క్రితం చైనీయులు చేపల వేటకు ఉపయోగించిన మార్గాన్ని 'ఖరారు' చేసి ఆ ప్రాంతమంతా తనదేనని వాదించటం చైనాకే చెల్లింది. ఆ లెక్కన హాంకాంగ్ మొదలు బోర్నియో వరకూ గల దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని 35 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 90 శాతం చైనాదే అవుతుంది! తూర్పు చైనా సముద్ర ప్రాంతంలోని సెంకాకు దీవులు జపాన్ అధీనంలో ఉండగా హఠాత్తుగా ఆ ప్రాంతాన్ని దియోయూ అంటారనీ, అది తనదేననీ 1950లో పేచీకి దిగింది. చైనా ఇలా పేర్లు మార్చినప్పుడల్లా అది జారీచేసే పాస్‌పోర్టుల్లోనూ, అంతర్జాతీయ మీడియాకు విడుదల చేసే ప్రకటనల్లోనూ ఆ కొత్త పేర్లు వచ్చి కూచుంటాయి. దేశదేశాల్లో ఉండే చైనా పౌరులు వాటిని పదే పదే వల్లిస్తారు. ఈ తంతు అంతా పూర్తి చేశాక తన భూభాగాన్ని అవతలి పక్షం 'చట్టవిరుద్ధంగా' ఆక్రమించుకున్నదని అదును చూసుకుని గొడవ మొదలెడుతుంది. వివాదాలు ముదిరి అంతర్జాతీయ న్యాయస్థానం ముందు కెళ్లినప్పుడు ఆ ప్రాంతం తన పాలనా నిర్వహణలోనే ఉన్నదని చెప్పుకోవటం, దానికున్న పేరు తాను పెట్టిందేనని నిరూపించుకోవటం, సంబంధిత మ్యాప్‌లు చూపటం అవసరమవుతుంది. ఇలా చడీచప్పుడూ లేకుండా చిన్నగా వివాదం ప్రారంభించటం, ఆనక దాన్ని పెద్ద సమస్యగా మార్చటం చైనాకు అలవాటు. వియత్నాంతో ఉన్న వివాదం విషయంలో అది మరింత వింతగా ప్రవర్తించింది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా వాదనకు అనుగుణమైన మ్యాప్ ముద్రించి ఉన్న టీ షర్టులతో 2018లో 14 మంది చైనా పర్యాటకులు వచ్చినప్పుడు వియత్నాం ప్రజలు ఆగ్రహంతో రగిలిపోయారు. ఆ టీ షర్టులు తీసేవరకూ బయటకు అడుగుపెట్టనీయబోమని విమానాశ్రయ అధికారులు చెప్పటంతో గత్యంతరంలేక వారు మార్చుకోవాల్సి వచ్చింది. చూడటానికి ఇది తుంటరి చేష్టగా కనబడుతుంది. పెద్ద పట్టించుకోవటం ఎందుకనిపిస్తుంది. కానీ ఇలాంటి చిన్న చిన్న చర్యలే మున్ముందు అక్కర కొస్తాయన్నది దాని ఆలోచన.

చైనాతో మనకు సరిహద్దు వివాదం ఉంది. దాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవటానికి మన దేశం మొదటినుంచీ అన్నివిధాలా ప్రయత్నిస్తూనే ఉంది. అయినా దలైలామాను మన అధికార పక్ష నేతలు కలిసినప్పుడో, అరుణాచల్ ప్రదేశ్‌లో కేంద్రమంత్రులు పర్యటించినప్పుడో నిరసన స్వరం వినిపించటం చైనాకు అలవాటు. మరికొన్ని వారాల్లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) మంత్రుల స్థాయి సదస్సుకు చైనా రక్షణ మంత్రి మన దేశం రావాల్సివుంది. జూలైలో ఆ సంస్థ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వస్తారు. ఎస్‌సీఓకు ప్రస్తుతం మన దేశం సారథ్యం వహిస్తోంది. ఇలాంటి సమయంలో కొత్త తగువు రేకెత్తించాలన్నది చైనా ఎత్తుగడ కావొచ్చు. మన దేశం చెప్పినట్టు కొత్త పేర్లు పెట్టినంత మాత్రాన భౌగోళిక వాస్తవాలు మారిపోవు. వివాదాలు పరిష్కారమైపోవు. వివేకం తెచ్చుకుని హుందాగా వ్యవహరించటం నేర్చుకుంటే గౌరవం నిలబడుతుంది. చిల్లర తగాదాలతో కాలక్షేపం చేద్దామనుకుంటే అది చైనాకే చేటు తెస్తుంది.

ఇప్పుడెందుకు గుర్తొచ్చినట్టో!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

లలిత్ మోదీ, నీరవ్ మోదీ బీజేపీ భావజాల కథనాల్లో ఓబీసీలుగా ఎలా మారిపోయారు? ఈ జాతి వ్యతిరేక శక్తులు ఓబీసీలు అయినట్లయితే, మొత్తం ఓబీసీ సమాజం నిజంగా సిగ్గుపడాలి. ఓబీసీ రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో ఏ కీలక సమయంలోనూ ఓబీసీ ఎజెండాను బీజేపీ బలపర్చలేదు. కానీ రాహుల్ గాంధీని ఎదుర్కోవడానికి దేశంలో మోదీ పేరు పెట్టుకున్నవారందరినీ బీజేపీ ఓబీసీలుగా మార్చేసింది. మోదీ ఇంటి పేరుగా కలిగిన వారందరూ ఓబీసీలేనని వీరు ఎలా సమర్థించుకుంటారు? మోదీ పేరు కలిగిన వారు చాలామంది దేశంలో పరిశ్రమలను పెట్టారు. కానీ వీరిలో ఏ ఒక్క మోదీ కూడా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌కు మద్దతివ్వలేదు.

రాహుల్ గాంధీ ఒక స్వయంప్రకటిత బ్రాహ్మణుడు. నరేంద్ర మోదీ ఒక ధ్రువీకృత ఓబీసీ. వీరి జీవిత చరిత్రల్లో ఈ వాస్తవం నిరాకరించలేనిది. కానీ లలిత్ మోదీ, నీరవ్ మోదీ న్యాయస్థానంలోనూ, బీజేపీ భావజాల కథనాల్లోనూ ఓబీసీలుగా ఎలా మారిపోయారు? కర్ణాటకలో లలిత్ మోదీ, నీరవ్ మోదీ, నరేంద్ర మోదీ అని మూడు పేర్లను రాహుల్ పేర్కొన్నారు. లలిత్ మోదీ, నీరవ్ మోదీ విదేశాల నుంచి హవాలా ద్వారా డబ్బును దొంగిలించి, చట్టవిరుద్ధంగా భారత్ నుంచి పరారై, లండన్‌లో నివసిస్తున్నారు. వీరిద్దరికీ భారీ అంతర్జాతీయ బిజినెస్ నెట్‌వర్కులు ఉన్నాయి. వీళ్లకు ఓబీసీ ధ్రువపత్రాలు కూడా ఉన్నాయా?

ఉద్దేశపూర్వక ప్రచారం

మార్చి 23 ఉదయం నుంచి టీవీ ఛానల్స్, సోషల్ మీడియా వేదికల్లో బీజేపీ నేతలు... ఓబీసీలను దూషించడం రాహుల్ గాంధీ అలవాటుగా మార్చుకున్నారంటూ భారీ ప్రచారం మొదలెట్టారు. కాంగ్రెస్ పార్టీ పెద్దగా ఓబీసీల పట్ల ప్రేమ కురిపించలేదని నాకు తెలుసు. జాతీయ స్థాయిలో మండల్ అనుకూల ఓబీసీ నేత ఎవరినీ కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయిలో ప్రోత్సహించలేదు. కానీ ఆ పార్టీని దెబ్బ గొట్టడానికి లలిత్ మోదీ, నీరవ్ మోదీ ఎలా ఓబీసీలు అయిపోయారు? మార్చి 24వ తేదీ ఉదయం ఒక టీవీ చర్చలో బీజేపీ ప్రభుత్వంలోని ఓబీసీ మంత్రి భూపేంద్ర యాదవ్ నోటి నుంచి లలిత్ మోదీ, నీరవ్ మోదీ ఓబీసీలు అయిపోవడం తొలిసారిగా విన్నాను. ఆ తర్వాతి నుంచి బీజేపీ వాదనలన్నింటిలోనూ అన్ని దశల్లోనూ ఇదే వినిపించింది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్, ఇతర సీనియర్ మంత్రులు దీన్నే పునరావృతం చేశారు. లలిత్ మోదీ, నీరవ్ మోదీలు ఇద్దరూ ఓబీసీలే అయినట్లయితే, మొత్తం ఓబీసీ సమాజం నిజంగా సిగ్గుపడాలి.

నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యాక ఓబీసీ కార్డును బీజేపీ జాగ్రత్తగా ఉపయోగించడం ప్రారంభించిందని నాకు తెలుసు. ఎందుకంటే దేశంలో ఓబీసీలు మాత్రమే ఏకైక అతిపెద్ద ఓటు బ్యాంక్ శక్తిగా ఉంటున్నారు. ఇది మాత్రమే బీజేపీని అధికారంలో ఉంచగలదు.

మండల్ ఉద్యమం ప్రారంభించినప్పటి నుంచి ఆరెస్సెస్, బీజేపీ సాగించిన ఓబీసీ వ్యతిరేక ఉద్యమ చరిత్రను దేశంలో ఏ ఓబీసీ నేత కూడా ఎండగట్టలేదు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో ఏ కీలక సమయంలోనూ ఓబీసీ ఎజెండాను బీజేపీ బలపర్చలేదు. కానీ రాహుల్ గాంధీని ఎదుర్కోవడానికి దేశంలో మోదీ పేరు పెట్టుకున్నవారందరినీ బీజేపీ ఓబీసీలుగా మార్చేసింది. మోదీ ఇంటి పేరుగా కలిగిన ప్రతి ఒక్కరూ 'మోధ్-ఘాంచీ-తేలీ' కులం నుంచే వచ్చారా? బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కుల జనగణనలో దీనికి సాక్ష్యం ఎక్కడ ఉంది?



ఒక్క అఖిలేశ్ యాదవ్ మాత్రమే బీజేపీ ఓబీసీ మాయమాటల ప్రచారాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అధికార నివాసాన్ని తాను ఖాళీ చేశాక, గంగాజలంతో దాన్ని శుద్ధి చేయడం ద్వారా తన శూద్ర ఓబీసీ నేపథ్యాన్ని రాజ్‌పుత్ (క్షత్రియ) అయిన యోగీ ఆదిత్యనాథ్ అవమానించారని అఖిలేశ్ పదే పదే చెబుతూ వచ్చారు. బీజేపీ కానీ, ప్రత్యేకించి ఓబీసీ ప్రధానమంత్రి కానీ తమ సొంత పార్టీ సీఎం పాటిస్తున్న ఇలాంటి అమానుషమైన కుల ఆచరణలను ఎన్నడూ వ్యతిరేకించిన పాపాన పోలేదు.

ఓటు బ్యాంకు కోసమే!

రాహుల్ లేదా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓబీసీలకు అవమానం జరిగిందనే కొత్త కథనాన్ని ప్రచారం చేయడం... 'రామచరిత మానస్'లో శూద్ర/ఓబీసీలకు వ్యతిరేకంగా భాష ఉందన్న నేపథ్యంలోని ఓటు బ్యాంక్‌ను ఉత్తరప్రదేశ్‌లో నిలబెట్టుకోవడానికేనా? ఈ నేపథ్యంలోనే ఆరెస్సెస్ సర్‌సంచాలక్ మోహన్ భాగవత్ కులాన్ని దేవుడు సృష్టించలేదని మాట్లాడారు. కుల సమస్యపై శాస్త్రాలను పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని కూడా చెప్పారు.

కులం అనేది ఉనికిలోనే లేదన్న చందంగా, కాంగ్రెస్ మేధా శక్తులు ఎన్నడూ కులం గురించి మాట్లాడలేదన్నది నిజం. లౌకికవాద శక్తులను వ్యతిరేకించడంలో భాగంగా ఆరెస్సెస్-బీజేపీ హిందూ మతం చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారు అధికారాన్ని కోల్పోకుండానే కుల సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. కానీ ఓబీసీ జాబితాలోకి లలిత్ మోదీ, నీరవ్ మోదీ వంటి జాతి వ్యతిరేక శక్తులను తేవడం ద్వారా ఓబీసీ జాతీయవాద కథనాన్ని ఎలా ఆచరణలోకి తెస్తారు?

మోదీ ఇంటిపేరుగా కలిగిన వారందరూ ఓబీసీలేనని వీరు ఎలా సమర్థించుకుంటారు? మోదీ పేరు కలిగిన వారు చాలామంది దేశంలో పరిశ్రమలను పెట్టారు. కానీ వీరిలో ఏ ఒక్క మోదీ కూడా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌కు మద్దతివ్వలేదు.

ప్రైవేట్ రంగంలో ఎంతో కొంత రిజర్వేషన్ ఉండాలని యూపీఏ ప్రభుత్వం కనీస ప్రతిపాదన చేసింది. వీరప్ప మొయిలీ నేతృత్వంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ గురించి వాటాదారులకు నచ్చజెప్పడానికి ఒక కమిటీని వేశారు. అలాంటి ప్రతిపాదనను అన్ని పెద్ద పరిశ్రమలూ వ్యతిరేకించాయి. ఓబీసీ ప్రధాని కేంద్రంలో గద్దెనెక్కిన తర్వాత అలాంటి రిజర్వేషన్ కోసం ఆరెస్సెస్, బీజేపీ ప్రతిపాదించిన పాపాన కూడా పోలేదు. పరిశ్రమలను కలిగి ఉన్న ఏ మోదీ కూడా ఓబీసీలకు మద్దతివ్వడం కానీ, ఉద్యోగాలను ప్రతిపాదించడం కానీ చేయలేదు.

వైఖరి వెల్లడించాలి!

ఈ దేశ పీడిత ప్రజారాశులను వంచించడానికి కుల ప్రతిపత్తిని తారుమారు చేయలేము. దేశంలోని ముఖ్యమైన ఓబీసీలు శూద్ర వ్యవసాయ, చేతివృత్తుల ప్రజారాశులకు సంబంధించినవారు. ఆధునిక పరిశ్రమకు ముందు, గానుగ ఆడించి నూనె తీసే వర్గం చేతివృత్తుల కులంగా ఉండేదనడంలో సందేహమే లేదు. అయితే దీన్ని మోదీ ఇంటిపేరుతో ముడిపెట్టలేము. దీని ఆధారంగా చట్టబద్ధమైన లేక సామాజిక వాదనను నిర్మించలేము. ఉదాహరణకు, అనేక కమ్యూనిటీల్లో చౌదరి ఇంటిపేర్లు ఉన్నాయి.

భారతదేశంలోనూ, అమెరికా, కెనడా వంటి ఇతర దేశాల్లోనూ కుల వ్యతిరేక చట్టాలను ఆరెస్సెస్, బీజేపీ వ్యతిరేకిస్తున్నాయి. ఆరెస్సెస్ అధికారిక పత్రిక 'పాంచజన్య'తోపాటు, ఆరెస్సెస్ కీలక నేతల్లో ఒకరైన రామ్ మాధవ్ అమెరికా, కెనడాల్లో తెచ్చిన కుల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ రాశారు. మన దేశంలో మాత్రం ఎన్నికలు, ఓట్ల ప్రయోజనం కోసం వీరు ఓబీసీ ఎజెండాను ఉపయోగించుకుంటున్నారు.

ఓబీసీ ట్యాగ్ ఉన్న నరేంద్ర మోదీని ప్రధాని కావడానికి అనుమతించడం అనే వాస్తవాన్ని మినహాయిస్తే, భారతదేశంలోని ఓబీసీల ప్రయోజనాల కోసం ఆరెస్సెస్, బీజేపీ ఎలాంటి నిర్దిష్ట చర్యలూ చేపట్టలేదు. ఓబీసీ అంశంపై ఆరెస్సెస్, బీజేపీ వైఖరి గురించి జాతీయ స్థాయి చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా ఓబీసీ అంశంపై ఎలాంటి సీరియస్ సానుకూల ఆచరణ, వైఖరిని కలిగిలేదన్నది వాస్తవం. అయితే ఆరెస్సెస్, బీజేపీ ఉపయోగించుకున్నట్లుగా ఓబీసీ కార్డును కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ఉపయోగించుకోలేదు. ఈ ధోరణి కనుక ఇలాగే కొనసాగినట్లయితే, ఓబీసీలు భారీగా నష్టపోతారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

లేనే లేరా?



నా చిన్నతనమంతా నాకు అబద్ధాలే చెప్పారు. నేను నా పాఠశాల మీద కేసు వేయదలుచుకున్నాను. వాళ్లు నాకు అక్బర్ గొప్పవాడని చెప్పారు. ఇప్పుడే నాకు తెలిసింది, ఆయన కనీసం ఉనికిలోనే లేరని! (ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లోంచి మొఘలుల మీద పాఠం తొలగించడం మీద వ్యంగ్యం.)

– సైరా షా హలీమ్, బోధకురాలు

సానుకూలమే మేలు



ఇది నా వినయ పూర్వక (వ్యక్తిగత) అభిప్రాయం. 18 ఏళ్లలోపు భారతీయ పిల్లలకు క్రీ.పూ. 5000 నుంచి క్రీ.శ. 1000 వరకు గల భారతదేశ సంస్కృతి, చరిత్ర గురించి సానుకూల కథనాలు మాత్రమే బోధించాలి. వివాదాస్పద చరిత్రను కళాశాల పాఠ్యపుస్తకాలకూ, వ్యక్తిగత పఠనానికీ వదిలేయాలి.

– అరవింద్ విర్‌మానీ, నీతి ఆయోగ్ సభ్యుడు

వైవిధ్యం నాశనం



భారతదేశంలో వికసించిన రెండు లక్షల వరి రకాల ఘన వారసత్వాన్ని 'ఐఆర్‌ఆర్‌ఐ' ధ్వంసం చేసింది. అది మన వరి రకాలను దొంగిలించింది. 'సీఆర్‌ఆర్‌ఐ' డైరెక్టర్ డాక్టర్ రిచారియాను తప్పించింది. ఐఆర్‌ఆర్‌ఐ వరి రకాలు పంజాబ్ నేల, నీరు, జీవవైవిధ్యాన్ని నాశనం చేశాయి. ఇప్పుడు అది బిల్‌గేట్స్ ఎజెండా అయిన 'గోల్డెన్ రైస్'ను ఆచరణలో పెడుతోంది. (1960 ఏప్రిల్ 4న 'ది ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్' (ఐఆర్‌ఆర్‌ఐ) ఫిలిప్పైన్స్‌లో ప్రారంభమైంది.)

– వందనా శివ, యాక్టివిస్ట్

అప్పుడేనా?



ఈ ఏడాది నాకు నలభై ఏళ్లు వస్తున్నాయని నా పిల్లలకు ఇప్పుడే తెలిసింది. దానికి వాళ్లు ఎంతో కంగారుపడ్డారు. అదోలా ముఖం పెట్టి, "అది మరీ దగ్గరగా వెళ్లినట్టు కదా" అన్నారు. "దేనికి దగ్గరగా వెళ్లడం?" అని నేను అడిగాను. "వందకు" అని జవాబిచ్చారు వాళ్లు.

– దీక్షా బసు, రచయిత్రి

ఇన్‌బాక్స్

కరవు కోరల్లో 'ఆఫ్రికా కొమ్ము'

'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' దేశాలు తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయి. 'హార్న్' అంటే కొమ్ము అని అర్థం. ఇథియోపియా, సోమాలియా, కెన్యా దేశాలు ఉన్న ఆఫ్రికా ఖండ భూభాగాన్ని మ్యాపులో చూసినప్పుడు 'కొమ్ము' ఆకారంలో కనిపిస్తాయి. అందుకనే ఈ భూభాగాన్ని 'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' అని పిలుస్తారు. ఇది ఆఫ్రికా ఈశాన్య భాగంలో ఉన్న ప్రాంతం. ప్రస్తుతం ఈ భూభాగంలో ఉన్న ప్రజలు మునుపెన్నడూ లేని కరవులో చిక్కుకున్నారు. ఈ మూడు దేశాలలో ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. తృణ ధాన్యాలను ఎక్కువగా ఆహారంలో భాగంగా తీసుకునే ఇక్కడి ప్రజలు ఇప్పుడు వాటి కొరతతో దీనావస్థకు చేరారు.

వాతావరణంలో వచ్చిన మార్పులు ఆ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పశువులకు గ్రాసం దొరక్క మృత్యువాత పడుతున్నాయి. అలాగే మరో భయానకమైన విషయం ఏమంటే పసిపిల్లలకు పాలు దొరక్క ఏడవడానికి కూడా ఓపిక లేక మరణిస్తున్నారు. పాడి పశువుల మరణంతో ప్రజల జీవనోపాధి అడుగంటింది. పనులు లేక కుటుంబ పోషణ కోసం ప్రజలు వలస బాట పడుతున్నారు. పాఠశాలల్లో పిల్లలకు చదువు లేదు.

ఈ నేపథ్యంలో ఆయా దేశాలకు ఆపన్న హస్తం అందించాలని ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం అక్కడి పాలకులు చేసిన ప్రధాన తప్పిదం. అంతంత మాత్రమే ఉన్న జలవనరులపై మూడు దేశాలు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించాయి. తాగడానికి నీళ్ళు లేవంటే అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమాలియాలో పరిస్థితి కడు దుర్భరం. పిల్లలు, పెద్దలు బక్కచిక్కి అస్థిపంజరాల్లా తయారయ్యారు. తినడానికి ఏమీ లేని పిల్లలు చివరికి మన్ను తినే దృశ్యం హృదయాన్ని కదిలించివేస్తోంది.

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ 'ఫుడ్ అండ్ ఎగ్రికల్చర్ ఆర్గనైజేషన్' (ఎఫ్ఏఓ) ఈ మూడు దేశాల ప్రజలకు ఆహారం అందించాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ప్రాంత, జాతి భేదాలకు అతీతంగా ప్రపంచ దేశాలన్నీ స్పందించాల్సిన సమయమిది. అందుకే ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఈ మూడు దేశాలను ఆదుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. భారత్ వెంటనే స్పందించి తన ఉదారతను చాటుకుంది.

ఇవ్వాళ హార్న్ ఆఫ్ ఆఫ్రికా దేశాల దుఃస్థితికి అంతర్గత రాజకీయ సమస్యలే అసలైన ముద్దాయిలు. వేర్పాటు వాదులను అణచడం, అధికారాన్ని కాపాడుకోవడంపైనే పాలకులు దృష్టిపెట్టి ప్రజల బతుకులను గాలికి వదిలేశారు. పరిస్థితులు ఎప్పటికి మారతాయో మరి!

– కనుమ ఎల్లారెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకులు

సమతావాది... సంస్కరణవాది...

సందర్భం



డొక్కా మాణిక్య వరప్రసాద్

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, అంటరానితనం నిషేధం, జమీందారీ వ్యవస్థ రద్దు వంటి మౌలిక విషయాలను స్వాతంత్ర్యానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన సమతావాది బాబూ జగ్జీవన్ రామ్. సామాజిక, రాజకీయ ఉద్యమాలను ఏక కాలంలో నడిపిన యోధుడు. దళితుల అభ్యున్నతికై పని చేస్తూ వారిని సామాజికంగా బలవంతుల్ని కావించే సాంస్కృతిక ఉద్యమాలూ నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే కలకత్తాలో గురు రవిదాస్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పాటుపడ్డారు.. మరోవైపు గాంధీ వంటి మహనీయుల ప్రోద్బలంతో స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషిస్తూ... తన జాతి జనులు సైతం ఉద్యమంలో పాల్గొనేట్టు ప్రేరేపించారు. దేశ చరిత్రలో 'బాపూజీ'గా ప్రజలు పిలుచుకున్న నాయకులు ఇద్దరే. అందులో ఒకరు మహాత్మా గాంధీ కాగా, మరొకరు బాబూ జగ్జీవన్‌రామ్.

ఆయన సామాజిక న్యాయ సాధకుడిగా యోధునిలా పనిచేశారు. తన 28వ ఏటనే బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి ఎంపికై అణగారిన వర్గాల సమాఖ్య తరఫున వారి గొంతును వినిపించారు. ఈ క్రమంలోనే 1935లో 'హామండ్ కమిషన్' ముందు హాజరై మొదటిసారిగా అంటరాని వర్గాలకు ఓటుహక్కు కావాలని డిమాండ్ చేశారు.

విలక్షణ వ్యవహార దక్షత కలిగిన జగ్జీవన్‌రామ్ బిహార్‌లోని కుగ్రామం 'చాంద్వా'లో జన్మించారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో చదువుకునే రోజుల్లోనే 'అఖిలభారత రవిదాస్ మహాసభ'ను ఏర్పాటు చేశారాయన. గాంధీ ద్వారా ప్రేరణపొంది ఆయన అనుయాయిగా అనేక స్వాతంత్ర్య, రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా' ఉద్యమంలో అత్యంత చురుకైన పాత్రవహించి 1942 ఆగస్టులో అరెస్టయ్యారు. కుల, మత, భాష ప్రాతిపదికన విభజించి పాలించే బ్రిటిష్ వారి పరిపాలన ఎత్తుగడలను ఎండగట్టారు. గాంధీ నెలకొల్పిన 'అంటరానితనం వ్యతిరేక సమాఖ్య' ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆహ్వానితుడిగా సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. మరోవైపు అగ్రవర్ణ హిందువుల్లో మార్పు తీసుకురావడం ద్వారానే సమాజంలో సమానత్వం సిద్ధిస్తుందనీ, తద్వారా అన్ని సామాజిక వర్గాలూ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములవుతాయనీ, అదే స్వాతంత్ర్య సిద్ధికి బాటలు వేస్తుందనీ వక్కాణించారు. అణగారిన వర్గాల ప్రజలకు బహిరంగ ప్రదేశాల్లో సంచరించే అవకాశం ఉండాలనీ... బడి, గుడి, బావులు అందరికీ అందుబాటులో ఉన్నప్పుడే



మానవులందరికీ సమాన హక్కులు లభ్యమవుతాయనీ పేర్కొన్నారు. ఇంతటి గొప్ప ఉపన్యాసం చేసిన జగ్జీవన్ ఉపన్యాస పటిమను మెచ్చుకున్న మదన్ మోహన్ మాలవీయ 'దళిత బంధువులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటే నేను వారి పాదధూళిని నా నుదుటిపై రాసుకుంటాన'ని అన్నారు.

దళిత వ్యవసాయ కూలీల పిల్లలకు ఉచితవిద్య అందించడం... హాస్టల్ సౌకర్యం, స్కాలర్ షిప్స్ ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారానే సాధ్య మవుతుందని చెప్పారు. 'ఖేతిహార్ మజ్దూర్ సంఘం' ద్వారా భూమిలేని కార్మికులకు, వ్యవసాయ కూలీలకు తగు వేతనాలు చెల్లింపునకై ఉద్యమించారు.

రాజ్యాంగ రూపకల్పనలో పలు కమిటీల్లో కీలక భూమిక నిర్వహించారు. ముఖ్యంగా మైనారిటీ హక్కుల సబ్‌కమిటీలోనూ, సలహా కమిటీలోనూ కీలక పాత్ర పోషించారు. తన సోదరుడు, అసమాన ప్రతిభావంతుడు అయిన డా॥ బీఆర్ అంబేడ్కర్‌ను రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు తన వంతుగా నెహ్రూ, గాంధీ, పటేల్ వంటి మహా మహులను ఒప్పించిన రాజకీయ నేర్పరి బాబూ జగ్జీవన్‌రామ్.

బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి ఎంపికయింది మొదలు దాదాపు ఐదు దశాబ్దాలపాటు పార్లమెంటేరియన్‌గా కొనసాగారు. దేశ మొట్టమొదటి దళిత ఉప ప్రధానిగా, మంత్రిగా భారతదేశాభివృద్ధికి పలు విధాల తోడ్పాటు అందించారు. వ్యవసాయ శాఖమంత్రిగా ఉన్నప్పుడు హరిత విప్లవానికి నాందిపలికి ఆహారోత్పత్తిని పెంపొందించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టి నిరుపేదల ఆకలి తీర్చేందుకు శ్రీకారం చుట్టారు. స్వామినాథన్ వంటి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తను వెలుగులోకి తెచ్చిన దార్శనికుడు.

కేంద్ర కార్మికశాఖ మంత్రిగా కనీస వేతనాలు చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సవరణ) చట్టం, బోనస్ చెల్లింపుల చట్టం వంటి వివిధ కార్మిక చట్టాలను తెచ్చారు. రైల్వేశాఖ మంత్రిగా రైల్వేలను ఆధునికీకరించి రైల్వే ఛార్జీల భారం పేదవాళ్ళపై పడకుండా సంస్కరణలు చేపట్టారు. దేశ రక్షణశాఖ మంత్రిగా... పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో సియాచిన్ పర్వత శ్రేణుల్లో సైనికులతో కలిసి తిరిగారు. యుద్ధం గెలిచి బంగ్లాదేశ్ ఆవిర్భావానికి బాటలు వేశారు. అజాతశత్రువుగా భారత రాజకీయ, సామాజిక రంగాల్లో వెలుగొందిన జగ్జీవన్‌రామ్ తన 78వ ఏట కన్నుమూశారు. ఇంతటి మహానుభావుణ్ణి 'భారతరత్న'తో గౌరవించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వ్యాసకర్త మాజీ మంత్రి
(నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి)

కృతజ్ఞత

కురుక్షేత్ర యుద్ధం ముగిశాక శరతల్పం మీద పడుకొని ఉన్న భీష్ముడు, ధర్మరాజు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అతణ్ణి శాంతపరుస్తాడు. ఆ సందర్భంలోనే ధర్మరాజు అడుగుతాడు, ఆశ్రయం ఇచ్చినవాని యెడల, ఆశ్రయం పొందినవాడు ఎలా నడచుకోవాలి అని! సమాధానంగా భీష్ముడు ఒక కథ చెప్తాడు. అది మహాభారతం అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసంలో ఉన్నది.



పూర్వం కాశీ రాజ్యంలో ఒక వేటగాడు ఉండేవాడు. ఒకనాడు అడవికి వేటకు వెళ్ళి, విషం పులిమిన బాణాన్ని లేడి మీదకు సంధించి వదిలాడు. అది గురి తప్పి, పూవులు కాయలతో పెరిగిన పెద్ద చెట్టును తాకింది. విషపు బాణం దెబ్బకు ఆ చెట్టు ఎండి మోడైపోయింది. ఆ చెట్టు తొర్రలో ఒక చిలుక ఎప్పటి నుండో నివాసం ఉంటోంది. అది ఆ చెట్టును విడిచిపెట్టి పోకుండా, ఆ చెట్టు తొర్రలోనే కృతజ్ఞతతో ఉండి పోయింది.

చిలుక ఉదాత్త వైఖరిని ఇంద్రుడు తెలుసుకొన్నాడు. మనిషిగా రూపం మార్చుకొని, "ఈ అడవిలో గొప్ప గొప్ప వృక్షాలు, పూలు, ఫలాలతో అనేకం ఉన్నాయి. వాటిని ఆశ్రయించక, మోడువారిన ఈ చెట్టునే ఆశ్రయించుకొని ఎందుకు ఉన్నావు?" అని అడిగాడు. అందుకా చిలుక "పండ్లు కాస్తున్నప్పుడు చెట్టును ఆశ్రయించుకొని ఉండి, ఎండిపోయినప్పుడు వదిలిపోవటం కృతఘ్నత అనిపించుకోదా ఇంద్రా?' అన్నది. పూర్వ జన్మలో ఈ చిలుక చేసుకొన్న పుణ్యంవల్ల గదా, మారు వేషంలో ఉన్న తనను గుర్తించగలిగింది అని ఇంద్రుడు ఆశ్చర్యపడ్డాడు. చిలుకతో ఏదైనా వరం కోరుకో అంటాడు. తనకు ఆశ్రయం ఇచ్చిన వృక్షానికి పూర్వపు శోభను తిరిగి కలిగించమని వేడుకొంది. సరే అని ఇంద్రుడు చెట్టు వేళ్ళను అమృతంతో తడిపి పూలు, పండ్లతో పూర్వం కంటే ఎక్కువ శోభను కలిగించాడు. తను చేసిన మంచి పనికి, ఆ చిలుక కూడా చనిపోయాక స్వర్గం చేరుకొంది.

చిలుకకు చెట్టు మీద ఉండే భక్తి, దయ, కృతజ్ఞతాభావం మెచ్చుకోదగ్గవి. పూర్వం ఆ చెట్టు బాగున్నప్పుడు దానిని ఆశ్రయించుకొని జీవించిన సంగతి చిలుక మర్చిపోలేదు. చాలామంది మనుషులు ఇతరులు చేసిన మేలు మరచిపోయి ప్రవర్తిస్తుంటారు. ఈ కథలో చిలుక చేసిన పని అలాంటి వారికి కనువిప్పు కలిగించేదిగా ఉంది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.9.03 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.11.16 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.8.09 నుండి 9.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.37 నుండి 12.26 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.56, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

ఎర్ర బంగారం అదుర్స్

- దేశీ మిర్చి క్వింటా రూ.72 వేలు
- సింగిల్ పట్టి క్వింటా రూ.64 వేలు



వరంగల్: దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఆకాశాన్నంటుతుంటే.. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి అంతకంటే ఎక్కువగా ధర పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిర్చి రాక ప్రారంభమైన తర్వాత జనవరి 6వ తేదీన దేశీ మిర్చి క్వింటా రూ.80,100 పలికింది. ఈరకం మిర్చి పండించిన రైతులు ధరలు పెరుగుతాయని భావించినప్పటికీ.. తగ్గుముఖం పట్టడంతో ఇంటి వద్దే నిల్వ చేసుకున్నారు. ఉగాది నుంచి మళ్లీ ధరలు పెరుగుతున్నందున ఈ రకం మిర్చిని రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. సోమవారం దేశీ (హైబ్రిడ్) రకం మిర్చికి క్వింటా గరిష్ట ధర రూ.68 వేలు పలకగా, మంగళవారం రూ.72 వేలు పలికింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం వొల్లె నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన వల్లె పైడి అనే రైతు 18 బస్తాల దేశీరకం మిర్చి తీసుకురాగా రూ.72 వేల ధరతో అడ్డి డీఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా గుజరాత్ ట్రేడింగ్ కంపెనీ కొనుగోలు చేసింది. మార్చి 9వ తేదీన సింగిల్ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాకు రూ.51 వేల రికార్డు ధర పలకగా.. మంగళవారం రూ.64 వేలు రికార్డు ధరగా నమోదైంది.

వర్షంతో అతలాకుతలం



మోత్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మోత్కూరు పరిధిలో ఇళ్లపై రేకులు గాలికి లేచిపోయి ధ్వంసమయ్యాయి. మామిడి కాయలు నేలరాలాయి. చెట్లు విరిగి పడటంతో సుమారు వంద విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. ఆరెగూడెంలో వందేళ్లకు పైగా ఉన్న చింత చెట్టు కూకటి వేళ్లతో కూలిపోయింది. చేతికొచ్చిన వరిపైర్లు నేలవాలాయి.

10 రోజుల్లో నిర్ణయం తీసుకోండి

- రాజగోపాల్‌రెడ్డి 2+2 భద్రతపై డీజీపీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 2 ప్లస్ 2 భద్రతపై మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తిని పరిశీలించి 10 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది. మునుగోడు ఎన్నికల తర్వాత తన భద్రతను 1 ప్లస్ 1కు కుదించారని, అసాంఘిక శక్తుల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో తన భద్రతను 2+2కు పునరుద్ధరించేలా ఆదేశించాలని కోరుతూ రాజగోపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.

మూడు నెలల పసికందుకు ఉరి

ఆపై తల్లిదండ్రుల ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణమా..
- రంగారెడ్డి జిల్లా దేవరంపల్లిలో విషాదం



అశోక్ (ఫైల్)



అంకిత (ఫైల్)



మూడు నెలల పసికందు అమ్ములు (ఫైల్)

చేవెళ్ల: మూడు నెలల కూతురుకు ఉరేసి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవరంపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. దేవరంపల్లి గ్రామానికి చెందిన ఉమ్మెంతల అశోక్(30), అంకిత (22) దంపతులకు అమ్ములు (మూడు నెలలు) ఉంది. అశోక్ తన సోదరుడితో కలిసి ట్రాలీ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారంరాత్రి అన్నదమ్ములిద్దరూ ఎప్పటిలాగే ఆటోలో కూరగాయలు వేసుకొని సికింద్రాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్‌కు వెళ్లారు. వచ్చేటప్పుడు ఓ హోటల్‌లో బిర్యానీ తిన్నారు. అశోక్ తన భార్య కోసం బిర్యానీ పార్సిల్ తీసుకొచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఇంటికి చేరుకున్నాక అశోక్, అంకిత ఆ బిర్యానీ తిన్నారు. తెల్లవారుజామున అశోక్ తల్లి లక్ష్మమ్మ వాకిలి ఊడ్చుకుంటూ కొడుకు, కోడలును నిద్రలేపేందుకు ప్రయత్నించగా, ఉలుకూ పలుకూలేదు. తలుపుగొళ్లెం తీసి లోపలికి వెళ్లి చూడగా మూడు నెలల పసిపాపతోసహా దంపతులిద్దరూ ఉరేసుకొని కనిపించారు. లబోదిబోమంటూ ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. అశోక్ కొనఊపిరితో ఉన్నాడని భావించి తాడును కత్తితో కోసి కిందికి దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, దంపతుల ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమని తెలుస్తోంది.

కలచి వేసిన 'పసిపాపకు ఉరి'

అభం శుభం తెలియని మూడు నెలల పసికందు అమ్ములు మెడకు ఉరితాడు వేయడం అందరినీ కలచి వేసింది. చిన్నారి అమ్ములును చూసి అక్కడున్న వారు కంటతడి పెట్టారు. కుటుంబంలో ఎన్ని కలహాలు ఉన్నా చిన్నారిని ఉరి తీయడం ఏమిటని, ఇది చాలా బాధాకరమని పలువురు వ్యాఖ్యానించారు. ఒకే ఇంట్లో ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

సహచరుల వేధింపులు...
విద్యార్థిని ఆత్మహత్య

నీట్ కోచింగ్ సెంటర్ భవనంపై నుంచి దూకి బలవన్మరణం

హయత్‌నగర్: కులం పేరిట సహ విద్యార్థుల వేధింపులు తట్టుకోలేక చదువుతున్న హాస్టల్ భవనంపై నుంచే దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. భద్రాచలం జిల్లా కొత్తగూడెం మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన పెనుమాల ప్రభాకర్‌రావు కుమార్తె విద్యా ప్రియాంక(18) హయత్‌నగర్‌లోని దవావో ఇంటర్నేషనల్ మెడికల్ అకాడమీలో నీట్ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటోంది. 6 నెలలుగా కళాశాల హాస్టల్‌లోనే ఉంటూ ఇక్కడే చదువుతోంది. ఆమెతో పాటుగా మరో నలుగురు విద్యార్థినులు కూడా హాస్టల్‌లోనే ఉండేవారు. ప్రియాంక నీట్‌కు దరఖాస్తు చేసే క్రమంలో ఆమె దళిత విద్యార్థిని అని తోటి విద్యార్థులు గుర్తించారు. అప్పటినుంచి ఆమెను దూరం పెడుతూ వచ్చారు. అక్కడితో ఆగక వేధింపులు కూడా మొదలు పెట్టారు. ''తక్కువ కులం దానివి నీకు డాక్టర్ చదువు ఎందుకు''అంటూ అవమానించారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి దృష్టికి కూడా తీసుకువెళ్లింది. ఆయన వెంటనే కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ఈ క్రమంలో తోటి విద్యార్థుల నుంచి ప్రియాంకకు అవమానాలు మరింతగా ఎక్కువయ్యాయి.. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియాంక సోమవారం రాత్రి తండ్రితో ఫోన్‌లో మాట్లాడిన 15 నిమిషాల తర్వాత అకాడమీ భవనంపై నుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమె కొద్దిసేపటికే మృతి చెందింది. ''నాన్నా నా కళ్ళముందే నా కలలు అన్నీ ఆవిరై పోతున్నాయి''అంటూ భవనంపై నుంచి దూకే ముందు ఆమె ఒక సూసైడ్ నోటు రాసి పెట్టినట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ ధాన్యం మాయం

- సిద్దిపేట జిల్లాలో విజిలెన్స్ దాడుల్లో బహిర్గతం
- రూ.27.76 కోట్ల విలువైన 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్ముకున్న ఏఆర్ఎం ఆగ్రో
- మరికొన్ని మిల్లుల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి తెప్పించేందుకు మిల్లర్ల తంటాలు



హుస్నాబాద్‌లోని ఏఆర్ఎం ఆగ్రో ఇండస్ట్రీస్

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో మిల్లర్ల బాగోతం బయటపడింది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మిల్లులకు ఇచ్చిన వడ్లను సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద మరాడించి ఇవ్వాల్సి ఉండగా, మిల్లర్లు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నట్లు తేలింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం ఆరెపల్లెలో ఏఆర్ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌లో రూ.27.76కోట్ల విలువ చేసే 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఏఆర్ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 2021-22 యాసంగిలో 5,989 మెట్రిక్ టన్నులు, 2022-23 వానాకాలంలో 5,437 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 11,426 మెట్రిక్ టన్నుల (ఎంటీ) ధాన్యాన్ని సీఎంఆర్ కోసం కేటాయించారు. ఇప్పటివరకు 1,400 ఎంటీల ధాన్యం మరాడించి ఇవ్వగా ఇంకా 10,026 ఎంటీల ధాన్యం నిల్వ ఉండాలి. ఈ నెల 1న మిల్లులో విజిలెన్స్ దాడులు చేయగా 504 ఎంటీల ధాన్యం మాత్రమే ఉంది. యాసంగి ధాన్యం 4,135 మెట్రిక్ టన్నులు, వానాకాలం 5,387 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు తేల్చారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరీశ్ ఫిర్యాదుమేరకు పోలీసులు ఏఆర్ఎం ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని ఆనంద్‌దాస్ రాంమోహన్‌తోపాటు తిరుమల, అనురాధపై కేసు నమోదు చేశారు. యజమాని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అధికారులు డబ్బులను రికవరీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ మిల్లు యజమానులు, కుటుంబసభ్యుల మీద ఎలాంటి ఆస్తులు ఉన్నాయో గుర్తించే పనిలో పడ్డారు.

జిల్లా వ్యాప్తంగా దాడులు

జిల్లా వ్యాప్తంగా రెండు బృందాలు విజిలెన్స్ దాడులు మంగళవారం తనిఖీలు నిర్వహించాయి. మరిన్ని మిల్లుల అక్రమాలు వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది. 2021-22 యాసంగిలో 3,61,437 మెట్రిక్ టన్నుల ధాన్యం 133 మిల్లులకు కేటాయించారు. 2,44,943 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉండగా, 1,88,151 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అప్పగించారు. ఇంకా 63 మిల్లుల నుంచి 56,792 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. క్వింటాల్ వడ్లకు రా రైస్ అయితే 67 కేజీలు, బాయిల్డ్ అయితే 68 కేజీలు సీఎంఆర్ చేసి అందించాలి. 2022-23 వానాకాలంలో 3,62,193 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 146 మిల్లులకు అప్పగించారు. సీఎంఆర్ కింద 2,42,669 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా మిల్లర్లు 8,903 టన్నులు మాత్రమే అప్పగించారు. ఇంకా 2,33,766 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లు తనిఖీలకు రాకముందే రేషన్ బియ్యం కొనుగోలు చేసి తెప్పించేందుకు తంటాలు పడుతున్నట్లు సమాచారం. భారీ మొత్తంలో ధాన్యం మాయమవుతున్నా జిల్లా అధికారులు గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాల, మాదిగ, ప్రజాసంఘాల ఫ్రంట్ నేతలు

13న కాగడాల ప్రదర్శన

కవాడిగూడ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఈ నెల 13న సాయంత్రం 5 గంటలకు కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మాల మాదిగ ప్రజా సంగాల ఫ్రంట్ నేతలు వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్ వరకు 2000 మందితో కాడగాల ప్రదర్శన నిర్విహిస్తున్నట్లు టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు ఇటుక రాజు మాదిగ, టీఎంహెచ్‌డీ వ్యవస్థాపకుడు జన్ను కనకరాజు మాదిగ, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు బి.ఎన్.రమేష్ కుమార్ మాదిగ, జై భీం సేవ వ్యవస్థాపకుడు పి.బల్వంత్‌రావు, టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మల్లేష్ తెలిపారు. ఈ నెల 14న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 30 ఏళ్లుగా దళిత వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న రాష్ట్ర స్థాయి సంఘాలను ప్రభుత్వం గుర్తించాలని వారు కోరారు. మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

బండి సంజయ్ అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

అరెస్టును అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు బలవంతంగా సంజయ్‌ను వాహనంలో ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పాలంటూ కార్యకర్తలు, అనుచరులు కోరినా పట్టించుకోకుండా అరెస్టు చేసి తీసుకెళ్ళారు. తిమ్మాపూర్ మీదుగా సంజయ్‌ను తీసుకెళ్తుండగా వాహనం మొరాయించడంతో మరో వాహనంలో సంజయ్‌ను తీసుకెళ్లారు. అయితే పోలీసు వాహనాలు హైదరాబాద్‌వైపు వెళ్లాయి. బుధవారం బండి సంజయ్ అత్త (సంజయ్ భార్య తల్లి) మరణించి తొమ్మిది రోజులు అవుతుండటంతో సంజయ్ కరీంనగర్‌కు వచ్చారు. బుధవారం ఉదయం టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రెస్ మీట్ పెట్టేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు ఆకస్మికంగా అరెస్టు చేయడం గమనార్హం. కాగా సంజయ్ అరెస్టును బీజేపీ తీవ్రంగా పరిగణిస్తోందని, అరెస్టుకు కారణం చెప్పకుండా అర్ధరాత్రి ఇంటిపై దాడి చేసి అరెస్టు చేస్తారా? అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కార్‌కు మూడిందని అన్నారు.

లోక్‌సభ సమావేశాలు జరుగుతుండగా ఓ ఎంపీని ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు సీనియర్ న్యాయవాది, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎస్.రామచంద్రరావు ప్రశ్నించారు.



బండి సంజయ్‌తో మాట్లాడుతున్న పోలీసులు







మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లో బండి సంజయ్ అరెస్ట్ దృశ్యాలు

హిందీ 'టెన్'షన్

▶ మొదటి పేజీ తరువాయి

వైరల్ చేసి పరీక్ష రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసేలా "పేపర్ లీక్' అంటూ ప్రచారం చేశారన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

గోడెక్కి ఫొటో తీసి..: కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న తన మిత్రుడికి సహాయం చేసేందుకు కమలాపూర్ ప్రభుత్వ బాలుర పాఠశాల పరీక్ష కేంద్రంలోని చెట్టు సహాయంతో గోడెక్కాడు. మొదటి అంతస్తులోని మూడవ నంబర్ గది కిటికి పక్కనే పరీక్ష రాస్తున్న విద్యార్థి నుంచి క్వశ్చన్ పేపర్ తీసుకుని తన సెల్‌ఫోన్‌లో 9.45కు ఫొటో తీశాడు. 9.46కు మౌటం శివ గణేష్‌కు వాట్సాప్‌లో పంపాడు. మౌటం శివ గణేష్ ఉదయం 9.59 గంటలకు తన సెల్‌ఫోన్ ద్వారా 31 మంది సభ్యులున్న ఎస్సెస్సీ 2019-20 అనే వాట్సాప్ గ్రూపులో ఫార్వర్డు చేశాడు. ఆ గ్రూపులో ఉన్న గుండెబోయిన మహేశ్ అనే మాజీ రిపోర్టర్ (ప్రస్తుతం కేఎంసీలో ల్యాబ్ అసిస్టెంట్) దూడం ప్రశాంత్ (మాజీ జర్నలిస్టు)కు పంపించాడు. అతను 'బ్రేకింగ్ న్యూస్.. రెండోరోజు పదో తరగతి పేపర్ లీక్..' అంటూ 10.46 కల్లా హిందీ ప్రశ్నపత్రం ఓ జర్నలిస్టుల గ్రూపుతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి, మరో 110 మందికి పోస్టు చేశాడు. చివరికిది సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యింది. ఎక్కడినుంచి పేపర్ లీకయ్యిందో స్పష్టత లేకపోవడంతో ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. సైబర్‌క్రైం పోలీసులు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయమై ఆరా తీశారు.

అందరికీ నోటీసులు ఇస్తాం: బాలుడితో పాటు ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నామని, మైనర్‌ను జువైనల్ హోంకు, శివ గణేష్, ప్రశాంత్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. మహేశ్ పరారీలో ఉన్నాడని, సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారందరికీ నోటీసులు ఇచ్చి విచారిస్తామని తెలిపారు. ఎప్పుడైనా పరీక్షకు ముందే పేపర్ బయటకు వస్తే దాన్ని లీక్ అంటామని.. పరీక్ష కేంద్రంలో క్వశ్చన్ పేపర్ ఇచ్చాక బయటకు వస్తే కాపీయింగ్ అంటామని కమిషనర్ వివరణ ఇచ్చారు. ఇలావుండగా పేపర్ అవుట్ కలకలం సృష్టించడంతో స్నేహితుడి కోసం బాలుడు చేసిన ప్రయత్నం ఫలించలేదు.



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ రంగనాథ్

ఒక్క ఆధార్.. 11,000 సిమ్ కార్డులు!

▶ మొదటి పేజీ తరువాయి

కేసులను గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఉన్న తెలంగాణ పోలీసులకు చెందిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ సైబర్ సెక్యూరిటీ సేఫ్టీ (సీఓఈసీఎస్) విశ్లేషిస్తుంటుంది. ఇదే క్రమంలో కేవైసీ మోసం కేసును కూడా విశ్లేషించింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో కేవలం ఒక్క ఆధార్ కార్డు గుర్తింపుతో 11 వేల సిమ్ కార్డులు జారీ అయినట్లు సీఓఈసీఎస్ పోలీసులు గుర్తించారు.

రెండు సిమ్‌లు నేరస్తుల చేతుల్లో..

సాధారణంగా కొత్త సిమ్‌కార్డు తీసుకోవాలంటే ధ్రువీకరణ పత్రంగా ఆధార్ కార్డును సమర్పించాల్సి ఉంటుంది. టెలీకమ్యూనికేషన్ విభాగం (డీఓటీ) మార్గదర్శకాల ప్రకారం ఒక్క ఆధార్ కార్డుతో గరిష్టంగా 9 సిమ్ కార్డులను జారీ చేయవచ్చు. కానీ ఈ కేసులో థర్డ్ పార్టీ ఏజెన్సీలు డీఓటీ నిబంధనలను ఉల్లంఘించి ఏకంగా 11 వేల సిమ్ కార్డులు జారీ చేశారు. కాగా ఇందులో రెండు సిమ్ కార్డులను సైబర్ నేరస్తులు వినియోగించారని, ఈ ఫోన్ నంబర్ల నుంచే బాధితుడిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు టెలీకమ్యూనికేషన్ విభాగాన్ని సైబరాబాద్ పోలీసులు అప్రమత్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి సిమ్ కార్డులను జారీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

పత్తి విత్తన రేట్లు పెంపు

ఒక్కో ప్యాకెట్ ధర రూ.853

- గతేడాది కంటే రూ.43 పెంచిన కేంద్రం
- ప్రతి ఏటా పెంచుతున్న సర్కార్
- ధర పెంపుతో అన్నదాతలపై ఆర్థికభారం



పత్తి విత్తన ప్యాకెట్ ధర

సంవత్సరం	ధర (రూపాయల్లో..)
2020-21	730
2021-22	767
2022-23	810
2023-24	853

సాక్షి, హైదరాబాద్: పత్తి విత్తనాల ధరలను కేంద్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. 2023-24 వ్యవసాయ సీజన్‌కు పత్తి విత్తన ప్యాకెట్ల ధర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఒక్కో ప్యాకెట్‌పై అదనంగా రూ.43 చొప్పున పెంచింది. గతేడాది ప్యాకెట్ ధర రూ.810 ఉండగా, ప్రస్తుతం దానిని రూ853కు పెంచింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల నుంచి వరసగా పత్తి విత్తనాల ధర పెంచుతుండటం గమనార్హం. విత్తనాల ధర పెంపును తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించడంతోపాటు ధరలు పెంచొద్దని కేంద్రానికి విజ్ఞప్తి కూడా చేసింది. 2020-21లో రూ.730గా ఉన్న ప్యాకెట్ ధర ఇప్పుడు రూ.853కి చేరుకుంది. అంటే మూడేళ్లలో రూ.123 పెరిగింది. ఈ విధంగా ప్రతియేటా పత్తి విత్తన ప్యాకెట్ల ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం రైతులపై ఆర్థికభారం మోపుతోంది. ముఖ్యంగా పత్తి అధికంగా సాగు చేసే తెలంగాణ రాష్ట్ర రైతులపై కేంద్ర నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది పత్తి విత్తనాల ధర పెంచడంవల్ల తెలంగాణ రైతులపై సుమారు రూ.60-65 కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు లెక్కగడుతున్నారు. రాష్ట్రంలో గతేడాది 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకాగా, ఈ ఏడాది ఇది సుమారు 70 లక్షల ఎకరాలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.


రూ.60 కోట్ల అదనపు భారం

ఒక్కో ఎకరానికి రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం అవుతాయి. ఈ లెక్కన 70 లక్షల ఎకరాలకు 1.40 కోట్ల విత్తన ప్యాకెట్లు అవసరం. ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 ధర పెంచడంతో మొత్తం ప్యాకెట్లకు రూ.60 కోట్ల అదనపు భారం పడనుంది. కాగా, గత సీజన్‌లో పత్తి ధర రూ.12 వేల నుంచి రూ.7 వేలకు పడిపోయింది. ఇది మద్దతు ధర కన్నా ఎక్కువగానే ఉన్నప్పటికీ రైతుకు మాత్రం పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదు. ఈ నేపథ్యంలో పత్తికి రూ.10 వేల మద్దతు ధర ప్రకటించాలని దేశవ్యాప్తంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా...

ట్విట్టర్ వెబ్ వెర్షన్ లోగో మారింది

పక్షి స్థానంలో వేట కుక్క



వాషింగ్టన్: మైక్రో–బ్లాగింగ్ సైట్ ట్విట్టర్ అనగానే వెంటనే గుర్తొచ్చేది నీలిరంగు బుల్లి పిట్ట. ఇప్పుడు ఆ పిట్ట స్థానంలోకి వేట కుక్క వచ్చి చేరింది. ఈ మేరకు ట్విట్టర్ లోగోను సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) ఎలాన్ మస్క్ మార్చేశారు. వెబ్ వెర్షన్‌లో సోమవారం నుంచి ఈ మార్పు కనిపిస్తోంది. వెబ్ వెర్షన్‌లో బ్లూబర్డ్ లోగో హోం బటన్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. డాగికాయిన్ క్రిప్టోకరెన్సీ, డాగికాయిన్ బ్లాక్‌చైన్ లోగోగా ఉన్న శునకం బొమ్మను ట్విట్టర్ లోగోగా మార్చారు. ఎలాన్ మస్క్ పెంపుడు శునకమైన శిబా ఇనూను పోలి ఉంది. అయితే, ట్విట్టర్ మొబైల్ యాప్ లోగోలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

ఆస్ట్రేలియా ప్రభుత్వ పరికరాల్లో టిక్‌టాక్‌పై నిషేధం

కాన్‌బెర్రా: చైనాకు చెందిన వీడియో షేరింగ్ యాప్ టిక్‌టాక్‌పై నిషేధం విధించిన దేశాల జాబితాలో తాజాగా ఆస్ట్రేలియా కూడా చేరింది. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ పరికరాల్లో టిక్‌టాక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు అటార్నీ జనరల్ మార్క్ డ్రేఫస్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నిఘా, భద్రతా సంస్థల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అతిత్వరలో నిషేధం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందన్నారు. టిక్‌టాక్‌పై అమెరికా, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్ తదితర దేశాలు ఇప్పటికే నిషేధం విధించాయి. అయితే, ఆస్ట్రేలియా ప్రభుత్వ తాజా నిర్ణయం పట్ల టిక్‌టాక్ యాజమాన్యం అసంతృప్తి వ్యక్తం చేసింది. నిజానిజాలతో సంబంధం లేకుండా కేవలం రాజకీయపరమైన కారణాలతో యాప్‌పై నిషేధం విధించారని ఆస్ట్రేలియాలోని టిక్‌టాక్ జనరల్ మేనేజ్ లీ హంటర్ ఆక్షేపించారు.

అత్యల్పానికి పాక్ రూపాయి

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆర్థిక పతనం కొనసాగుతూనే ఉంది. దేశ కరెన్సీ రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే ఏకంగా 287.29కి దిగజారింది. ఒక్క రోజులోనే ఏకంగా 2.25 రూపాయల మేరకు పతనమైంది. విదేశీమారక నిల్వలు కూడా కేవలం 424 కోట్ల డాలర్లకు పడిపోయాయి.



మంగళవారం మధ్యాహ్నం న్యూయార్క్‌లో కోర్టుకు బయల్దేరే ముందు ట్రంప్ అభివాదం



కోర్టులో జడ్జి ఎదుట తన న్యాయవాదుల బృందంతో కలిసి హాజరైన ట్రంప్

నేనే నేరమూ చేయలేదు

హష్ మనీ కేసులో ట్రంప్ వాదన • మన్‌హాటన్ కోర్టులో విచారణకు హాజరు

సాంకేతికంగా పోలీసుల అదుపులోకి

- తర్వాత 34 అభియోగాలు విన్పించిన జడ్జి
- మోహరించిన మీడియా, భారీ భద్రత
- అమెరికాలో న్యాయం అడుగంటింది: ట్రంప్
- థర్డ్ వరల్డ్ కంట్రీగా మారిందంటూ ధ్వజం

న్యూయార్క్/వాషింగ్టన్: హష్ మనీ చెల్లింపుల కేసులో తనపై నమోదైన క్రిమినల్ నేరాభియోగాలను అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (76) అంగీకరించలేదు. తాను ఏ నేరమూ చేయలేదంటూ కోర్టు ముందు వాంగ్మూలమిచ్చారు. ప్రపంచమంతటి దృష్టినీ ఆకర్షించిన ఈ సంచలనాత్మక కేసులో మంగళవారం ఆయన మన్‌హాటన్ క్రిమినల్ కోర్టు ముందు విచారణకు హాజరయ్యారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30కు కోర్టు వద్దకు చేరుకున్నారు. తన లాయర్లతో కలిసి కోర్టు ప్రాంగణంలోకి అడుగు పెట్టారు. ఆ క్షణమే ఆయన సాంకేతికంగా అరెస్టయినట్టు చెబుతున్నారు. 'మిస్టర్ ట్రంప్! యూ ఆర్ అండర్ అరెస్ట్' అని చెప్పి పోలీసులు ఆయన్ను లోనికి తీసుకెళ్లినట్టు సమాచారం. అనంతరం విచారణకు ముందు రికార్డుల నిమిత్తం ట్రంప్ వేలిముద్రలు, ఫొటో తీసుకున్నట్టు చెబుతున్నారు. మధ్యాహ్నం 2.30కు 15వ అంతస్తులో ఉన్న కోర్టు గదిలోకి ట్రంప్ ప్రవేశించారు. మామూలుగా నిందితుల మాదిరిగా బేడీలు వేయకుండానే ఆయన్ను జడ్జి ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీక్రెట్ సర్వీస్ బాడీగార్డులు ట్రంప్ వెన్నంటే ఉన్నారు. అనంతరం ట్రంప్‌పై దాఖలైన 34 అభియోగాలను జడ్జి జువాన్ మాన్యుయల్ మర్చన్ చదివి విన్పించారు. వాటిలో దేనితోనూ తనకు సంబంధం లేదని ట్రంప్ వాంగ్మూలమిచ్చారు. ప్రతి అభియోగాన్నీ చట్టపరంగా ఎదుర్కొంటారని ఆయన లాయర్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3.30 సమయంలో కోర్టు నుంచి వెనుదిరిగారు. ఆ తర్వాత ఫ్లోరిడా పయనమయ్యారు.

శృంగార చిత్రాల నటి స్టార్మీ డేనియల్స్ (44)తో అఫైర్‌ను కప్పిపుచ్చేందుకు ఆమెకు డబ్బుల చెల్లింపు వ్యవహారం ట్రంప్ మెడకు చుట్టుకోవడం, క్రిమినల్ నేరాభియోగాలకు దారితీయడం తెలిసిందే. అమెరికా చరిత్రలో అభియోగాలు ఎదుర్కొంటున్న తొలి మాజీ అధ్యక్షునిగా ట్రంప్ నిలిచారు. ఆయన విచారణ సందర్భంగా న్యూయార్క్‌లో మన్‌హాటన్ జ్యూరీ లేన్ మొత్తం మీడియాతో కిక్కిరిసిపోయింది. ఈ నేపథ్యంలో మీడియా కంటపడకుండా ఉండేందుకు ట్రంప్ తన కాన్వాయ్‌తో కోర్టు భవనంలోకి వెనకవైపుగా ప్రవేశించారు. ట్రంప్ విజ్ఞప్తి మేరకు విచారణకు మీడియాను కోర్టు గదిలోకి జడ్జి అనుమతించలేదు. అంతేగాక విచారణ ప్రక్రియను ప్రసారం చేయరాదని సోమవారమే ఆదేశాలు జారీ చేశారు. విచారణ మొదలయ్యే ముందు ఫొటోలు తీసుకునేందుకు ఐదుగురు ఫొటోగ్రాఫర్లను మాత్రం అనుమతించారు.

భారీ భద్రత

అంతకుముందు విచారణ నిమిత్తం సోమవారం రాత్రే ట్రంప్ ఫ్లోరిడాలోని తన నివాసం నుంచి సొంత బోయింగ్ 757 విమానంలో న్యూయార్క్ చేరుకున్నారు. తన అభిమానులకు అభివాదం చేస్తూ హడావుడి చేసిన అనంతరం ట్రంప్ టవర్‌లో బస చేశారు. విచారణ నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ట్రంప్ అధ్యక్షునిగా ఉండగానే హష్ మనీ కేసులో మన్‌హాటన్ జిల్లా అటార్నీ కార్యాలయం ఆయనపై విచారణ మొదలు పెట్టింది.



కోర్టు ఆవరణలో భారీగా మీడియా ప్రతినిధులు, ట్రంప్ మద్దతుదారులు, వ్యతిరేకులు

నేను అరెస్ట్ కాబోతున్నా.. అభిమానులకు ట్రంప్ మెయిల్

తనపై కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపేనని ట్రంప్ ఆరోపించారు. మరోసారి అధ్యక్ష పదవికి పోటీపడకుండా అడ్డుకునేందుకు దేశ చరిత్రలోనే అత్యంత దారుణ రీతిలో తననిలా కేసుల పేరిట ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారంటూ ఆయన దుయ్యబట్టారు. విచారణకు బయల్దేరే ముందు తన సోషల్ మీడియా సైట్ ట్రూత్‌లో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ''అగ్ర రాజ్యం అమెరికా నానాటికీ దిగజారుతోంది. థర్డ్ వరల్డ్ మార్క్సిస్టు దేశంగా మారుతోంది'' అంటూ అభిమానులకు పంపిన ఈ మెయిల్‌లోనూ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'అరెస్టుకు ముందు ఇది నా చివరి మెయిల్' అని అందులో పేర్కొనడం విశేషం! ''ఏ తప్పూ చేయనందుకు విపక్ష నేతను అధికార పార్టీ అరెస్టు చేస్తోంది. ఈ రోజుతో అమెరికాలో న్యాయం అడుగంటింది'' అంటూ దుయ్యబట్టారు. విచారణ సజావుగా సాగుతుందని నమ్మకం లేదని ట్రంప్‌తో పాటు ఆయన న్యాయవాది అలీనా హబ్బా కూడా అన్నారు. ట్రంప్ విచారణపై స్పందించేందుకు అధ్యక్షుడు జో బైడెన్ నిరాకరించారు. న్యూయార్క్ పోలీసు శాఖ పనితీరుపై తనకు నమ్మకముందన్నారు.

ఎగబాకుతున్న యాక్టివ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసుల సంఖ్య మళ్లీ క్రమంగా పెరుగుతోంది. గత 24 గంటల్లో కొత్తగా 3,038 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల్లో వెల్లడైంది. క్రియాశీలక కేసుల సంఖ్య 21,179కు పెరగడం గమనార్హం. గత 24 గంటల్లో మరో తొమ్మిది మంది కోవిడ్‌తో కన్నుమూశారు. దీంతో మొత్తం కోవిడ్ బాధితుల మరణాల సంఖ్య 5,30,901కు చేరుకుంది.

కర్ణాటకలో 25 స్థానాల్లో పోటీపై ఎంఐఎం యోచన

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 25 స్థానాల్లో అభ్యర్థుల్ని బరిలో నిలపాలని అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ ఆలోచిస్తోంది. ఈసారి ఎన్నికల్లో జనతాదళ్ (సెక్యులర్) పార్టీతో జట్టుకట్టడంపై యోచి స్తున్నట్లు ఎంఐఎం కర్ణాటక రాష్ట్ర విభాగ అధ్యక్షులు ఉస్మాన్ ఘనీ మంగళవారం వెల్లడించారు. 'ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించాం. పొత్తుకు మేం సిద్ధం. పొత్తు పెట్టుకుని ముందుకెళ్లాలా, విడిగా రంగంలోకి దూకాలా అనేది ఇంకా నిర్ణయంకాలేదు' అని ఒవైసీ పీటీఐతో వ్యాఖ్యానించారు.

పరాయి భాషలు వాడితే లక్ష యూరోల జరిమానా

రోమ్: విదేశీ భాషలను పక్కనపెట్టి, సొంత భాషకు పట్టం కట్టే దిశగా ఇటలీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు అధికార బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ కీలకమైన బిల్లును తీసుకొచ్చింది. దీని ప్రకారం.. ఇంగ్లిష్ సహా ఇతర విదేశీ భాషల్లో అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఏకంగా లక్ష యూరోల దాకా జరిమానా విధిస్తారు. ఈ బిల్లుకు ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ మద్దతు ప్రకటించారు. అయితే, బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉంది. విదేశీ భాషల ఆధిపత్యం వల్ల తమ మాతృభాష అంతరించేపోయే ప్రమాదం ఉందని ఇటలీ భాషాభిమానులు చాలా ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు ఇటాలియన్ భాషపై పూర్తి పట్టు ఉండాలని, చదవడం రాయడం రావాలని కొత్త బిల్లు నిర్దేశిస్తోంది.

సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు... సునీత్ చోప్రా మృతి



న్యూఢిల్లీ: కళారంగంలో సుపరిచితుడు, ఏఐఏడబ్ల్యూయూ నాయకుడు, సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు సునీత్ చోప్రా (81) మంగళవారం గుండెపోటుతో మరణించారు. హరియాణాలోని గురుగ్రామ్ నుంచి ఢిల్లీలోని ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కార్యాలయానికి వెళ్తూ సికిందర్‌పూర్ మెట్రో స్టేషన్‌లో సెక్యూరిటీ చెకింగ్ వద్ద గుండెపోటుతో కుప్పకూలారు. భద్రతా సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించే ప్రయత్నం చేయగా అప్పటికే మరణించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఆయన మృతి పట్ల సీపీఎం, ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర వర్కింగ్ కమిటీ సంతాపం తెలిపాయి.



'డోక్లాం'పై భూటాన్‌తో టచ్‌లో ఉన్నాం

- విదేశాంగ కార్యదర్శి క్వాత్రా
- రాజు వాంగ్‌చుక్‌తో మోదీ చర్చలు
- పటిష్ట బంధానికి ఐదుసూత్రాల రోడ్ మ్యాప్

న్యూఢిల్లీ: డోక్లాం అంశానికి సంబంధించి భూటాన్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉన్నట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా తెలిపారు. రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగెల్ వాంగ్‌చుక్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పలు ద్వైపాక్షిక అంశాలపై లోతుగా చర్చలు జరిపారు. ద్వైపాక్షిక బంధం బలోపేతానికి ఐదుసూత్రాల రోడ్‌మ్యాప్‌ను వాంగ్‌చుక్ ఈ సందర్భంగా ప్రతిపాదించారు. భేటీ వివరాలను క్వాత్రా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా డోక్లాంపై ప్రశ్నించగా ఆయన ఇలా స్పందించారు. భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ఇరు దేశాలు పరస్పరం సహకారం ఇచ్చిపుచ్చుకుంటున్నట్టు చెప్పారు. దీన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు భూటాన్ రాజు పర్యటన దోహదపడుతోందన్నారు. అసోంలోని కోక్రాఝార్ నుంచి భూటాన్‌లోని గెలెపు వరకు రైల్ లింక్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఇటీవలి కాలంలో భూటాన్ క్రమంగా చైనాకు దగ్గరవుతోందన్న అభిప్రాయాల మధ్య ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. వాంగ్‌చుక్‌తో చర్చలు ఫలప్రదంగా జరిగాయంటూ మోదీ ట్వీట్ చేశారు. ఆయన గౌరవార్థం విందు ఇచ్చారు.

డోక్లాం.. అతి కీలకం

వ్యూహాత్మకంగా డోక్లాం భారత్‌కు అత్యంత కీలకం. 2017లో అక్కడ భారత, చైనా సైనికులు ఏకంగా 73 రోజుల పాటు ఎదురెదురుగా మోహరించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం తెలిసిందే. భూటాన్‌లో తమదిగా చెప్పుకుంటున్న ప్రాంతంలో రోడ్డు వేసేందుకు చైనా ప్రయత్నించడం ఘర్షణకు కారణమైంది. దాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. భూటాన్‌కు చైనాతో 400 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది.

విపత్తుల స్పందనకు సమగ్ర వ్యవస్థ: మోదీ

ప్రాకృతిక విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సమగ్రమైన సన్నద్ధత వ్యవస్థ అత్యవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఒక ప్రాంతంలో తలెత్తే విపత్తులు దానికి సుదూరంలో ఉన్న ప్రాంతాలపై కూడా భారీ ప్రభావం చూపించే ఆస్కారముందని గుర్తు చేశారు. విపత్తుల నిర్వహణ సన్నద్ధత వ్యవస్థపై జరిగిన ఐదో అంతర్జాతీయ సదస్సును ఉద్దేశించి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కోవలిషన్ ఫర్ డిజాస్టర్ రెజీలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ)లో ఇప్పటికే 40 దేశాలు భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. ఈ విషయమై ఒక్క తాటిపైకి వచ్చేందుకు అభివృద్ధి చెందుతున్న చిన్న, పెద్ద దేశాలకు ఈ సదస్సు చక్కని వేదికగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. విపత్తు బాధితుల్లో ప్రతి ఒక్కరినీ పూర్తిస్థాయిలో ఆదుకునేలా వ్యవస్థను అభివృద్ధి చేసుకునే దిశగా కృషి జరగాలని ప్రధాని పిలుపునిచ్చారు. విపత్తుల వేళ తక్షణ ఉపశమనంతో పాటు సాధ్యమైనంత త్వరగా మామూలు పరిస్థితులు నెలకొనేలా చూడటంపై దృష్టి సారించాలన్నారు. ఇందుకు రవాణా సదుపాయాలతో పాటు సామాజిక, డిజిటల్ సదుపాయాలు కూడా చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

నాటో కూటమిలోకి ఫిన్లాండ్

బ్రస్సెల్స్: ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగిన రష్యా తమపైనా దాడికి యత్నించవచ్చనే భయాలతో ఫిన్లాండ్ దేశం మంగళవారం నాటో కూటమిలో 31వ సభ్యదేశంగా చేరింది. దీంతో రష్యా వెంట నాటో సభ్య దేశాల సరిహద్దు భూభాగ విస్తీర్ణం రెట్టింపయింది. దీనిని యూరప్ రక్షణ ముఖచిత్రంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు. నాటోలో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ ప్రయత్నించడాన్ని ప్రధాన కారణంగా చూపుతూ ఆ దేశంపై యుద్ధానికి దిగిన రష్యాకు తాజాగా ఫిన్లాండ్ రూపంలో వ్యూహాత్మక, రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. గతంలో రెండో ప్రపంచ యుద్ధంలో సోవియెట్ల చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచి ఫిన్లాండ్ తటస్థ వైఖరినే అవలంబిస్తోంది. కానీ ఉక్రెయిన్ యుద్ధం దరిమిలా రష్యాకు భయపడి ఫిన్లాండ్ నాటో రక్షణ ఛత్రం కిందకు చేరక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో గత మే నెలలోనే నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకుంది. నాటోలోని మొత్తం 30 దేశాలూ ఆమోదిస్తేనే సభ్యత్వం ఇస్తారు. గత కొద్ది నెలలుగా హంగేరీ, తుర్కియేలు ఫిన్లాండ్ దరఖాస్తుకు ఆమోదముద్రవేయలేదు. ఫిన్లాండ్‌తోపాటు స్వీడన్ సైతం దరఖాస్తు చేసుకోగా ఇంకా హంగేరీ, తుర్కియేలు పచ్చజెండా ఊపలేదు. 'ఫిన్లాండ్ సభ్యత్వం తీసుకునేలా చేయడంలో ఒక రకంగా పుతిన్‌కు కృతజ్ఞతలు చెప్పకుండా ఉండలేకపోతున్నాను' అని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వ్యంగ్యంగా అన్నారు.



నాటో ప్రధాన కేంద్రంలో ఫిన్లాండ్ జెండా ఎగరేసిన దృశ్యం. (ఇన్‌సెట్లో) మంత్రుల ఆనందం

తగిన చర్యలుంటాయ్: రష్యా

ఫిన్లాండ్ నాటో సభ్యత్వంపై రష్యా ఘాటుగా స్పందించింది. 'నాటోలో చేరడం ద్వారా ఫిన్లాండ్ నుంచి ఎదురయ్యే జాతీయ భద్రతా సవాళ్లను సైనిక, సాంకేతిక, తదితర మార్గాల్లో దీటుగా ఎదుర్కొంటాం. తగు చర్యలు తీసుకుంటాం. ఉత్తర యూరప్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సుస్థిరతకు ఫిన్లాండ్ భంగం కల్గించింది' అని రష్యా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఫిన్లాండ్ సాయం అడగనంత వరకు ఆ దేశానికి అదనపు సైన్యాన్ని పంపే యోచన లేదని నాటో ప్రధాన కార్యదర్శి జీన్స్ స్టోలెన్‌బర్గ్ చెప్పారు. ఈ పరిణామం తర్వాత రష్యా తన సైనిక వనరులను మరింతగా ఫిన్లాండ్ సరిహద్దులకు తరలించనుందా ? అనే ప్రశ్నకు ఇంకా ఎలాంటి సమాధానం లభించలేదు.

సిక్కింలో భారీ హిమపాతం

ఏడుగురు పర్యాటకుల సజీవ సమాధి • గాయపడిన పలువురు పర్యాటకులు • కొనసాగుతున్న సహాయక చర్యలు

గ్యాంగ్‌టాక్: మంచుసోయగా లు, ప్రకృతి రమణీయతను చూసేందుకు వచ్చిన పర్యాటకులను ప్రకృతి హిమపాతం రూపంలో కబళించింది. సిక్కింలోని హిమాలయ పర్వతసానువుల్లోని లోయ మార్గం నాథూ లా ప్రాంతంలో మంగళవారం సంభవించిన భారీ హిమపాతం ధాటికి ఏడుగురు పర్యాటకులు మంచులో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో ఒక మహిళ, ఒక చిన్నారి కూడా ఉన్నారు. 11 మంది గాయపడ్డారు. ఐదారు వాహనాలతోసహా దాదాపు 30 మంది మంచు దిబ్బల కింద చిక్కుకున్నారన్న అనుమానాలతో అక్కడ అన్వేషణ, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్యాంగ్‌టాక్, నాథూ లాను కలిపే జవహర్‌లాల్ నెహ్రూ మార్గంలోని 14వ నంబర్ మైలురాయి వద్ద ఉదయం 11.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

వద్దన్నా వినకుండా..

ప్రమాదం విషయం తెలియగానే సరిహద్దు రహదారుల సంస్థ(బీఆర్ఓ) సిబ్బంది, రాష్ట్ర విపత్తు స్పందన దళం, స్థానికులు అక్కడికి చేరుకుని 23 మందిని కాపాడారు. నెహ్రూ మార్గ్‌లో ఆగిపోయిన 80 వాహనాల్లోని 350 మందికిపైగా పర్యాటకులను సురక్షితంగా వెనక్కి పంపించారు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా 13వ నంబర్ మైలురాయి దాటాక సాధారణంగా పర్యాటకులకు అనుమతి ఉండదు. కానీ, పర్యాటకులు ఘటనాస్థలి దాకా తీసుకెళ్లాలని టూర్ ఆపరేటర్లు, డ్రైవర్లను బలవంతపెట్టారని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం వ్యక్తంచేశారు. చైనా సరిహద్దు సమీపంలో నాథూ లా మార్గముంది. వాణిజ్య సంబంధ రాకపోకలకు భారత్, చైనాలు వినియోగిస్తున్న మూడు సరిహద్దు పోస్ట్‌లలో నాథూ లా ఒకటి. సముద్రమట్టానికి 14,450 అడుగుల ఎత్తులోని మంచుమయమైన ఈ ప్రాంతాలను చూసేందుకు ఏటా పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలిరావడం తెల్సిందే. గ్యాంగ్‌టాక్ నుంచి 55 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతముంది. ప్రమాదం జరిగాక క్షతగాత్రులను గ్యాంగ్‌టాక్‌కు పంపించి చికిత్సనందిస్తున్నారు.



పేర్లు మార్చినా నిజం మారదు

- అరుణాచల్ దేశంలో అంతర్భాగమని భారత్ పునరుద్ఘాటన
- 11 ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టుకోవడంపై భారత్ ఆగ్రహం

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాంతాలకు చైనా సొంత పేర్లు పెట్టుకోవడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. పేర్లు మార్చుకున్నంత మాత్రాన నిజం మారదని పునరుద్ఘాటించింది. సరిహద్దు రాష్ట్రం అరుణాచల్‌లోని రెండు భూభాగాలు, రెండు జనావాసాలు, ఐదు పర్వతప్రాంతాలు, రెండు నదులకు మొత్తంగా 11 ప్రాంతాలకు సొంత పేర్లు పెడుతూ ఆ జాబితాను ఆదివారం చైనా పౌర వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదలచేసింది. ఈ వివరాలను చైనా అధికారిక వార్తా సంస్థ గ్లోబల్ టైమ్స్ సోమవారం వెల్లడించింది. గతంలోనూ ఇలా రెండుసార్లు పలు ప్రాంతాలకు చైనా తమ పేర్లను పెట్టుకుంది. అరుణాచల్‌ను జాంగ్నాన్‌గా పిలుచుకుంటూ దక్షిణ టిబెట్‌లో భాగంగా చైనా చెప్పుకుంటున్న విషయం విదితమే. 'అరుణాచల్ రాష్ట్రం భారత్‌లో అంతర్భాగం. పేర్లు మార్చుకున్నంత మాత్రాన ఈ రాష్ట్రం భారత్‌లో ఉండకుండాపోదుగా. పేర్ల మార్పు.. నిజాన్ని మార్చలేదు. ఇలాంటి కథనాలు చూశాం. చైనా ఇలాంటివి చేయడం కొత్తేమీకాదు. వీటిని భారత్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోంది' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరీందర్ బాగ్చి ఆగ్రహంగా మాట్లాడారు.

కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం

'గల్వాన్ ఘటనసహా సరిహద్దు వెంట చైనా దుశ్చర్యలను అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ ఎండగట్టని ఫలితంగానే ఇలాంటి తెంపరితనానికి చైనా తెగిస్తోంది. మోదీ చైనాకు ఇచ్చిన క్లీన్‌చిట్ కారణంగానే ఆ దేశం ఇంతటి దుస్సాహసానికి దిగింది. మోదీ వైఖరి వల్ల భారత్ ఇంకా ఇలాంటి విపరిణామాలను చవిచూడాల్సి వస్తోంది' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మన 2000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా లాగేసుకుంది. ఇప్పుడు ప్రాంతాల పేర్లు మారుస్తున్నారు. ప్రధాని మోదీ మాత్రం దీనిపై ఏం మాట్లాడరు. ఎందుకంత భయం?' అని రాహుల్ గాంధీ హిందీలో ట్వీట్‌చేశారు. 'చైనా ఆగడాలపై మోదీ మౌనం వల్ల భారత్ చెల్లించుకున్న మూల్యమిది' అని జైరాం రమేశ్ అన్నారు.

రాజస్తాన్‌లో ప్రైవేట్ వైద్యుల సమ్మె విరమణ

జైపూర్: ఆరోగ్య హక్కు బిల్లుపై ప్రభుత్వంతో ఏకాభిప్రాయం కుదరడంతో ఇక సమ్మె, ఆందోళనలు, నిరసనలు విరమించాలని రాజస్తాన్‌లోని ప్రైవేట్ డాక్టర్లు నిర్ణయించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాజస్తాన్ విభాగం మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి సమ్మె నిలిపివేసినట్లు వెల్లడించింది. ఆరోగ్య హక్కు బిల్లు పరిధి నుంచి దాదాపు 98 శాతం ప్రైవేట్ ఆసుపత్రులను మినహాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఈ మేరకు అవగాహనా ఒప్పందంపై సంతకం చేశామని పేర్కొంది. నిజానికి ఆరోగ్య హక్కు బిల్లు మార్చి 28న రాజస్తాన్ అసెంబ్లీలో ఆమోదం పొందింది. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డాక్టర్లు ఆందోళనబాట పట్టారు. ఈ బిల్లు ప్రకారం.. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఎలాంటి రుసుము చెల్లించకుండానే అత్యవసర వైద్యం పొందే హక్కు ఉంటుంది. ప్రభుత్వ వైద్యశాల, ఆరోగ్య కేంద్రం, గుర్తింపు పొందిన ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో రుసుము వసూలు చేయకుండానే అత్యవసర వైద్యం అందించాలి. ఐఎంఏ సభ్యులు మంగళవారం రాజస్తాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో, ముఖ్య కార్యదర్శులతో సమావేశమయ్యారు. బిల్లుపై చర్చించారు.


గ్యాంగ్‌స్టర్ దీపక్ బాక్సర్ మెక్సికోలో అరెస్ట్

న్యూఢిల్లీ: దాదాపు పది కేసుల్లో ప్రధాన నిందితుడు, భారత్‌లో మోస్ట్ వాంటెడ్ నేరగాళ్ల జాబితాలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దీపక్ బాక్సర్‌ను పోలీసులు ఎట్టకేలకు మెక్సికోలో అరెస్ట్‌చేశారు. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ, విదేశాల్లో భారత నిఘా బృందాలు సహకారంతో పోలీసులు మెక్సికోకు వెళ్లి అతడిని అరెస్ట్‌చేశారు. విదేశాల్లో భారత పోలీసులు ఒక గ్యాంగ్‌స్టర్‌ను అరెస్ట్‌చేసి తీసుకురావడం ఇదే తొలిసారి. గతంలో జాతీయస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ గెల్చుకున్న దీపక్ పహాల్ ఆ తర్వాత నేరాలు చేస్తూ దీపక్ బాక్సర్‌గా పోలీసు రికార్డులకెక్కాడు. 2021లో ఢిల్లీలోని రోహిణి కోర్టు కాంప్లెక్స్‌లో మరో గ్యాంగ్‌స్టర్ జితేంద్ర మాన్ అలియాస్ గోగిని హత్య చేయించి అతడి గ్యాంగ్‌కు బాస్‌గా మారాడు.



విత్తన ప్యాకెట్లపై క్యూఆర్..

పంట బాగా పండాలన్నా.. నామమాత్రంగా మిగలాలన్నా విత్తన నాణ్యతే ముఖ్యం. విత్తన దశలోనే మోసాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. - 8లో▸



జై శ్రీరామ్.. జై హనుమాన్..

కొండగట్టు అంజన్న సన్నిధిలో హనుమాన్ చిన్న జయంతి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 30 వేల మంది దీక్షా స్వాములు వచ్చారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం 33.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

కాలం నువ్వు కలిసే వ్యక్తులను, హృదయం నువ్వు కోరే వ్యక్తులను, నీ ప్రవర్తన నీతో ఉండే వారిని నిర్ణయిస్తుంది.
- మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6:33	గురు 4:41

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య




చిగురుమామిడి(హుస్నాబాద్): కార్పొరేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాభ్యాసం కొనసాగుతుందని డీఈవో జనార్దన్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఆటపాటలతో పాటు చదువు కొనసాగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయవచ్చన్నారు. ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌నాయక్ అధ్యక్షత వహించగా సర్పంచ్ పెద్దపల్లి భవానిఅరుణ్‌కుమార్, జెడ్పీటీసీ గీకురు రవీందర్, ప్యాక్స్ చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, ఎంపీడీఓ నర్సయ్య, వైఎస్ ఎంపీపీ రాజిరెడ్డి, ఎస్సై సామల రాజేశ్, ఎంపీటీసీ రమేశ్, విద్యాకమిటీ చైర్మన్ మార్క రాజు, ఉపాధ్యాయులు దుబ్బాక బాల్‌రెడ్డి, స్వరూప, సునీత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు. కాగా కమేడియన్ సదానందం చేసిన హాస్యవల్లరి సభికులను అలరించింది. ఈ సందర్భంగా అతడిని ఘనంగా సన్మానించారు.

ఘనంగా అశ్వవాహనసేవ



ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వవాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శేషం రామాచార్యులు, శేషం వంశీధరచార్యులు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అశ్వవాహనంపై స్వామివారు ఆసీనులయ్యారు. మాడవీధుల గుండా ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో ఉడుత వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు



కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగులకు మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రారంభించారు. 92 మంది ఉద్యోగులకు శరత్ మాక్స్ విజన్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. డీఈటీ విజయేందర్ రెడ్డి, డీఈలు జె.రాజం, ఎస్.లక్ష్మారెడ్డి, సిఓ చంద్రయ్య, ఈఎల్‌పీ రాజు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా పరీక్షలు

కరీంనగర్: పదో తరగతి హిందీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసిందని డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 12,093 మందికి 12,072 మంది హాజరుకాగా 21 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు నలుగురికి ముగ్గురు హాజరయ్యారు. ఐదు ప్రత్యేక తనిఖీ బృందాలు 25 పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రెండు పరీక్ష కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక కేంద్రాన్ని, డీఈవో నాలుగు, ఇతర అధికారులు నాలుగు కేంద్రాలను మొత్తం 36 సెంటర్లను సందర్శించినట్లు పేర్కొన్నారు.

తాగి నడిపితే జైలుకే..

- కమిషనరేట్ పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు
- అయినా తీరు మార్చుకోని మందుబాబులు
- పలుమార్లు పట్టుబడిన వారికి జైలు, జరిమానా
- డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు పోలీసుల సిఫారసు

'గన్నేరువరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపి పలుమార్లు పట్టుబడ్డాడు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి మూడు రోజుల జైలు, రూ.1000 జరిమానా విధించారు'.

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యంతాగి వాహనం నడిపి పలుమార్లు పట్టుబడ్డాడు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి అతనికి ఐదు రోజుల జైలు, రూ.2000 జరిమానా విధించారు. ఇలా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పలుమార్లు పట్టుబడితే జైలుపాలు కాక తప్పదని పోలీసులు చెబుతున్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పర్యవేక్షిస్తున్న సీపీ ఎల్.సుబ్బారాయుడు

గతేడాది.. ఈ ఏడాది డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఇలా..

నెల	2022	2023
జనవరి	207	107
ఫిబ్రవరి	85	243
మార్చి	216	244
ఏప్రిల్	272	–
మే	309	–
జూన్	236	–
జూలై	211	–
ఆగస్టు	235	–
సెప్టెంబర్	186	–
అక్టోబర్	227	–
నవంబర్	282	–
డిసెంబర్	171	–
మొత్తం	2,637	594

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనం నడిపితే.. నడిపిన వ్యక్తితో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా అపాయమే. నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో 70శాతం వరకు తాగి నడపడం వల్ల చోటు చేసుకునేవే. ఒక్కరు చేసిన తప్పుకు చాలా కుటుంబాలు రోడ్డుపాలు అయ్యే ప్రమాదం డ్రంకెన్‌డ్రైవ్‌తో ఏర్పడుతోంది. ఈ క్రమంలో డ్రంకెన్ డ్రైవ్ విషయంలో కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ... రెండుకన్నా ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే కటకటాల వెనక్కి పంపిస్తున్నారు. దీంతో పాటు తాగి నడపొద్దని ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు.

కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

- మద్యం సేవించి పట్టుబడినవారికి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలను గురించి ఉదాహరణలతో పాటు వివరిస్తున్నారు.
- మద్యం తాగితే అనారోగ్యంతో పాటు తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురై ఇప్పటికే చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎందరో తల్లిదండ్రులు చేతికందిన కొడుకులను కోల్పోయిన ఘటనలు ఉన్నాయని అవగాహన సదస్సుల ద్వారా మార్పు వచ్చేలా కృషి చేస్తున్నారు.
- అయినప్పటికీ తాగి వాహనాలు నడపడం ఆపకపోగా.. పలుమార్లు పోలీసులకు పట్టుబడుతున్న వారి సంఖ్య ప్రతీనెలా పెరుగుతోంది. రెండుకన్నా ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడిన వారిని పోలీసులు కోర్టులో ప్రవేశపెడుతున్నారు. న్యాయమూర్తులు వారికి జైలుశిక్ష, జరిమానాలు విధిస్తున్నారు.
- కరీం'నగరం'తో పాటు కమిషనరేట్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటు సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.
- నగరశివారు, ప్రధాన చౌరస్తాలు, అనుమానం ఉన్న గ్రామాల పరిసర ప్రాంతాల్లో నిత్యం పగలు, రాత్రనే తేడాలు లేకుండా పోలీసులు వాహనతనిఖీలు నిర్వహిస్తూ.. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు.
- మద్యంతాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధిస్తూ.. అధికమోతాదులో తాగినవారికి జైలుశిక్ష విధించేలా చేస్తున్నారు. ఎక్కువసార్లు పట్టుపడిన వారి వివరాలు రవాణాశాఖ అధికారులకు పంపిస్తున్నారు.
- రెండుసార్లు కన్నా ఎక్కువసార్లు పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయడానికి ట్రాఫిక్ పోలీసులు సిఫారసు చేస్తున్నారు. ఆర్టీఏ అధికారులు వారి లైసెన్సులు రద్దు చేస్తున్నారు.

మద్యంతో ప్రమాదాలు



మద్యం సేవించి వాహనాలు నడిపి ఎందరో ప్రమాదాలకు గురై ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు అనేకం. మద్యంమత్తులో వేగం తెలియక వారి ప్రాణాలతో పాటు ఎదుటి వారిని బలిచేస్తున్నారు. నగరంలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నాం. పలుమార్లు మద్యం సేవించి పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశ పెడుతుండగా న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు.
– ఎల్.సుబ్బారాయుడు, కరీంనగర్ సీపీ

బాబోయ్ లీకుల గోల..!



వీసీలో పాల్గొన్న కరీంనగర్ అడిషనల్ కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్యాం ప్రసాద్‌లాల్, తదితరులు

- కలెక్టర్లు, సీపీ, ఎస్పీలను అలర్ట్ చేసిన ప్రభుత్వం
- ఆఖరు పరీక్ష వరకు నిర్వహణ బాధ్యత వారిదే
- నిర్లక్ష్యం వహించిన సిబ్బంది ఉద్యోగాలు పీకేస్తాం
- కలెక్టర్లు కూడా సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టంచేసిన మంత్రి, సీఎస్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబిత

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో వరుసగా వెలుగుచూస్తున్న లీకేజీలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న పదోతరగతి పరీక్షల నేపథ్యంలో మరిన్ని పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది. రెండు రోజులపాటు తెలుగు, హిందీ పరీక్షల పేపర్లు వాట్సాప్ ద్వారా వైరల్ కావడంతో పరీక్షల నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఓ వైపు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ పరీక్షల పేపర్లు లీకవడం, దానిపై సిట్ దర్యాప్తు జరుగుతుండగానే.. మరోవైపు పదో తరగతి పరీక్ష పేపర్లు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతుండటాన్ని విద్యాశాఖ తీవ్రంగా పరిగణించింది. దీంతో బుధవారం నుంచి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అలజడులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

అన్ని జిల్లా కలెక్టర్లతో వీసీ..!

పదో తరగతి పేపర్లు వరుసగా సోషల్ మీడియాలో ప్రత్యక్షమవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెలుగు, మంగళవారం హిందీ పేపర్ వాట్సాప్ పేపర్లలో ప్రత్యక్షమైన తీరు పరీక్ష నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ఇది లీకేజీ కాదని చెబుతున్న పోలీసు ఉన్నతాధికారులు వాటిని సర్క్యులేట్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మంగళవారం ఉదయం హిందీ పేపర్ బయటికి వచ్చిన వెంటనే.. ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు వచ్చిన ఆదేశాల మేరకు వారివారి జిల్లాల్లో సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డీజీపీ అంజనీకుమార్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్‌జయంతి, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, అడిషనల్ సీపీ చంద్రశేఖర్, జగిత్యాల కలెక్టర్ యాస్మీన్ భాషా, ఎస్పీ భాస్కర్, పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం సీపీ రెమా రాజేశ్వరితోపాటు పలువురు ఆర్డీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు సైతం ఫోన్ అనుమతి లేదు..

ఎలాంటి చిన్న నిర్లక్ష్యాన్నైనా సహించేది లేదని స్పష్టంచేశారు. పరీక్షల విధుల్లో ఉన్న వారెవరైనా సరే నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిని సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష నిర్వహణలకు పూర్తిగా డీఈవోలను బాధ్యులను చేయాలని, అవకతవలకు పాల్పడితే రిమూవల్ సర్వీస్ చేయాలని కూడా కలెక్టర్లకు సూచించారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని పోలీసులకు సూచించారు. సెంటర్లను తనిఖీ చేసే కలెక్టర్లు, డీఈవోలు, తహసీల్దార్లు ఎవరైనా సరే లోనికి సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టంచేసినట్లు సమాచారం.

కరీంనగర్ పేరుతో ఉలికిపాటు..

మంగళవారం ఉదయం వరంగల్ జిల్లాలో వాట్సాప్‌లో ప్రత్యక్షమైన పదో తరగతి హిందీ పేపర్ ఉమ్మడి జిల్లా పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. పేపర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వాట్సాప్‌లో పోస్టులు చేశారని వార్తలు రావడంతో జగిత్యాల, సిరిసిల్ల, రామగుండం, కరీంనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇక ఇంటెలిజెన్స్ పోలీసులు కూడా ఈ వ్యవహారంలో ఆరా తీయడం ప్రారంభించారు. మొత్తానికి సాయంత్రానికి పేపర్ కరీంనగర్ జిల్లా నుంచి లీకవలేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో పాల్గొన్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: రాజస్తాన్ వైద్యులకు సంఘీభావంగా ఐఎంఏ జాతీయ శాఖ పిలుపు మేరకు ఐఎంఏ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, లోపభూయిష్టమైన రాజస్తాన్ రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య బిల్లులో మార్పు కోసం ఉద్యమిస్తున్న ఆ రాష్ట్ర ఐఎంఏ వైద్యులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి లోపభూయిష్టమైన చట్టాలు అమలు చేయడం సరికాదని వీటివల్ల ప్రజలు నష్టపోతారని తెలిపారు. సరైన సమయంలో అత్యవసర చికిత్స అందక, వైద్యం అందించాల్సిన విలువైన సమయాన్ని సరైన వసతులు లేని హాస్పిటల్స్ ఉచిత వైద్యం పేరిట ఉంచి కాలయాపన చేయడం వల్ల ప్రాణాలకే ప్రమాదమన్నారు. దీనికి బదులుగా ప్రభుత్వ హాస్పిటల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో సమృద్ధి పరిచి ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని, బడ్జెట్లో ఆరోగ్యానికి ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పుడు పనులు చేస్తూ, మళ్లీ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి ఆచరణ సాధ్యంకాని హామీలు, పనులను, ఉచితాల పేరుతో ప్రజలను మోసం చేసి సమాజంలో చిచ్చుపెట్టవద్దని హెచ్చరించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్‌కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు వెంకట్‌రెడ్డి, మహేశ్, భాగ్యరెడ్డి, అలీం, రాజేశ్వర్, ఝూన్సీ, శేషశైలజ, మానస తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయండి



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న రమేశ్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని కొత్తపల్లిలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు విత్తనాభివృద్ధి సంస్థ గోదాములు కేటాయించగా, వాటిలో జరుగుతున్న మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించేలా ల్యాబ్‌లు, తరగతి గదులను సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి మెడికల్ కళాశాల పునర్నిర్మాణ పనులపై చర్చించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనులు వేగవంతంగా చేసేందుకు కావాల్సిన అన్ని వసతులు, నిధులు ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఎలాంటి పెండింగ్ పనులు ఉండకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,700

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,700 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 97 వాహనాల్లో 1,753 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6,800 చెల్లించారు. గన్నీ సంచుల్లో 9 మంది రైతులు 8 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,200, మోడల్ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.6,000 పలికింది. కాగా బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మార్కెట్‌యార్డుకు సెలవు ఉంటుంది.

'శాతవాహన'కు రూ.20 కోట్లు

- గిరిజన వసతిగృహాల నిర్మాణానికి నిధులు
- బాలురకు రూ.10 కోట్లు, బాలికలకు రూ.10 కోట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, సంఘాలు



శాతవాహన యూనివర్సిటీ

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీకి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వర్సిటీ ప్రాంగణంలో రెండు గిరిజన విద్యార్థుల వసతిగృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో బాలుర వసతి గృహానికి రూ.10 కోట్లు, బాలికల వసతి గృహానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 7 యూనివర్సిటీలకు గాను ఒక్కో యూనివర్సిటీకి రూ.20 కోట్లు మంజూరు చేశారు. ఇందులో భాగంగా శాతవాహనకు 2 వసతిగృహాలు కేటాయించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా..

ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలతో పాటు కరీంనగర్‌లోని శాతవాహనకు నిధులు మంజూరు చేయగా, ప్రత్యేకంగా గిరిజన విద్యార్థులకు రెండు వసతిగృహాలు నిర్మించతలపెట్టారు. ఒక్కో హాస్టల్‌లో కనీసం 300 మంది వరకు మొత్తం 600 మంది ఉండేలా నిర్మాణాలు చేపట్టనున్నట్లు సమాచారం. శాతవాహన మెయిన్ క్యాంపస్‌లో అందరికీ కలిపి (బాలుర, బాలికలకు) వేర్వేరుగా ఉండగా ఇప్పుడు ప్రత్యేకంగా గిరిజనులకు వసతిగృహాల నిర్మాణాలు చేపడుతున్నారు. గిరిజన విద్యార్థులకు పూర్తిగా వసతి కల్పించిన తర్వాత మిగతావారు కూడా ఉండేలా సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మానేరుడ్యాం వద్ద గల శాతవాహన ఫార్మసీ క్యాంపస్‌లో ఉన్న వసతిగృహాలు పాత భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటికి కూడా నూతన భవనాలు నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తుండగా గతంలోనే వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు.

వీసీ ప్రత్యేక చొరవతో..

శాతవాహన యూనివర్సిటీకి నిధుల కేటాయింపునకు వీసీ ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నిధుల కేటాయింపు కోసం న్యాక్ గుర్తింపు లేకపోవడం, ఇతర కారణాలు పరిశీలించినప్పుడు నిధులు పొందేందుకు శాతవాహనకు అర్హత లేదు. కాగా 12బీ సాధించామని, త్వరలోనే న్యాక్ గుర్తింపునకు ముమ్మరంగా కృషిచేస్తున్నట్లు వీసీ ప్రభుత్వానికి, సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా శాతవాహన సమస్యలపై, వసతిగృహాలు కేటాయిస్తే విద్యార్థులకు మరింత సౌకర్యాలు మెరుగుపడుతాయని లోతుగా వివరించి తుదకు నిధులు సాధించినట్లు తెలిసింది.

నిధుల కేటాయింపు హర్షణీయం



శాతవాహన యూనివర్సిటీలో గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా వసతిగృహాల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయడం హర్షణీయం. దీని ద్వారా విద్యార్థులకు మరింత వసతి సౌకర్యాలు మెరుగుపడుతాయి.
– జి.బీమాసాహెబ్, తెలంగాణ గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు

సౌకర్యాలు పెరుగుతాయి



శాతవాహనలో గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా వసతిగృహాల నిర్మాణం చేపట్టడం సంతోషకరం. వెంటనే నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.
– జి.తిరుపతి, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

మరిన్ని వసతులు



రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలతో పాటు శాతవాహనలో గిరిజన విద్యార్థులకు వసతిగృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక్కో వర్సిటీకి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో 600 మంది విద్యార్థులకు మరింత వసతి కల్పించవచ్చు. న్యాక్ గుర్తింపు సాధనకు కృషిచేస్తున్నాం. త్వరలోనే సాధిస్తాం.
– ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్, శాతవాహన వీసీ

క్లుప్తంగా

టాపర్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ మంకమ్మతోటలోని సాయిమానేరు పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల టాపర్స్ ఐఐటీ ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింయాడ్‌లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మ్యాథ్స్, సైన్స్ విభాగాల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఒలింపియాడ్‌లో 11 మంది విద్యార్థులు బంగారు, 11 మంది రజత, 11 మంది కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఏఓ సుభాష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో విద్యార్థులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కెమ్‌డ్రా, సోప్ మేకింగ్ సర్టిఫికెట్ కోర్సుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కెమ్‌డ్రా సర్టిఫికెట్ కోర్సు కోఆర్డినేటర్ కె.భాస్కర్, సోప్ మేకింగ్ సర్టిఫికెట్ కోర్సు కోఆర్డినేటర్ జీవీఆర్ సాయిమధుకర్, రసాయనశాస్త్ర అధ్యాపకులు ఎం.శ్రీధర్, జి.శ్రీనివాస్, బి.మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గంగాధర(చొప్పదండి): మండలంలోని కురిక్యాల శివారు వరదకాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకువచ్చినట్లు ఎస్సై అభిలాష్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. కురిక్యాల గ్రామానికి చెందిన సర్పంచు మేచినేని నవీన్‌రావుకు వరద కాలువ సమీపంలో పంటపొలాలు ఉన్నాయి. మంగళవారం పొలం వద్దకు వెళ్లి వస్తుండగా వరదకాలువలో మహిళ మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా నీటినుంచి బయటకు తీయించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టరాకుండా ఉంది. పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విత్తన ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్

- మోసాలకు అడ్డుకట్ట
- విత్తనోత్పత్తి, విక్రయ విధానంలో మార్పులు



గతంలో పట్టుబడిన నకిలీ విత్తనాలు

జిల్లాలో సాగు చేసే పంటల విస్తీర్ణం(ఎకరాల్లో)	
వరి	2,22,199
పత్తి	1,00,979
కందులు	5,476
పెసలు	2,524
మిర్చి	460
పసుపు	426
కూరగాయలు	1,876
ఇతర పంటలు	5,882

కరీంనగర్ అర్బన్: పంట బాగా పండాలన్నా.. నామమాత్రంగా మిగలాలన్నా విత్తన నాణ్యతే మూలం. ఈ క్రమంలో విత్తన దశలోనే మోసాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నడుం బిగించింది. ఎంతటివారైనా నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేస్తుండగా యంత్రాంగం తదనుగుణంగా చర్యలు చేపడితే రైతన్నకు కొండంత భరోసా. కాగా ఏటా నకిలీ విత్తనాల వలలో రైతన్న చిక్కిశల్యమైన ఘటనలు ఎన్నెన్నో. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యలకు ఓ చక్కటి పరిష్కారంతో ముందడుగు వేసింది. ఖరీఫ్‌నుంచి రైతులకు సరఫరా చేసే విత్తన విక్రయ విధానంలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. ఈ మార్పుతో విత్తన మోసాలకు అడ్డుకట్టపడి, రైతులకు నాణ్యమైన విత్తులు అందే అవకాశం ఉంటుంది. ఇక ప్రతి విత్తన ప్యాకెట్‌పై క్యూఆర్‌కోడ్ తప్పనిసరి చేస్తోంది.

నకిలీలో పత్తిదే అగ్రస్థానం

జిల్లాకేంద్రంగా ఏటా దాదాపు 90లక్షల పత్తి సర్టిఫైడ్ విత్తనాలు ఉత్పత్తి అవుతున్నాయి. వివిధ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోనూ వీటిని ప్రముఖ కంపెనీలు విక్రయిస్తున్నాయి. అవే కంపెనీల పేరుతో నకిలీ బ్రాండ్లు విచ్చలవిడిగా మార్కెట్లో దొరుకుతున్నాయి. ఇక వరి, మొక్కజొన్నలో నకిలీ వ్యవహారాలకు అంతులేకుండా పోతోంది. గతంలో శంకరపట్నం మండలంలోని సీడ్ మిల్లులో అక్రమాలు వెలుగుచూడటం విశేషం. విత్తన ధ్రువీకరణ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండగా ఇంకా విచారణ సాగుతుండటం గమనార్హం.

సెల్‌ఫోన్‌తో స్కానింగ్

విత్తనోత్పత్తి చేసిన కంపెనీలు విత్తన ప్యాకెట్‌ను మార్కెట్‌లో రిటైల్ దుకాణాలకు విక్రయించే సమయంలోనే ప్రతి ప్యాకెట్‌పై బార్‌కోడ్/క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ముద్రించాలని కేంద్రం ఆదేశించింది. క్యూఆర్‌కోడ్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే అందులో విత్తనోత్పత్తి చేసిన రైతు, ప్రాంతం పూర్తి వివరాలు అందులో కనిపించాలి. దాంతోపాటే ఎక్కడ శుద్ధి చేశారు, ఎవరు పరీక్షించారు అనే వివరాలు కూడా తెలియాలి. జన్యుమార్పిడి ద్వారా విత్తనోత్పత్తి చేసిన విత్తనాలైతే ఆ వివరాలు సైతం బార్‌కోడ్‌లో కనిపించాలి. ఏ కంపెనీ ఎక్కడ సేకరించింది అన్నది కూడా ఉండాల్సిందే. ఇన్ని వివరాలు ఉన్నప్పుడు నకిలీ విత్తన వ్యాపారానికి అవకాశమే ఉండదు.

ప్రైవేటు విత్తుదే సింహభాగం

జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి సాధారణ సాగు 3.40లక్షల ఎకరాలు కాగా 3లక్షల ఎకరాలు సాగు చేస్తుంటారు. ఏటా పత్తి, వరి, కంది, పెసలు, ఇతర పంటలు సాగు చేసేందుకు రైతులకు 80వేల మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరమని అంచనా. ఇందులో ఒక్క పత్తి, వరి సాగుకే సింహభాగం అవసరం. రైతులకు అవసరం ఉన్నదాంట్లో కేవలం 30శాతం విత్తనాలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. గతేడాది ప్రభుత్వం 25వేల మెట్రిక్ టన్నుల విత్తనాలు మాత్రమే సరఫరా చేయగా ప్రైవేటు కంపనీలు రైతులకు రిటైల్ వ్యాపారుల ద్వారా 60వేల మెట్రిక్ టన్నుల విత్తనాలు విక్రయించాయి. ప్రభుత్వ సరఫరా కంటే దాదాపు మూడింతల మార్కెట్ ప్రైవేటు కంపనీలకు ఉండటంతో అధికశాతం కంపెనీలు దిక్కూమొక్కూ లేని నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. అడపాదడపా విజిలెన్స్ దాడులు చేసి పట్టుకున్నా సాక్ష్యాధారాలు బలంగా ఉంటేనే కేసులు నిలుస్తున్నాయి.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: అన్నివర్గాల ప్రజలు పరస్పర సహకారంతో మెదులుతూ ప్రతి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు అన్నారు. రాబోవు రంజాన్ పర్వదినం సందర్భంగా మంగళవారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఎలాంటి ఘటనలు లేకుండా శాంతియుతంగా ఉండే ప్రాంతాలే అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతాయన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతను తెలుసుకొని ఉండాలని చెప్పారు. అత్యుత్సాహం ప్రదర్శించే చర్యలకు పాల్పడటం ద్వారా ఇబ్బందులు కలుగుతాయన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఇతరుల మత విశ్వాసాలకు భంగం కలిగించకూడదని కోరారు. మసీదుల వద్ద పార్కింగ్ క్రమ పద్ధతిలో ఉండాలన్నారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ లను ప్రోత్సహించకూడదని చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్, ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి గైట్ మహేశ్ బాబా సాహెబ్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, ఎస్బీఐలు జి.వెంకటేశ్వర్లు, బి.సంతోష్‌కుమార్, శాంతి కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ఎంఏ రఫీక్, జగదీశ్ చారి, ఇనుగుర్తి రమేశ్, రాధాకిషన్, మన్సూర్ తవక్కలి, సయ్యద్ ముజఫర్, ఘనశ్యామ్ ఓజా తదితరులు పాల్గొన్నారు.

నేడు దసరా సినిమా విజయోత్సవ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల, తదితరులు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ యాసతో నాని, కీర్తి సురేష్ నటించిన 'దసరా' చిత్రం విజయోత్సవ సభను బుధవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. మంగళవారం సభకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ కుటుంబ నేపథ్యం, బంధాలు అనుబంధాల గురించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్లకు చెందిన వేణు నిర్మించిన బలగం సినిమా విజయవంతం కాగా కరీంనగర్‌లోనే విజయోత్సవ సభ నిర్వహించారని వివరించారు. సింగరేణి బొగ్గు గని జీవితాల నేపథ్యంతో తీసిన దసరా సినిమా విజయవంతం కావడం, విజయోత్సవ సభను కరీంనగర్‌లో నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో గొప్ప నగరంగా కరీంనగర్‌ను తీర్చి దిద్దుతున్నామని, అందుకే సినిమా విజయోత్సవ సభలను ఇక్కడ జరుపుకోవాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

- ప్రహరీ కూలిన ఘటనలో రెండు రోజుల్లో మృత్యుఒడికి తల్లీకూతురు
- ఎల్లారెడ్డిపేటలో విషాదం



అక్షయ(ఫైల్)



ఆసుపత్రిలో అక్షయ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రహరీ ఆ ఇంట్లో తీరని విషాదం నింపింది. మృత్యు శకటంగా మారి తల్లీకూతురు ప్రాణాలు తీసింది. ఈ హృదయ విదారకర ఘటనతో ఎల్లారెడ్డిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఆరె దేవవ్వ (36), ఆమె కూతురు అక్షయ(16)లు కలిసి సోమవారం తమ ఇంటివద్ద ప్రహరీని ఆనుకొని ఇసుక పోశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కూలి, వారిపై పడింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దేవవ్వ భర్త నర్సయ్య వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించగా అప్పటికే దేవవ్వ మృతిచెందింది. అక్షయను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న అక్షయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు మంగళవారం ఉదయం చెప్పారు. ఒకవైపు కూతురు చావుబతుకుల్లో ఉండగానే కుటుంబసభ్యులు, బంధువులు తల్లి మృతదేహానికి సాయంత్రం దహన సంస్కారాలు పూర్తి చేసి, ఇంటికి వచ్చారు. అప్పుడే వారికి అక్షయ కూడా చనిపోయినట్లు తెలిసి, కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు రోజుల వ్యవధిలో తల్లీకూతురు మృతితో స్థానికులు కంటతడి పెట్టారు. దేవవ్వ భర్త నర్సయ్య దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అక్షయ ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమె త్వరగా కోలుకోవాలని సహచర విద్యార్థులు స్థానిక ఆలయాల్లో చేసిన పూజలు ఫలించలేదు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చే సుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

బలగం సినిమా చూసి ఒక్కటైన కుటుంబం



బలగం సినిమా చూసి కలిసిన కుటుంబం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): బలగం సినిమా చూసి స్పందించిన ఓ కుటుంబం కలహాలు వీడి ఒక్కటైంది. వివరాలు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో తరలివచ్చి సినిమా తిలకించారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తూ గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. అయితే, గ్రామానికి చెందిన అన్నదమ్ములు బొప్పరతి సంజీవ్, రాజేందర్, జనార్దన్ కుటుంబాలు కూడా సినిమా తిలకించాయి. ఈ మూడు కుటుంబాలు మనస్పర్థలతో 15ఏళ్లుగా మాట్లాడుకోవడంలేదు. వీరి తల్లి బొప్పరాతి తారబాయి మంగళవారం ఉదయం వృద్ధాప్య కారణాలతో మృతి చెందింది. బలగం సినిమాలో మాదిరిగానే ముగ్గురు అన్నదమ్ములు, వారి కుటుంబాలు కలిసిపోయాయి. తల్లి అంతిమయాత్ర నిర్వహించాయి.

ఆరోగ్య పథకం సేవలు వినియోగించుకోవాలి

వీణవంక(హుజూరాబాద్): మహిళలు సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చికిత్సలు, సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం మండలంలోని చల్లూరు ఆరోగ్య క్రేంద్రంలో మహిళ ఆరోగ్య పథకం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్త్రీలకు సంబంధించి క్యాన్సర్, స్క్రీనింగ్, సూక్ష్మ పోషకాల లోపాలు తదితర వ్యాధులపై ప్రతీ మంగళవారం జిల్లాలోని బుట్టి రాజారాంకాలనీ, చొప్పదండి, చల్లూరు ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారని మహిళలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఘన్ముకుల గ్రామంలోని ఐసీడీఎస్ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతల పోషణ యొక్క ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాజిద, మహిళ శిశు సంక్షేమ అధికారి సబిత, ఉప వైద్యాధికారి చందు తదితరులు పాల్గొన్నారు.

సెస్ అసిస్టెంట్ హెల్పర్‌కు గాయాలు

వేములవాడ: పట్టణంలోని రెండో బైపాస్‌రోడ్డులో విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సమస్యను మంగళవారం పరిష్కరించే క్రమంలో అసిస్టెంట్ హెల్పర్ తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. తిరుపతికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో చోరీ

కథలాపూర్: మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ సమయంలో జేబుదొంగలు తమ పని కానిచ్చేశారు. కథలాపూర్ మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన పత్రి నర్సయ్య జేబులో నుంచి రూ.50 వేలు, తాండ్ర్యాల గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారావు జేబులో నుంచి రూ.10 వేలు కాజేశారు. మరో ఇద్దరు నాయకులకు చెందిన రూ.2 వేల చొప్పున మాయమయ్యాయి. కానీ వారు బయటకు చెప్పడానికి ఇష్టపడటం లేదు. ఆత్మీయ సమ్మేళనానికి ఎక్కువ మంది హాజరవడం దొంగలకు కలిసొచ్చినట్లయిందని పలు వురు బీఆర్‌ఎస్ నాయకులు వాపోయారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి గంగాధర్‌ను దొంగతనం కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లిలో ఈ నెల 1న రాత్రి ఎండీ.సాజిద్ ఇంట్లోకి చొరబడి పీరీలకు అలంకరించే వెండి ఆభరణాలను గంగాధర్ చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతని వద్ద 768 గ్రాముల వెండి ఆభరణాలు దొరికాయని ఎస్సై పేర్కొన్నారు. దీంతో మంగళవారం గంగాధర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ధర్మపురి: మంగళవారం గోదావరి పుణ్యస్నానాలకు వస్తున్న భక్తుల కారు ధర్మపురిలోని బోయవాడలో రోడ్డుపై గుంతలో దిగబడింది. ఎంతకీ బయటకు రాకపోవడంతో స్థానికుల సాయంతో లాగారు. భక్తులకు తృటిలో ప్రమాదం తప్పిందని అక్కడున్నవారు తెలిపారు. భక్తులు నిత్యం గోదావరి స్నానాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. రోడ్డుపై గుంత ప్రమాదరంగా మారింది.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి





కేంద్రాన్ని సందర్శిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ధన్గర్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీటి వసతులు ఉన్నాయా, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు అనుమతించవద్దని, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట డీఈవో జనార్దన్‌రావు, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

కరీంనగర్: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా మౌలికవసతులు సరిగా ఉండాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ముకరంపురలో గల వాణినికేతన్ బాల విహార్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు పరీక్ష రాసే విధానం, సరళిని పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్స్‌ను ఆదేశించారు. సమీపంలో ఎలాంటి జిరాక్స్ సెంటర్లు ఉండరాదని, 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

ఎల్లమ్మ బోనాల జాతర విజయవంతం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సత్యనారాయణగౌడ్, పొన్నం ప్రభాకర్ తదితరులు

కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రంలోని బొమ్మకల్ బైపాస్ రోడ్డులో గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల జాతరను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. జాతరకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 23 నుంచి 26 వరకు జాతర నిర్వహిస్తామని, బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహ గంగస్నానం, లందకి బొట్టు పెట్టే కార్యక్రమాలు ఉంటాయని, ఈనెల 8 నుంచి 22 వరకు జోగు కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 23న అక్షయ తృతీయ సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి పోచమ్మ బోనాలు, 24న పాత బజార్ నుంచి ఘటం కుండ ఊరేగింపు, 25 పంచమి రోజున సాయంత్రం రాంనగర్ నుంచి ఎల్లమ్మతల్లి ఆలయం వరకు బోనాల కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం రేణుకాదేవి జమదగ్నిల సిద్ధయాగ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని వివరించారు. 26న నాగవెల్లి పట్నాలు, మొక్కుల చెల్లింపులు, మహాపూజ, మంగళహారతి, మంత్రపుష్పము కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని వెల్లడించారు. కల్యాణం రోజు ఊరేగింపు అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు. ప్రతి గౌడ కులస్తుడు రాజకీయాలు, హోదాలకతీతంగా జాతరలో పాల్గొని కుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్వీజీ గ్రానైట్స్ అధినేత రాచకొండ తిరుపతిగౌడ్, ఆదర్శ సత్యనారాయణగౌడ్, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మాచెర్ల ప్రసాద్‌గౌడ్, కోడూరి మహేందర్‌గౌడ్, హరికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై హత్యాయత్నం కేసులో భార్య, ఆమె ప్రియుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): భర్తను కడతేర్చి, ప్రియుడితో కలిసి వెళ్లిపోదామని ప్లాన్ వేసిన కిలాడీ భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని ఇంద్రానగర్ భరత్‌నగర్ కాలనీకి చెందిన చిట్యాల శైలజ–బాలకృష్ణలకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కాగా శైలజ తనకు వరుసకు మరిది అయ్యే చిట్యాల శ్రీకాంత్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం బాలకృష్ణకు తెలియడంతో పద్ధతి మార్చుకోవాలని ఇద్దరినీ హెచ్చరించాడు. ఈ క్రమంలో బాలకృష్ణ తమకు అడ్డుగా ఉన్నాడని, అతన్ని ఎలాగైనా చంపాలనుకున్నారు. గత మార్చి 3న శైలజ, శ్రీకాంత్‌లు కలిసి పొలం వద్ద కరెంట్ షాక్ పెట్టారు. కానీ అదృష్టవశాత్తు బాలకృష్ణ తృటిలో తప్పించుకున్నాడు. అతను చనిపోలేదని గ్రహించిన శైలజ, శ్రీకాంత్‌లు భయంతో ఇంటి నుంచి పారిపోయారు. బాలకృష్ణఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు వరంగల్‌లో తలదాచుకున్నట్లు గుర్తించి, మంగళవారం ఉదయం అరెస్టు చేసి, సిరిసిల్లకు తరలించారు. శైలజ, శ్రీకాంత్‌లను రిమాండ్‌కి తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

మెరుగైన ఒప్పందం సాధించేలా కృషి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): కోల్‌కత్తాలో ఈనెల 18న జరిగే 11వ వేతన ఒప్పందంలో మెరుగైన అగ్రిమెంట్ సాధించేలా కృషి చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. వేజ్ బోర్డులో 19శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్ అంగీకారం కుదిరిందన్నారు. మిగిలిన అంశాలపై మేనేజ్‌మెంట్ పూర్తిస్థాయిలో సానుకూలమైన వాతావరణంలో చర్చలు జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. వేతన పరిష్కారంలో మిగిలిన ఇతర అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం లేకున్నా ఒప్పందం కుదిరిన తర్వాతే మంత్రిత్వశాఖ ఆమోదం కోసం పంపబడుతుందన్నారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో వేజ్‌బోర్డు ఒప్పందం ఖరారు చేసేలా కోల్ ఇండియా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, సారంగపాణి, మాదాసు రవీందర్, నీలం రవి, మంచినీళ్ల స్వామి, చిర్ర అంజనేయులు, పోతరాజు భాస్కర్, యాదగిరి నరేష్, ఈదునూరి శ్రీనివాస్, ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి




మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం సాంబయ్య

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్జీ-1 ఏరియా జీడీకే-11గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం చింతల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలు చేయడంపై గుర్తు చేశారు. రక్షణ చర్యలు పాటించిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు బి.సత్యనారాయణ, శ్రీనివాస్, నెహ్రూ, రాందాస్, రాజబాబు, జాన్సన్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్(రామగుండం): భవన నిర్మాణరంగ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండంలోని యూనియన్ కార్యాలయంలో కార్మికులు పలువురు యూనియన్‌లో చేరిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వేల కోట్ల రూపాయలు భవన నిర్మాణరంగంలో ఉన్నా కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు లేవన్నారు. . ఈసందర్భంగా యూనియన్‌లో చేరినవారికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



హోర్డింగ్‌లతో జర భద్రం

తరచూ వీస్తున్న బలమైన ఈదురుగాలులతో కరీంనగర్ ప్రధాన రహదారులపై ప్రయాణం నగర వాసులను కలవరపెడుతోంది. బలహీనంగా, ఊగిసలాడుతున్న హోర్డింగ్‌లు ఎక్కడ కుప్పకూలుతాయోనని ఆందోళన వెంటాడుతోంది. అకస్మాత్తుగా ఏదైన నష్టం జరిగితే కారకులెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంగళవారం సాయంత్రం పెద్ద ఎత్తున ఈదురుగాలులు రావడంతో కొన్ని హోర్డింగ్‌లలోని ఫ్లెక్సీలు ఇలా గాలిలో తేలియాడుతున్నాయి. ఫ్లెక్సీ కాస్త తెగి వాహనాల మీద పడితే పెద్ద ప్రమాదమే జరుగుతుంది. అధికారులు ముందస్తుగా గమనించి ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సప్తగిరికాలనీ(కరీంనగర్)

ఆధ్యాత్మికం



పల్లకి సేవ

కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో నిర్వహిస్తున్న చెన్నకేశవస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. గ్రామస్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో చెన్నకేశవస్వామి ఆలయం నుంచి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరా శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కూర నరేశ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

- కరీంనగర్‌రూరల్

నీటి ఎద్దడి నివారణకు కసరత్తు

- వేసవి నేపథ్యంలో అధికారుల ప్రత్యామ్నాయ ప్రణాళిక
- సర్పంచుల నుంచి ముందస్తుగా సమాచార సేకరణ
- యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు



చెర్లభూత్కూర్‌లో పైపులైన్ లీకేజీ కావడంతో చేస్తున్న మరమ్మతులు



బొమ్మకల్‌లో పైపులైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

కరీంనగర్‌రూరల్: వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇబ్బందులు రాకుండా కసరత్తు మొదలు పెట్టారు. ఎండలు ముదరక ముందే అప్రమత్తమై క్షేత్రస్థాయిలో సమస్యలపై సర్వే చేపడుతున్నారు. గ్రామాల్లోని సర్పంచుల నుంచి ఏ సమస్యలున్నాయో తెలుసుకుంటున్నారు. ప్రాధాన్యత ఉంటే యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేస్తున్నారు.

ఈ రెండు నెలలే ముఖ్యం..

కరీంనగర్‌రూరల్ మండలంలోని 17 గ్రామపంచాయతీలకు ఎల్‌ఎండీలోని ఇంటెక్ వెల్ నుంచి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. ఎలగందల్‌లో నీటిని క్లోరినేషన్ చేసిన అనంతరం కమాన్‌పూర్ గుట్టపై ఉన్న ట్యాంక్ ద్వారా ఆయా గ్రామాల్లోని ట్యాంకుల్లోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం వేసవికాలంలో ఎండలు తీవ్రం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశముండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపడుతున్నారు. ఆయా గ్రామాల్లోని ట్యాంకుల ద్వారా ఎంత నీరు ప్రజలకు సరఫరా చేస్తున్నారు, నీరు సరిపోతున్నాయా లేదా ఎంత సమయం సరఫరా చేస్తున్నారనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాకుండా సర్పంచులు నేరుగా ఫిర్యాదు చేస్తే వెంటనే గ్రామాల్లోకి వెళ్లి మరమ్మతులు చేస్తున్నారు. నీరు సరిపోకపోతే ఎక్కువ మోతాదులో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

సమ్మర్ క్రాష్‌కోర్స్ లేనట్లే..

ప్రతీ వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు మూడు నెలలపాటు సమ్మర్ క్రాష్‌కోర్స్ నిర్వహిస్తారు. అయితే ఇప్పటికే ఒక నెల గడిచి పోగా ఇంకా రెండు నెలలు మాత్రమే వేసవి కాలముంది. క్రాష్‌కోర్స్‌కు బదులుగా అధికారులు ముందస్తుగానే తాగునీటి సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. తాగునీటి ఇబ్బందులపై వివరాలు తెలుసుకుని అవసరమైన మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపడుతున్నారు. దీంతో ఇప్పటివరకు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తలేదు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు

గ్రామాల్లో తాగునీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. తాగునీటి సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందిస్తున్నాం. పైపులైన్లు పగిలిపోవడం, లీకేజీ సమస్యలను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేస్తున్నాం.

– సూర్యప్రకాశ్‌రెడ్డి, డీఈ, ఇంట్రావిలేజ్

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కరీంనగర్‌టౌన్: కంటి వెలుగు శిబిరాలను 18 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం నగరంలోని 58వ డివిజన్ కెమిస్ట్‌భవన్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కంటి చూపునకు సరిపోయే రీడింగ్ అద్దాలను అప్పటికప్పుడే ఇవ్వడం జరుగుతుందని, డిస్క్రైబ్ అద్దాలను వారం రోజుల్లోగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో కంటి పరీక్షలు నిర్వహించుకునేలా అధికారులు మోటివేట్ చేయాలని సూచించారు. మెప్మా పీడీ బి.రవీందర్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన ఆర్‌ఐ



షెడ్డును పరిశీలిస్తున్న ఆర్‌ఐ రజనీకాంత్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ప్రభుత్వభూమిలో నిర్మిస్తున్న షెడ్డును మంగళవారం ఆర్‌ఐ రజనీకాంత్ పరిశీలించారు. సర్వేనం.105లోని ప్రభుత్వస్థలంలో షెడ్డు నిర్మిస్తున్నారంటూ స్థానికులు తహసీల్దార్ నారాయణకు ఫిర్యాదు చేయగా విచారణ నిమిత్తం ఆర్‌ఐని మోఖాపైకి పంపించారు. ప్రభుత్వస్థలంలో నిర్మిస్తున్న షెడ్డును ఆర్‌ఐ పరిశీలించగా ప్రభుత్వం తమకు భూమిని కేటాయించిందని నిర్మాణదారు అంజిరెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీరయ్య పేరిట 200 గజాలను ప్రభుత్వం 2007లో మంజూరు చేసినట్లు పట్టాదారు కాగితాలు చూపించారు. వీరయ్య వారసుడిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ అనుమతితో షెడ్డు నిర్మించుకుంటున్నట్లు అంజిరెడ్డి తెలిపారు. పట్టాదారు కాగితాలను పరిశీలించి వీరయ్యకు కేటాయించిన స్థలంలోనే షెడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్‌ఐ రజనీకాంత్ తెలిపారు. అయితే గతంలో ఈ స్థలంలో కొందరు వ్యక్తులు షెడ్డు నిర్మాణం చేపట్టగా అప్పటి తహసీల్దార్ సుధాకర్ కూల్చివేయించగా ప్రస్తుతం రెవెన్యూ అధికారులు షెడ్డు నిర్మాణానికి సహకరించడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలను నగరంలోని జ్యోతిబా పూలే మైదానంలో ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేస్తామని మంత్రి, ఎంపీ, కలెక్టర్లు హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసి గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, బీసీ నాయకులు బోయిని ప్రశాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ



బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గజ్జల దినేశ్‌కుమార్ 24 సెప్టెంబర్ 2022న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. పార్టీ సభ్యత్వం తరఫున మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అతడి కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు కొండంత భరోసా అన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రూ.2లక్షల బీమా అందిస్తున్న ఏకైక పార్టీ దేశంలో బీఆర్‌ఎస్ ఒక్కటే అని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతికి ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కరీంనగర్: నగరంలో బుధవారం నిర్వహించే మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల ఏర్పాట్లను మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో పూర్తి చేసినట్లు కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతూ జయంతి వేడుకలకు వచ్చే ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మజ్జిగ ప్యాకెట్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా నలుమూలల నుంచి దళితులు, దళిత యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్, ఏఈ చైతన్య, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పరశురాం, దళిత నాయకులు సముద్రాల అజయ్, మీసాల సాయిలు, గసికంటి కుమార్, భీమారపు సతీశ్, బొగ్గుల మల్లేశం, చిగురు శోభ, జల్లి కోటేశ్వర్, నీరుకుల్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జికి ‘అలైహి’ పేరు పెట్టాలి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జికి షేర్‌అలీ బాబా రహ్మతుల్లాహ్ అలైహి పేరు పెట్టాలని కోరుతూ ఎంఐఎం నాయకులు మంగళవారం మేయర్ సునీల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అధికారిక, సూచికల బోర్డులపై ఉర్దూలో పేర్లు ఉండేలా చూడాలని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్‌అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, కార్పొరేటర్ షర్ఫొద్దిన్, నాయకులు అతిన, అలీబాబా, అజర్ దబీర్, నిసార్ అహ్మద్, అసగర్ హుస్సేన్, షాకీర్, షీరాజ్, ఫయాజ్, అబ్దుల్ రహమాన్, ఫయాజ్, అన్వర్ ఉన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

రామడుగు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం స్వశక్తి సంఘాల మహిళలకు ఐసీడీఎస్ ఆధర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధారాణి, జయప్రద, ఐకేపీ ఏపీఎం ప్రభాకర్, ఆయూష్ వైద్యాధికారి రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మోడ్రన్ దోబీఘాట్స్‌తో కష్టాలు దూరం

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేస్తున్న మోడ్రన్ దోబీఘాట్స్‌తో రజకుల కష్టాలు, ఇబ్బందులు తీరుతాయని మేయర్ సునీల్‌రావు అన్నారు. మంగళవారం 34వ డివిజన్ గోదాంగడ్డ వద్ద రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మోడ్రన్ దోబీఘాట్ పనులను కమిషనర్ సేవా ఇస్లావత్, నగరపాలక సంస్థ, స్మార్ట్‌సిటీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో మరింతవేగం పెంచి మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన 142 దోబీఘాట్‌లలో కరీంనగర్ నగరపాలక సంస్థకు అనుమతులు వచ్చాయన్నారు. త్వరలోనే మరో చోట దోబీఘాట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మేయర్ వెంట అదనపు కమిషనర్ స్వరూపరాణి, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ కిష్టప్ప, డీఈ మసూద్ అలీ, టీఆర్‌ఎస్ నాయకులు ఉయ్యాల శ్రీనివాస్, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులు పరిశీలన

10వ డివిజన్ తిరుమలనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రధాన స్టాంవాటర్ డ్రెయినేజీతో పాటు గణేశ్‌నగర్ బైపాస్ స్మార్ట్‌సిటీ రోడ్డు, పెద్ద డ్రెయినేజీ నిర్మాణ పనులను మేయర్ సునీల్‌రావు మంగళవారం పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కమిషనర్ సేవా ఇస్లావత్ కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

34వ డివిజన్ గోదాంగడ్డ దోబీఘాట్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని మేయర్ సునీల్‌రావు మంగళవారం ప్రారంభించారు. ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ షభీరా అంజుమ్ బర్కత్ అలీ, నగరపాలక సంస్థ అధికారులు, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘పారమిత’లో ఆకట్టుకున్న ‘ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్’ ఎగ్జిబిషన్



ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న ప్రసాదరావు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ (సీబీఎస్‌ఇ) పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ‘ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్’ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నిర్మాణాత్మక, వ్యవస్థీకృత, వినూత్న (పీబీఎల్) పద్ధతిలో పారమిత విద్యార్థులు సృజనాత్మకంగా రూపొందించిన వివిధ ప్రాజెక్టులు ప్రతిభకు పట్టం కట్టాయి. ఆరేళ్లుగా ప్రాజెక్టు ఆధారిత అభ్యాసంలో భాగంగా అభ్యాసకులు తమ ఆసక్తికి సంబంధించిన ప్రతిభను బయటకు తీసేందుకు ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్ ఎగ్జిబిషన్ ఉపయోగకరమని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు అన్నారు. 250 మంది విద్యార్థులు 40 గ్రూపులుగా ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. పీబీఎల్ ప్రోగ్రాం హెడ్ లలిత్ మోహన్ సాహూ, డైరెక్టర్లు ప్రసూనా, అనుకర్‌రావు, రష్మిత, ప్రసాద్, వినోద్‌రావు, వీయుఎం ప్రసాద్, హన్మంత్‌రావు, ప్రధానోపాధ్యాయులు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ

గన్నేరువరం: జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలు మంగళవారం ముగిశాయని హెచ్‌ఎం సూర సుమలత తెలిపారు. బాలికలు 30 రోజుల పాటు తాము ఎలా రక్షించుకోవాలనే దానిపై కరాటే మాస్టర్ శిక్షణ ఇచ్చారని అన్నారు.ఈసందర్భంగా శ్రీనివాస్‌ను సన్మానించారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అక్కెనపల్లి కుమార్

చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గంలో వైఎస్సార్ టీపీ జెండా ఎగురవేస్తామని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అక్కెనపల్లి కుమార్ అన్నారు. మండలంలోని వెదురుగట్టలో ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి వైఎస్సార్‌టీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రొడ్డవేని తిరుపతి, మారం లింగయ్య, సాయిని చంద్రయ్య, కొర్రి రాజరత్నం, అయిలవేని మహేశ్, పెంచాల లక్ష్మయ్య, పొన్నం రవి, గర్వందుల సంతోశ్, కొమ్ము ఎల్లయ్య, ఆడెపు శంకరయ్య, పులి లచ్చయ్య, అయిలవేని శ్రీనివాస్, ఇరుగురాల భూమయ్య, కొయ్యడ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

30 నిమిషాల్లో రెండు చోరీలు

కరీంనగర్ క్రైం: నగరంలో ఓ దొంగ 30 నిమిషాల్లో రెండు దొంగతనాలు చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కమాన్ ప్రాంతంలో ఉన్న ఓ బాయ్స్ హాస్టల్‌లోకి చొరబడి రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లాడు. అక్కడి నుంచి 30 నిమిషాల వ్యవధిలో మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఓ లాడ్జిలో సెల్‌ఫోన్, నగదు చోరీ చేశాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని తెలిసింది. కానీ చివరికి మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

‘సెయింట్ జార్జ్’లో సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) స్కూల్‌లో మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండె నొప్పి, శ్వాస సంబంధించిన సమస్య ఏర్పడినప్పుడు ప్రథమ చికిత్సగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో బొమ్మ సాయంతో ప్రయోగాత్మకంగా వివరించారు. గుండెనొప్పి వచ్చినప్పుడు కూర్చోవడం, నిలబడటం, నిమిషానికి 110/120 సార్లు గుండెపైన ఒత్తిడి చేయడం వల్ల విశ్రాంతి కలుగుతుందని తెలిపారు. పారమిత, సెయింట్ జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.కేశవరెడ్డి, వి.రాధాకృష్ణారెడ్డి, రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్లు రమణ, యశ్వంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పది’ పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

కరీంనగర్: వికారాబాద్ జిల్లా తాండూర్‌లో పదో తరగతి వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులకు జీవితంలో ఉన్నత చదువులకు తొలిమెట్టు అయిన పదోతరగతి వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీ కావడం అంటే పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. పదోతరగతి పరీక్షలను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వరుస పేపర్ లీకేజీలతో పరీక్షలపై విద్యార్థులు నమ్మకం కోల్పోతున్నారని తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తాగునీటి కోసం నిరసన



శంకరపట్నం: ఎరడపల్లిలో మంగళవారం తాగునీటి కోసం ఖాళీ బిందెలు, బకెట్లతో కాలనీవాసులు నిరసన తెలిపారు. గ్రామంలోని ఒకటో వార్డులో సీసీ రోడ్డు నిర్మిస్తుండటంతో రెండు నెలలుగా తాగునీరు రావడం లేదని ఆరోపించారు. వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యకం చేశారు. నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పన్నుల వసూళ్ల లక్ష్యం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీడీఎంఏ సయ్యద్ మసూద్

జమ్మికుంట: బకాయి పన్నుల వసూళ్ల లక్ష్యం పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీఎంఏ సయ్యద్ మసూద్ అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... లక్ష్యం రూ.337.67లక్షలు కాగా ఇప్పటివరకు రూ.277.61 లక్షలు మాత్రమే వసూల్ చేశారని, వందశాతం పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. 31 మార్చితో గడువు ముగిసినప్పటికీ నాలుగు రోజుల సమయం అదనంగా ఇచ్చామని, కనీసం 90 శాతం పూర్తి చేయలేదని అధికారులు, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. రీజనల్ పరిధిలోని పలు మున్సిపాలిటీలు లక్ష్యాన్ని చేరుకున్నాయని, జమ్మికుంటలో వెనుకపడిందని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ భూపాల్‌రెడ్డి, జేఏవో విమల, ఆర్‌ఐ వాణి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భగత్‌నగర్‌లోని ఎన్‌జీవోస్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల పనులు చేపడుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ వావిలాలపల్లి, వెంకటేశ్వర ఫీడర్ల పరిధిలోని వావిలాలపల్లి, శివ థియేటర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ పేర్కొన్నారు.

రూరల్ పరిధిలో..

33కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగునూర్, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్‌రూరల్ ఏడీఈ కె.రాజు తెలిపారు.



గరుడవాహనంపై కోదండరాముడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజు మంగళవారం కోదండరాముడు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీరామచంద్రుడిని చూసి భక్తు లు జయజయ ధ్వానాలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామచంద్రుడు బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శివధనుర్భంగాలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పున్నమి వెన్నెలలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరగనుంది.

కలసి నడుద్దాం.. ఘన విజయం సాధిద్దాం

- ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం జగన్



సాక్షి, అమరావతి: ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉందని, సమన్వయంతో అంతా కలసి పనిచేయడం ద్వారా ఘనవి జయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశమైన సీఎం జగన్ పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశం చేశారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్ది అందర్నీ ఒక్క తాటిపైకి తేవాలని సూచించారు. పార్టీ సమన్వయకర్తలుగా తనతో ఏ విషయాన్నైనా చర్చించవచ్చని, ఎప్పుడైనా కలవవచ్చన్నారు. 'పార్టీ పరంగా మీరు నా టాప్ టీమ్' అని పేర్కొన్నారు. 'మీరు, నేను, పార్టీ యంత్రాంగం అంతా కలిసి ముందుకుసాగితే ఎన్నికల్లో విజయభేరి మోగించడం తథ్యం' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

రాజధానిలో పేదలు ఉండొద్దంటే ఎలా?


రాజధాని పిటిషనర్లను ప్రశ్నించిన ఏపీ హైకోర్టు ధర్మాసనం

- ఇళ్ల స్థలాల కేటాయింపు అభివృద్ధిలో భాగమే
- ఫలానా వారికి ఇళ్ల స్థలాలివ్వొద్దని చెప్పజాలరు
- ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవే..
- జీవో 45పై ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం
- ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారు

సాక్షి, అమరావతి: ''రాజధానిలో పేదలు ఉండకూడదంటే ఎలా?''అని ఏపీ హైకోర్టు ధర్మాసనం అమరావతి రైతులను ప్రశ్నించింది. రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం అభివృద్ధిలో భాగమని వ్యాఖ్యానించింది. ఫలానా వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పజాలరని స్పష్టం చేసింది. రాజధాని భూములు ప్రస్తుతం సీఆర్‌డీఏవేనని, అంతేకానీ భూములిచ్చిన వారివి కాదని పేర్కొంది. రాజధాని వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున అందుకు సంబంధించిన వ్యవహారంలో తాము జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తెలిపింది. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా రాజధాని ప్రాంతంలో 1,134 ఎకరాలను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45 విషయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తెలిపింది. ప్రస్తుత దశలో స్టే విధించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే ప్రభుత్వం చెప్పిందని, అందువల్ల కేటాయింపులను ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలు అపరిపక్వమైనవని స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజధాని విషయంలో కొన్ని అంశాలను హైకోర్టులో, కొన్నింటిని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తున్నారని ప్రస్తావిస్తూ జీవో 45పై కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించలేమని, జీవో 45పై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పురపాలక శాఖ, సీఆర్‌డీఏలను న్యాయస్థానం ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేస్తూ విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

■ పేదలకు ఇళ్ల స్థలాలపై పిటిషన్లు..

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల



నిమిత్తం 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేసేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రి నాయుడు, ఉన్నం మురళీధరరావు, దేవ్‌దత్ కామత్, వీఎస్ఆర్ ఆంజనేయులు తదితరులు వాదించారు. ఇళ్ల స్థలాల నిమిత్తం గతంలో జారీ చేసిన జీవోను హైకోర్టు నిలుపుదల చేసిందని మురళీధరరావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తరువాత సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేసి ఆర్ 5 జోన్ తెచ్చారన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉండేలా ఆదేశాలు ఇస్తామని పేర్కొనగా దీన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. రాజధాని భూములను అన్యాక్రాంతం చేయడం, బదలాయించడం, థర్డ్ పార్టీ హక్కులు సృష్టించడం చేయరాదని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా 3 అంశాలపైనే స్టే విధించిందన్నారు. మిగిలిన అంశాల విషయంలో హైకోర్టు తీర్పు అమల్లోనే ఉందని నివేదించారు.

■ పరిస్థితిని జటిలం చేయలేం..

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజధాని ప్రజలందరిదని, అది ఏ వ్యక్తిదో, వర్గానిదో కాదని స్పష్టం చేసింది. రాజధానిపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యంలో జీవో 45 విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వమే సమస్యను జటిలం చేస్తోందంటూ పిటిషనర్ల న్యాయవాది దేవ్‌దత్ కామత్ సుప్రీంకోర్టు ఉత్తర్వులను చదివి వినిపించడంతో... సుప్రీంకోర్టు ఉత్తర్వులకు తమను భాష్యం చెప్పమని కోరుతున్నారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కావాలంటే సుప్రీంకోర్టుకే వెళ్లాలని స్పష్టం చేసింది. రాజధాని విషయంలో హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని పిటిషనర్ల న్యాయవాదులు పేర్కొనగా దానిపై ఇప్పటికే కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైందని ధర్మాసనం తెలిపింది.

■ జరగని కేటాయింపులపై వ్యాజ్యాలేమిటి?

ఈ వ్యాజ్యాలను ఇప్పటికిప్పుడు విచారించాల్సినంత అత్యవసరం ఏముందో చెప్పాలని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతిదీ అత్యవసరమంటూ పిటిషన్లు దాఖలు చేయడాన్ని తాము ఎంత మాత్రం హర్షించబోమని, తమను ఒత్తిడి చేయవద్దని తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపులు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని, ఈ దశగా ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పునరుద్ఘాటించింది. ముఖ్యమంత్రి ఓ సమావేశం నిర్వహించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారని, అందువల్లే జీవోపై స్టే కోరుతున్నామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు నివేదించారు. 'ప్రభుత్వం పని చేయాల్సిందే కదా. నిర్ణయాలు తీసుకోకుండా ఎలా నిరోధించగలం? అసలు ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవి. ప్రభుత్వం భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే చెప్పింది. కేటాయింపులు ఇంకా జరగలేదు. జరగని కేటాయింపులపై వ్యాజ్యాలు దాఖలు చేయడం ఏమిటి? ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయనివ్వండి. ఆ తరువాత ఏం చేయాలో చూద్దాం ...'అని ధర్మాసనం స్పష్టం చేసింది.

■ ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరు..

ఈ సమయంలో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు స్పందిస్తూ థర్డ్ పార్టీలకు భూములు కేటాయిస్తే విషయం జటిలం అవుతుందన్నారు. తదుపరి దాఖలు చేసే వ్యాజ్యాల్లో వారందరినీ ప్రతివాదులుగా చేయాల్సి ఉంటుందని, అది అచరణ సాధ్యం కాదన్నారు. పిటిషనర్లు రైతులని, ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల వారి హక్కులు ప్రభావితం అవుతాయన్నారు. దీనిపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ఇవి ప్రజా ప్రయోజన వ్యా జ్యాలు కావని, అందరి తరఫున వ్యాజ్యాలు వేసి జీవో మొత్తాన్ని నిలుపుదల చేయాలని కోరలేరని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల ఇతరులు కూడా లబ్ధి పొందుతున్నారని గుర్తు చేసింది. ప్రస్తుత దశలో జీవో 45 విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని తేల్చి చెప్పింది. అపరిపక్వమైన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదంది. ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరని వ్యాఖ్యానించింది. రైతులకు స్థలాలు ఇవ్వకుండా ఇతరులకు ఇళ్ల స్థలాలివ్వడం చట్ట విరుద్ధమని సీనియర్ న్యాయవాది ఆంజనేయులు వాదించారు.

ఇన్‌సైడర్స్.. అవుట్ సైడర్స్ ఏమిటి?

సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ మే మొదటి వారంలో ఇళ్ల స్థలాలివ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. అవుట్‌సైడర్స్‌కు (రాజధానేతరులు) ఇళ్ల స్థలాలిస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయతిస్తోందని పేర్కొనడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. రాజధాని ప్రజలందరిదీ, కేవలం పూలింగ్ కింద భూములిచ్చిన వారిది మాత్రమే కాదని పేర్కొంది. అవుట్ సైడర్స్, ఇన్‌సైడర్స్ అంటూ మాట్లాడొద్దని సూచించింది. రాజధాని భూములను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇళ్ల స్థలాల కేటాయింపు ద్వారా అదే జరుగుతోందని తెలిపింది.

విచారణపై స్టే ఇవ్వలేం

మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి విషయంలో ఏపీ సీఐడీ విచారణపై స్టే ఇవ్వలేమని, దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. అయితే, తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు 30 మంది మేనేజర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరుస్తూ తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నిధులను చట్ట విరుద్ధంగా అక్రమ మార్గాలకు మళ్లిస్తున్నారని పేర్కొంటూ ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ కేసుల్లో తమపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ మార్గదర్శి చైర్మన్ రామోజీరావు (ఏ1), ఎండీ శైలజ (ఏ2) ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు.. దర్యాప్తులో భాగంగా విచారణకు రావాలని 30 మంది మార్గదర్శి మేనేజర్లకు సీఐడీ తాజాగా నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రామోజీరావు, శైలజ మంగళవారం ఇంటర్లొక్యుటరీ అప్లికేషన్‌ను లంచ్ మోషన్‌గా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగులకు జారీచేసిన నోటీసులను కొట్టేయాలన్నారు. మార్గదర్శి కేసు దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీచేసి.. స్వతంత్ర ఏజెన్సీకి అప్పగించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు.

పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు..

ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. 'గత విచారణ సందర్భంగా హైకోర్టు కేవలం రామోజీ, శైలజకు మాత్ర మే ఉపశమనం కలిగించింది. ఇతరులకు ఈ ఇది వర్తించదు. దర్యాప్తు ప్రారంభమైన నాటి నుంచి పిటి షనర్లు పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు. ఏపీ ప్రభుత్వానికి సమయం ఇవ్వకుండానే పిటిషనర్లకు అనుకూలంగా ఆదేశాలు జారీ అవుతున్నాయి. ఈ కేసులో ఏపీ అడ్వొకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపిస్తారు. ఏపీ వాదన విన్న తర్వాతే మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలి. అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఏపీ సీఐడీ నుంచి నోటీసులు అందుకున్న ఉద్యోగులు ఎవరో, ఎప్పుడు నోటీసులు అందుకున్నారో.. లాంటి వివరాలు ఏమీలేకుండానే పిటిషన్ వేశారు. వివరా లు తెలీకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. మార్గదర్శి నిధులను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్స్‌లోకి మళ్లించడం ద్వారా భారీ కుంభకోణానికి పాల్పడింది. కౌంటర్ దాఖలు చేసే వరకైనా మాకు సమయం ఇవ్వాలి' అని గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు.

దర్యాప్తును అడ్డుకోవడం లేదుకదా..

'మీకు (ఏపీ సర్కార్) అభ్యంతరం ఉంటే రేపే వెకేట్ స్టే పిటిషన్ వేయండి. హౌస్‌మోషన్ మూవ్ చేయండి.. మా ఆదేశాల సవరణకు పిటిషన్ వేయండి.. విచారణ చేపట్టడానికి మాకెలాంటి అభ్యంతరంలేదు. మేం దర్యాప్తును అడ్డుకోవడంలేదు కదా. మా ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తంచేయడం సరికాదు'.. అని న్యాయమూర్తి పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేశారు.

రామోజీ అతీతుడా!?

▶ మొదటి పేజీ తరువాయి

కంపెనీకి చెందిన ఓ సీఏను అరెస్టు చేస్తే అందుకు నేను బాధ్యుడినా? అది అందరు సీఏలపై దాడి ఎలా అవుతుంది? అరెస్టులకు సంబంధించి విజయవాడలో సీఏలు సమావేశం పెట్టి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటంలేదని దూషించడం తగదు'.. అని ఉండవల్లి అన్నారు. సీఏలు ప్రభుత్వానికి ప్రతినిధుల్లాంటి వారని, వాళ్లు తప్పు చేస్తే శిక్షలు ఉంటాయని గుర్తుచేశారు. సత్యం రామలింగరాజు కేసులో సీఏలను అరెస్టుచేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ, అప్పట్లో సీఏలు ఇలా మీటింగ్ పెట్టి విమర్శించిన దాఖలాల్లేవన్నారు. సీఏలు మీటింగ్ పెట్టి ఆహ్వానిస్తే వెళ్లి రామోజీ తప్పుచేశారన్న తన వాదన నిజామా? కాదో వివరిస్తానన్నారు.

నా కేసు తప్పని జస్టిస్ రమణతో చెప్పించండి

ఇక మార్గదర్శిపై తాను వేసిన కేసు తప్పని సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ రమణతో చెప్పిస్తే చాలని ఉండవల్లి అన్నారు. రామోజీరావు చేసింది తప్పా కాదా? అని మాత్రమే సమాధానమివ్వాలన్నారు. తప్పని తేలితే రూపాయి ఫైన్ వేసినా సంతోషమేనని, మిగిలిన చిట్‌ఫండ్‌లకు భయం ఉంటుందన్నారు. సెక్షన్ 477–ఏ ప్రకారం అకౌంట్స్ తారుమారు చేస్తే శిక్ష తప్పదని.. రామోజీరావుకు డిపాజిటర్ల పేర్లు విడుదల చేయాలని ఉండవల్లి డిమాండ్ చేశారు. అవినీతిని ప్రశ్నిస్తే రామోజీరావు పత్రికా స్వేచ్ఛపై దాడిగా చెప్పుకుంటారని.. అలాంటప్పుడు చట్టసభల్లో పత్రికాధిపతికి చట్టాలు వర్తించవని చట్టం తీసుకురావాలని ఉండవల్లి సలహా ఇచ్చారు.

జగన్‌ను విమర్శిస్తే విశ్వాస ఘాతుకుడినే..

తనకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ రెండు పార్టీలు సమానమేనని ఆయనన్నారు. రాష్ట్ర విభజన అంశంపై కోర్టులో కేసు వేయమని టీడీపీ ప్రభుత్వ హయాంలో అడిగితే పట్టించుకోలేదని.. అదే విషయమై ఇప్పుడు కోరితే తనను సపోర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన కేసులో ఇంప్లీడ్ అవుతూ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. ఎవరూ చేయలేని పని జగన్ చేశారని.. అలాంటప్పుడు కేసు తేలేవరకైనా కృతజ్ఞత లేకుండా ముఖ్యమంత్రి జగన్‌ను ఎందుకు విమర్శించాలని ఆయన ప్రశ్నించారు. అలా చేస్తే తాను విశ్వాస ఘాతకుడినవుతానన్నారు.

లారీల్లేక లోడింగ్ ఆలస్యం

- యార్డులోనే రెండు రోజులుగా పడిగాపులు
- శనగ రైతులకు తప్పని తిప్పలు



యార్డులో లారీలు లేకపోవడంతో శనగ బస్తాలపై కప్పిన టార్పాలిన్

బేల: ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో శనగ కొనుగోళ్లలో భాగంగా కాంటా తర్వాత లారీల్లేక లోడింగ్ ఆలస్యమవుతోంది. దీంతో రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని బాధిత రైతులు పేర్కొంటున్నారు. సాంగిడి, సైద్‌పూర్, సాంగ్వి(జి), తోయగూడ రెవెన్యూ గ్రామాల రైతులు సోమవారం తీసుకువచ్చిన శనగలకు కాంటా పూర్తయింది. లారీలు సకాలంలో రాకపోవడంతో రైతులు అక్కడే రాత్రి బస చేయక తప్పలేదు. మంగళవారం ఉదయం పలువురు రైతులు మార్క్‌ఫెడ్ అధికారులను ఫోన్ చేసి నిలదీశారు. చాలా సేపటికి స్పందించిన అధికారులు మధ్యాహ్నం తర్వాత ఏడు లారీలు పంపారు. పూర్తి లోడింగ్ బుధవారం ఉదయం వరకు కొనసాగనుంది. అప్పటి వరకు యార్డులోనే ఉండక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు లారీలు సమకూర్చి శనగలు తరలించాలని కోరుతున్నారు.

'కుంటాల' అభివృద్ధికి రూ. 3.81 కోట్లు మంజూరు



కుంటాల జలపాతం (ఫైల్)

నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతానికి ట్రైబల్ టూరిజం శాఖ ద్వారా రూ.3 కోట్ల 81లక్షల 60వేల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో జలపాతం వద్ద కాటేజ్, ట్రైబల్ హట్, ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ, విద్యుత్, బోర్‌వెల్, లాన్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, మిక్కీమౌస్ బౌన్సి, బంగీ జంప్, ఎకో ఫ్రెండ్లీ కాటేజెస్, పర్యాటకులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. వీటికి గాను నిర్వహించనున్న టెండర్ కోసం ఈనెల 10వ తేదీ వరకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ఈఈ భీంరావు తెలిపారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ



మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న వీసీ

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీ(ట్రిపుల్ ఐటీ) ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలను మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్సిటీకి ప్రభుత్వం తరఫున సహాయసహకారాలు అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారని వెంకటరమణ తెలిపారు.

ఆవుపై మమకారం.. స్మారకార్థం ఆలయం



గోమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం

ఆదిలాబాద్‌రూరల్: తమతో విడదీయరాని అనుబంధాన్ని ఏర్పాటు చేసుకున్న ఓ ఆవు మరణించి నాలుగేళ్లు గడిచినా ఆ జ్ఞాపకాలను ఆ గ్రామస్తులు మరచిపోలేదు. దాని స్మారకార్థం ఓ ఆలయాన్ని నిర్మించి మమకారాన్ని చాటుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి) గ్రామంలో గోమాత సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం గోమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ, తమ గ్రామంలోని హనుమాన్ ఆలయానికి సంబంధించిన నాలుగేళ్ల ఓ ఆవు నాలుగేళ్ల క్రితం మరణించిందన్నారు. ఆ ఆవును గ్రామంలోని ప్రతి ఒక్కరూ పూజించే వారని పేర్కొన్నారు. చనిపోయిన ఆవు స్మారకార్థం ఆలయం నిర్మాణం చేపట్టి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి సభ్యులు దేవేందర్, లంక రాకేష్, ఇప్ప రాకేష్, అశోక్, గంగన్న, రాజు, సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ శ్రీనివాస్, దత్తు, దేవిదాస్ పాల్గొన్నారు.

ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల తనిఖీ



వసతులపై ఆరా తీస్తున్న క్షమాదేశ్‌పాండే

బేల: ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే తనిఖీ చేశారు. వంటగది, సరుకుల నిల్వలు, నివాస గృహాలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, ఆరోగ్య పరిస్థితులపై హెచ్ఎం జ్యోతిరాం ఆరా తీశారు. విద్యార్థులకు వసతులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సర్పంచ్ ఇంద్రశేఖర్‌కు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని తెలిపారు.

జై శ్రీరామ్.. జై హనుమాన్



ఆలయ ఏఈవో శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ మకరంద్



కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయం

- ప్రారంభమైన హనుమాన్ చిన్నజయంతి
- తొలిరోజు 30వేల మంది దీక్షాస్వాములు, భక్తుల రాక

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుమారు 30వేల మంది దీక్షాస్వాములు తరలివచ్చారని ఆలయ అధికారులు తెలిపారు. వీరు దీక్ష విరమణ చేశాక స్వామివారిని దర్శించుకున్నారని పేర్కొన్నారు. సాధారణ భక్తులు, దీక్షాస్వాముల 'జై శ్రీరామ్.. జై హనుమాన్' నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అదనపు కలెక్టర్ మకరంద్ వసతుల కల్పనపై ఆరా తీశారు. కోనేటిలో స్వచ్ఛమైన నీరు నింపాలని, భక్తులకు సరిపడా తాగునీ రు అందజేయాలని, ప్రథమ చికిత్స కోసం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీభక్తుడు ప్రశాంత వాతావరణంలో మాల విరమణ చేసేలా చర్యలు తీసుకోవాలని అర్చకులకు సూచించారు. ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయంలోపల హనుమాన్ దీక్షస్వాములు



స్వాములు చెల్లించిన ఇరుముడులు



కల్యాణకట్టలో తలనీలాలు చెలిస్తున్న భక్తులు



మాల విరమణ చేస్తున్న అర్చకులు

16 నుంచి ఇంటింటికీ సీపీఐ యాత్ర

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి, పక్కన నాయకులు

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బండ రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు నల్లధనం వెనక్కి తీసుకువస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించి, అధికారంలోకి వచ్చాక విస్మరించారని పేర్కొన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టడమే ధ్యేయంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవడం కోసం సీపీఐ జాతీయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి దేశవ్యాప్తంగా దేశ్ కి బచావో బీజేపీకి హఠావో అనే నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహించనున్నామని అన్నారు. ఇందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లోని 85 మండలాల్లో యాత్ర ఈ నెల 16 నుంచి కొనసాగుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేశారని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, నిరుద్యోగ భృతి, భూ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం , జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

న్యూస్‌మేకర్
క్రిస్టినా కోచ్





నీల్ ఆమ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెట్టినప్పుడు 'మానవాళి ముందంజ' అని అభివర్ణించారు. కాని మానవాళి నిజమైన ముందంజ ఇకపై పడనుంది. వచ్చే సంవత్సరం చంద్రుణ్ణి చుట్టి రావడానికి వెళ్లనున్న నలుగురు వ్యోమగాముల్లో ఒక మహిళా వ్యోమగామిని ఎంపిక చేసింది నాసా. ఆ విధంగా చంద్రుని దాకా వెళ్లనున్న తొలి మహిళగా వ్యోమగామి క్రిస్టినా కోచ్ చరిత్ర సృష్టించనుంది.

చంద్రుడి దాకా తొలి మహిళ

50 ఏళ్ల క్రితం నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి మీద అడుగు మోపినప్పుడు సమస్త మానవాళి అబ్బురపడింది. పులకించింది. మానవ చరిత్రలో శాస్త్ర, సాంకేతిక రంగాలు సాధించిన అపూర్వ ఘటనగా లిఖించుకుంది. భూమ్మీద నుంచి నిత్యం కనపడే, వెన్నెల కురిపించే, వేల ఏళ్లుగా ఎన్నో కథలకూ గాథలకూ ఆలవాలమైన చంద్రుడిపై అడుగు పెట్టడం అంటే సామాన్యమా మరి. ఈ చంద్రుణ్ణి అందుకోవడానికి అమెరికా నాసా ద్వారా 1968 నుంచి 72 మధ్య 'అపోలో' ద్వారా 24 మంది వ్యోమగాములను పంపితే 12 మంది చంద్రుడిపై దిగగలిగారు. అయితే వారంతా పురుషులు. ఇప్పటివరకూ ఒక్క స్త్రీ కూడా చంద్రుడిని తాకలేదు. కాని త్వరలో తాకబోతోంది. 'ఆర్టిమిస్-2' పేరుతో నాసా వచ్చే సంవత్సరం నిర్వహించనున్న చంద్రుని ప్రదక్షిణకు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఒక మహిళ ఎంపికైంది. ఆమే క్రిస్టినా కోచ్. ఆ విధంగా చంద్రుడి వరకూ వెళ్లగలిగిన తొలి మహిళగా ఈమె చరిత్ర సృష్టించనుంది. చంద్రుడికి వీలైనంత దగ్గరగా వెళ్లి దాని చుట్టూ తిరిగి వచ్చే ఈ యాత్ర విజయవంతమైతే 2025లో జరిగే చంద్రయానంలో ఒక స్త్రీని పంపాలని నాసా నిర్ణయం. ఆ అసలు యాత్రకు కావలసిన ధైర్యం క్రిస్టినా ఇవ్వనుంది.



శిక్షణలో క్రిస్టినా కోచ్

■ ఆర్టిమిస్-2 అంటే?

ఆర్టిమిస్-2 ప్రయోగంలో వ్యోమగాములు చంద్రుడి మీద కాలు పెట్టరు. చంద్రుడికి దగ్గరగా ఉన్న కక్ష్యలోనూ తిరుగాడరు. చంద్రుడికి కొంత దూరం నుంచి ప్రయాణిస్తారు. దీన్నే ఫ్లై బై అని పిలుస్తారు. చంద్రునిపై రోబోలు, మనుషులతో పరిశోధనలు చేపట్టేందుకు నాసా చేపట్టిన కార్యక్రమమే ఆర్టిమిస్. గత ఏడాది ఆర్టిమిస్-1 పేరుతో వ్యోమగాములు లేకుండా ఒరాయెన్ అనే స్పేస్‌క్యాప్సూల్‌ను చంద్రుని చుట్టూ తిప్పారు. వచ్చే ఏడాది ఆర్టిమిస్-2 పేరుతో ఒరాయెన్ స్పేస్ క్యాప్సూల్‌లో నలుగురు వ్యోమగాములు ప్రయాణిస్తారు. ఈ నలుగురిలోనే క్రిస్టినా ఉంది. దాదాపు 10 రోజుల కాలంలో వీరంతా చంద్రుణ్ణి చుట్టి నేరుగా భూమిపైకి వస్తారు. ఒరాయెన్ క్యాప్సూల్‌లో వ్యోమగాముల కోసం చేసిన ఏర్పాట్లు, లైఫ్ సపోర్ట్ వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. ఇది విజయవంతమైతే 2025లో ఆర్టిమిస్-3 ద్వారా వ్యోమగాములు, రోబోలు చంద్రుడిపైకి చేరి ప్రయోగాలు, పరిశోధనలు చేపట్టే అవకాశం ఉంది. ఆర్టిమిస్-3లో పాల్గొనబోయే స్త్రీ వ్యోమగామి మళ్లీ క్రిస్టినాయే కావచ్చు.

■ ఎవరీ క్రిస్టినా కోచ్?

చంద్రుణ్ణి చుట్టి రావడానికి నలుగురు వ్యోమగాముల బృందంలో ఎంపికైన క్రిస్టినా కోచ్ ఆర్టిమిస్-2 యాత్రలో మిషన్ స్పెషలిస్ట్‌గా పని చేయనుంది. ఈమెతోపాటు మరో ముగ్గురు- జెరెమి హాన్సన్, విక్టర్ గ్లోవర్, రీడ్ వైజ్‌మెన్ ఈ యాత్రలో పాల్గొంటారు. వీరిలో విక్టర్ గ్లోవర్ చంద్రుడి దాకా వెళ్లనున్న తొలి నల్ల జాతీయుడిగా చరిత్ర నమోదు చేయనున్నాడు. నార్త్ కరోలినాలో పుట్టి పెరిగిన క్రిస్టినా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసింది. 2013లో నాసాలో చేరి స్పేస్ సైన్స్ ఇన్‌స్ట్రుమెంట్‌ల తయారీలో నైపుణ్యం సంపాదించింది. అంతే కాదు అంతరిక్షంలో ఒక్కరుగా గడిపే సమయంలో ఏర్పడే వొత్తిడి, రేడియేషన్ ప్రభావం, మొక్కల పెంపకం లాంటి అంశాల మీద పరిశోధనలు చేసింది. అందుకే 2019 మార్చి 14 నుంచి 2020 ఫిబ్రవరి 6 వరకూ ఐ.ఎస్.ఎస్ (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్)లో గడిపి సుదీర్ఘకాలం అంటే 328 రోజులు అంతరిక్షంలో గడిపిన తొలి మహిళగా రికార్డు స్థాపించింది. ఇంకా విశేషం ఏమిటంటే 2019 అక్టోబర్ 18న మరో మహిళా వ్యోమగామి జెస్సికా మెయర్‌తో కలిసి ఐ.ఎస్.ఎస్ నుంచి బయటకు వచ్చి దాని వెలుపల ఉండే ఒక భాగాన్ని రీప్లేస్ చేసింది. ఫలితంగా ఆల్ విమెన్ స్పేస్‌వాక్ చేసిన రికార్డు వీరిరువురూ నమోదు చేశారు.

■ సొంత నేలపై ప్రేమ

క్రిస్టినా కోచ్‌కు ఫొటోలు తీయడం ఇష్టం. తరచూ ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడుతుంది. కాని అంతరిక్షం నుంచి ఆమె తీసిన ఒక ఫోటో మాత్రం ఆమె మరువలేదు. అది తను పుట్టి పెరిగిన నార్త్ కరోలినా ప్రాంతం ఫొటో. అంతరిక్షం నుంచి నార్త్ కరోలినాను మొదటిసారి చూసినప్పుడు ఆమె ఉద్వేగంతో ఊగిపోయింది. ఈ గడ్డలోనే కదా నేను ఇంతదాన్నయ్యాను అనుకుందామె. ఇటువంటి అనుభూతే ఆమెకు చంద్రుణ్ణి సమీపించినప్పుడు కలగవచ్చు. ఎందుకంటే చంద్రుడికి అతి దగ్గరగా వెళ్లిన తొలి మహిళ కదా.

మన చేనేత మన ఘనత... మన చారిత్రక సంప్రదాయం.
మన అద్దకంలోని ముగ్ధత్వం... సప్తవర్ణ శోభితం.
లోహానికి జీవం పోసే నైపుణ్యం... సృష్టికి ప్రతి రూపం.
తెలుగు నేల పురుడుపోసిన కళలే... యాభైకి పైగా ఉన్నాయి.
ఈ విరచిత గ్రంథాలన్నీ అక్షరబద్ధత కావాలి... శాస్త్రబద్ధత పొందాలి.
కళ నిలవాలి... కళాకారులు మనగలగాలని దీక్షబూనారు రాజేశ్వరి.

చేనేత సప్తవర్ణశోభితం



రాజేశ్వరి మావూరి

'ఎల్లువొచ్చి గోదారమ్మ... ఎల్లాకిల్లా పడ్డాదమ్మా...' పాట గుర్తుందా? ఆ పాటలో ఇత్తడి బిందెలు గుర్తు వచ్చాయా? బోర్లించిన బిందెల మీద శ్రీదేవి సుతారంగా అడుగులు వేస్తూండగా పాట మొదలవుతుంది. ఇన్ని బిందెలు తయారైందెక్కడో అనే సందేహం అప్పుడు వచ్చినా రాక పోయినా ఇప్పుడు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అంతరించిపోతున్న కళను బతికించుకోవడానికి మనవంతు ప్రయత్నం చేయాల్సిన అవసరమూ ఉంది. ఈ బిందెలు తయారైన గ్రామం పేరు అజ్జరం, తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. ఆ ఊర్లో తయారు కాని ఇత్తడి పాత్ర ఉండదంటే అతిశయోక్తి కాదు. అలాగే శ్రీకాకుళం జిల్లా బుడితి గ్రామం కూడా. ఇత్తడి, కంచులో జీవం పోసుకునే రూపాలు కలకాలం నిలిచి ఉంటాయి. కానీ ఆ కళ కలకాలం నిలిచి ఉండే పరిస్థితులున్నాయా? సమాధానం చెప్పలేం. కళాకారులకు ఆదరణ తగ్గినప్పుడు కళ దానంతట అదే కనుమరుగయిపోతుంది. అలా కనుమరుగు కాకూడదనే సంకల్పంతో పని చేస్తోంది రాజేశ్వరి మావూరి. తెలుగు రాష్ట్రాల నలుమూలలా పర్యటించిందామె. యాభైకి పైగా ఉన్న చేనేతలు, హస్తకళారీతులను అధ్యయనం చేసింది. ఈ కళలు మనుగడ సాగించాలంటే వీటి ఔన్నత్యాన్ని విదేశీ వేదికల మీద ప్రదర్శించాలనుకుంది రాజేశ్వరి. ఇటీవల పారిస్‌లో మన చేనేతలను ప్రదర్శించిన రాజేశ్వరి తన హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ జర్నీని సాక్షితో పంచుకున్నారు.

వస్త్రలేఖనాలు

"నేను పుట్టి పెరిగింది చేనేతల్లోనే. దుస్తులంటే దేహాన్ని కప్పుకునే సాధనాలుగానే చూస్తాం. కానీ ఆ ప్రధాన అవసరం నుంచి అంత కుమించి అవి మన జీవితంలో చోటు చేసుకున్నాయి. దారం తయారీ నుంచి దారాలకు వస్త్రం రూపాన్నివ్వడానికి కళాకారులు జీవితాన్ని అంకితం చేస్తుంటారు. ఒక చిత్రలేఖనాన్ని కొనేటప్పుడు ఆ చిత్రకారులను ప్రధానంగా గుర్తిస్తాం. కానీ హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ విషయంలో వాటి వెనుక శ్రమ ఎవరిదనే ఆలోచన కూడా రాదు. పైగా హస్తకళాకృతుల తయారీదారులను కారిగార్స్ అంటున్నాం కానీ కళాకారులు అనడానికి కూడా నోరు రావడం లేదు. అది ఎవరి తప్పూ కాదు. కళాకారుడిని గుర్తించడం మనకు అలవాటు చేయలేదు. నేను ఆ వెలితిని పూరించాలనుకున్నాను. ఒక డ్రస్‌లో డిజైనర్ సృజనతోపాటు, చేనేతకారుని సృజనను కూడా తెలియచేస్తుంటాను. మనసు పెట్టి చూస్తే ప్రతి హ్యాండ్‌లూమ్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ వెనుక ఒక కథ ఉండి తీరుతుంది. ఆ కళకు ఉన్న చరిత్ర అది. శ్రీకాళహస్తి కలంకారీలో ప్రతిదీ ఒక చిత్రలేఖనమే. మచిలీపట్నం, పెడన కలంకారీ కూడా కేవలం అద్దకం మాత్రమే కాదు. ఒక పువ్వు రేకులో కొంత భాగంలో చిక్కదనం, మరికొంత భాగంలో తేలికదనం వ్యక్తం అవుతుంటుంది. ఆ నైపుణ్యాన్ని కొలిచే కొలమానం లేదు. అంతేకాదు, శాస్త్రబద్ధం చేయడానికి సరైన డాక్యుమెంటేషన్ కూడా ఉండడం లేదు. చేనేత విషయానికి వస్తే... పారిస్ ఎగ్జిబిషన్‌లో నా స్టాల్‌లో మల్‌మల్ (మజ్లిన్)ను చూసి ఒక వస్త్ర ప్రేమికురాలు చాలా ఉద్వేగానికి లోనవుతూ... 'ఒక్కసారి తాకవచ్చా' అని అడిగింది. తాకి చూస్తూ ఏడ్చేసింది. మల్‌మల్ నేత గొప్పదనం గురించి అప్పటికే పుస్తకాల్లో చదివిందట, ఎప్పటికైనా చూడాలనే కోరిక ఉండేదట. టూ హండ్రెడ్ కౌంట్‌లో ఉండే మృదుత్వాన్ని స్వయంగా ఆస్వాదించాల్సిందే తప్ప మాటల్లో వర్ణించలేం. నా దగ్గర మల్‌మల్ ఇరవై మీటర్ల క్లాత్ ఉంది, నా పర్సులో ఇమిడిపోతుంది. గత వారం మల్‌మల్ డ్రెస్‌లు యూరప్‌కి అరవై పీస్‌లు పంపించాను, వాటి అన్నింటి బరువు నాలుగు కిలోల లోపే. బెంగాల్‌లో విస్తరించిన కళాత్మక చేనేతకారులు ఇప్పుడు రెండు వందలకంటే లేరు. ఆ కుటుంబాల నుంచి మరో తరం వచ్చేలా ప్రోత్సాహమివ్వడం లేదా ఆసక్తి ఉన్న కొత్తతరం శ్రద్ధ చూపించే వాతావరణం కల్పించాలి. ఐదు వందల కౌంట్ నేసే కళాకారుల్లో ఒక్క పెద్దాయన మాత్రమే మిగిలారు. ఇవన్నీ మనదేశ గౌరవాలు. విదేశాల్లో సగౌరవంగా ప్రదర్శించగలిగిన విశేషాలు. ఇక సాహిత్యం విషయానికి వస్తే నేను రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లోని పాత్రలతో ఉత్తేజం పొంది ఉండడంతో ఈ బెంగాలీ చేనేతకు ఫ్యాషన్ రూపం తీసుకురావడంలో ఆ పాత్రలనే దృష్టిలో పెట్టుకుంటాను. బినోదిని, లోలీత, మృణ్మయి, చారులత, కాదంబని వంటి పాత్రలు ఈ రోజుల్లో అయితే ఎలాంటి డిజైన్‌లను ఇష్టపడతారనే కోణంలో డిజైన్ చేస్తాను. నా బ్రాండ్ కూడా విదేశీయులు సరళంగా పలకగలిగేటట్లు, నా పేరు, ఇంటి పేరు, నాన్న, భర్త పేర్లు కలిసి వచ్చేటట్లు 'లేబుల్ రామా' అని పెట్టాను.



కలంకారీ నైపుణ్యాన్ని చూపిస్తూ...



పారిస్ ఎగ్జిబిషన్‌లో విదేశీయులకు మన వస్త్రకళను వివరిస్తూ...

మన కళ విదేశీ పుస్తకాల్లో

మన హస్తకళల సమాచారం మనదేశంలో కంటే విదేశీ పుస్తకాల్లో బాగా దొరుకుతోంది. చైనాతోపాటు అనేక దేశాల పర్యాటకులు ఇక్కడి కళాత్మకతను గ్రంథస్థం చేశారు. ఇంగ్లిష్ రచయిత్రి జేన్ ఆస్టిన్‌కి ఈ క్లాత్ చాలా ఇష్టం. మల్ మల్ ఫ్యాబ్రిక్ కోసం డబ్బు కూడబెట్టుకుని మరీ కొనేదాన్నని ఆమె చెప్పుకున్నది. అంతటి ప్రాశస్త్యం కలిగిన కళ మనవాళ్ల చేతిలో ఉంది. కానీ ఈ కళ ఇంకా ప్రాచుర్యంలోకి రావాలి. మన కళాకారుల మనుగడకు తగిన మార్కెట్‌ను విదేశాల్లో విస్తరించగలిగితే కచ్చితంగా మన కళాత్మకత కలకాలం నిలుస్తుంది. కళాత్మకతతో మనదేశంతోపాటు భారతీయులుగా మనకు కూడా ప్రత్యేకమైన గౌరవం దక్కుతుంది. అలాగే హస్తకళాకారులు తాము రూపుదిద్దిన కళాఖండానికి తమ పేరు పెట్టుకోగలిగిన రోజు రావాలి. అజ్జరం, బుడితి, పెడన, గద్వాల్, చేర్యాల, ఆదిలాబాద్‌లోని ఆదివాసీ కళాకారులను స్వయంగా కలిశాను. వాళ్లు ఇత్తడితో చేసే ధోకా బొమ్మలు హరప్పా, మొహెంజోదారోల మూలాలను కొనసాగిస్తున్నాయి. నా అధ్యయనంలో మధ్య అమెరికా, ఈజిప్టు, చైనాలతోపాటు మనదేశంలో వెస్ట్ బెంగాల్, ఒడిషా, చత్తీస్‌ఘడ్, తెలంగాణల్లో ఈ లాస్ట్ వాక్స్ టెక్నిక్‌తో బొమ్మలు చేసేవాళ్లు. మట్టి తర్వాత మనిషి లోహంతో బొమ్మలు చేయడం నేర్చుకున్న నాటి విధానం అది. కొత్త ఒరవడిలో పడిపోయి ప్రాచీన శాస్త్రీయతను కోల్పోతున్నామనేది నా ఆవేదన. నేను పుస్తకాలు చదివి తెలుసుకున్న విషయాలు, స్వయంగా ఫీల్డ్ స్టడీలో గమనించిన వివరాలను కలుపుతూ కొన్ని వ్యాసాలు రాశాను. మిగతా అన్ని వివరాలనూ పూస గుచ్చినట్లు గ్రంథస్థం చేస్తాను" అని హస్తకళాకృతులు, కళాకారుల పట్ల తన మక్కువను తెలియచేశారు రాజేశ్వరి మావూరి.

– వాకా మంజులారెడ్డి

ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

అవ్వ మెడల్స్ తెచ్చింది



భగవాని దేవి



సాక్షి ఫ్యామిలీ

వయసు 95.. పరుగుకు రెడీ

ఒకటి కాదు రెండు కాదు... పరుగుల అవ్వగా పేరు గడించిన 95 ఏళ్ల భగవాని దేవి డాగర్ మూడు పతకాలు సాధించి మరోసారి మన దేశానికి కీర్తి తెచ్చింది. ఫిన్లాండ్‌లో జరిగిన 'వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్'కు భగవాని దేవి వెళ్లనుందని 'సాక్షి ఫ్యామిలీ'లో కథనం అందించాం. ఆమె అక్కడ పాల్గొని మూడు పతకాలతో దేశానికి తిరిగి వచ్చింది. 90–94 ఏళ్ల వయసు కేటగిరిలో 100 మీటర్ల పరుగును అందరి కంటే ముందు పూర్తి చేసి గోల్డ్ సాధించింది. షాట్‌పుట్, డిస్కస్ త్రోలో కూడా చెరి ఒక గోల్డ్ మెడల్ గెలిచింది. మూడు బంగారు పతకాలతో తిరిగి వచ్చిన భగవాని దేవికి గురువారం ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. ఏ వయసులోనైనా గొప్ప పనులు చేసి చూపించవచ్చని ఆమె మెడలోని పసిడి వర్ణాలు ఎలుగెత్తి చాటుతున్నాయి.

బ్యూటిప్స్

సమ్మర్ కూల్ ప్యాక్స్

మండిపోయే ఎండల నుంచి సున్నితమైన ముఖ చర్మాన్ని కాపాడుకోవడానికి సమ్మర్ కూల్ ప్యాక్స్ ఎంతో మేలు చేస్తాయి. ఇంట్లో దొరికే సహజసిద్ధమైన పదార్థాలతో సులభంగా తయారు చేసుకోగల కూల్ ఫేస్ ప్యాక్స్ మీకోసం...

- గుప్పెడు పుదీనా ఆకులు తీసుకుని, చిటికెడు పసుపు వేసి మెత్తగా పేస్టులాగా రుబ్బుకోవాలి. ఈ పేస్టును ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి.
- కీరదోసకాయ ఒకటి తీసుకుని చెక్కుతీసి సన్నగా తురుముకోవాలి, ఈ తురుములో అప్పుడే తీసిన అలోవెర జెల్‌ను వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తరువాత నీటితో కడుక్కోవాలి.
- స్పూను తేనె, స్పూను నిమ్మరసం తీసుకుని రెండింటి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఆరిన తరువాత కడగాలి.
- శనగపిండి, పెరుగును సమపాళ్లలో తీసుకుని పేస్టులా కలుపుకోవాలి. ఈపేస్టును ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి.
- ఒక గుడ్డును తీసుకుని దానిలో తెల్లసొనను మాత్రమే ఒక గిన్నెలో తీసుకోవాలి. ఈ సొనకు స్పూను తేనె కలిపి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి.
- పండిన అరటిపండును తీసుకుని దానిలో సగభాగాన్ని తొక్కతీసేసి గుజ్జులా చేసుకోవాలి. దీనిలో స్పూను తేనె వేసి బాగా కలిపి ముఖానికి రాసి గంట తరువాత కడగాలి.
- గంధం పొడిలో కొద్దిగా రోజ్ వాటర్ కలిపి పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. వారానికి ఒకసారి మాత్రమే ఈ ఫేస్‌ప్యాక్ వేసుకోవాలి.
- బాగా పండిన టమోటా గుజ్జును తీసుకుని దానిలో కొద్దిగా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి గంట తరువాత కడిగేయాలి.



సూపర్ చార్జ్ టూల్స్





విస్తృత సాంకేతిక ప్రపంచంలో యువతరం ప్రతి టూల్‌లోనూ ఒక విద్యాలయాన్ని చూస్తోంది. కొత్త విషయాలు నేర్చుకోవడానికి, తమను తాము మెరుగుపరుచుకోవడానికి ఏఐ పవర్డ్ టూల్స్‌ను ఉపయోగించుకుంటోంది. క్షణక్షణం యువతరం జపిస్తున్న సృజన మంత్రం ఏఐ సాంకేతికత. ఇటీవలి కాలంలో యూత్ మనసు దోచుకున్న, వారి క్రియేటివిటీకి సూపర్ ఛార్జర్‌గా ఉపయోగపడుతున్న కొన్ని ఏఐ టూల్స్....

'రిప్లై ఇవ్వడానికి బోర్‌గా ఫీలవుతున్నారా? ప్రైవసీ కావాలా? డెడ్ హెడ్‌సెట్ బ్యాటరీ భయపెడుతుందా? ఎయిర్ పాడ్స్ పోగొట్టుకున్నారా? వినికిడి సమస్య ఉందా?'... అని అడుగుతూ యూత్ దగ్గరకు వచ్చేసింది విష్పర్‌బాట్. ఇది ఏఐ వాట్సాప్ అసిస్టెంట్. జస్ట్... వాయిస్ ఫార్వర్డ్ చేస్తే చాలు... దాన్ని పదాల్లోకి మార్చేస్తుంది. 57 భాషలలో ఏ భాషలోనైనా మాట్లాడవచ్చు. వేగంగా మాటలను పదాలలోకి తీసుకురావడం దీని ప్రత్యేకత. 'విష్పర్ బాట్' కోసం అదనపు సాఫ్ట్‌వేర్, యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోనక్కర్లేదు.

ప్రైవసీ, డాటా సెక్యూర్ విషయంలో భయం అక్కర్లేదు. నిర్ణీత వ్యవధి తరువాత ఆడియో ఫైల్ (వాయిస్ మెసేజ్) డిలిట్ అవుతుంది. ఏఐ పవర్డ్ ట్రాన్స్‌స్క్రిప్షన్ టెక్నాలజీతో పనిచేసే 'విష్పర్‌బాట్' ప్రస్తుతం వాట్సాప్‌కే పరిమితం. భవిష్యత్‌లో ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు విస్తరించే అవకాశం ఉంది.

టెక్స్ట్స్‌ను సింపుల్‌గా రీరైట్ చేయడానికి, సంక్షిప్తంగా, సృజనాత్మకంగా మలచడానికి, గ్రామర్, స్పెలింగ్ మిస్టేక్స్‌ను చెక్ చేసుకోవడానికి, తప్పుల నుంచి నేర్చుకొని ఇంగ్లీష్‌ను మరింత ఇంప్రూవ్ చేసుకోవడానికి 'క్విల్‌బాట్' టూల్‌ను ఉపయోగించుకుంటున్నారు.

ఒక టాపిక్‌కు సంబంధించి ప్రెజెంటేషన్ ఇవ్వాలి. డెడ్ లైన్ దగ్గర పడగానే అయోమయం ఆవరిస్తుంది. టెన్షన్‌తో తప్పులు దొర్లుతుంటాయి. దీన్ని నివారించడానికి యువతరం చేతిలోని అస్త్రం స్లైడ్స్‌జీపీటీ. టైమ్ ఎంత మాత్రం వృథా కాకుండా త్వరగా ప్రెజెంటేషన్‌కు రూపకల్పన చేస్తుంది. 'వాట్స్‌ది టాపిక్ ఆఫ్ యువర్ ప్రెజెంటేషన్' అని అడుగుతుంది. జస్ట్... మనకు అవసరమైన టాపిక్‌ను ఎంటర్ చేస్తే చాలు, ఏదో మ్యాజిక్ చేసినట్లుగా మనకు కావాల్సిన ప్రెజెంటేషన్ అందుబాటులోకి వస్తుంది. స్వాతంత్ర్య పోరాటం నుంచి సైన్స్ విషయాల వరకు కాలేజి స్టూడెంట్స్‌కు ఈ టూల్ ఉపయోగపడుతుంది.

కోడింగ్ విషయంలో ఔత్సాహిక ప్రోగ్రామర్స్‌కు ఉపయోగపడుతున్న ఏఐ పవర్డ్ టూల్ కోడ్‌ట్యూటర్. లెంగ్తీ కోర్స్ మాడ్యూల్స్‌తో సైనప్ కానవసరం లేకుండా ఆసక్తికరంగా, తక్కువ టైమ్‌లో కోడింగ్ పాఠాలు నేర్చుకోవచ్చు. దీనిలో స్టూడెంట్స్ కోసం ఇంటరాక్టివ్-లెసన్స్, కోడింగ్-ఛాలెంజెస్ ఉంటాయి.

అంకుల్ ర్యాబిట్ నుంచి టెక్స్ట్-టు-ర్యాప్ వరకు ఎన్నో ఏఐ టూల్స్ యువతరానికి ఆత్మీయనేస్తాలు, సూపర్‌ఛార్జర్స్ అయ్యాయి.

చిత్రాభిమానులైన యువతరానికి విజువల్ ఆర్ట్‌కు సంబంధించి ఏఐ టూల్స్ ఉపయోగపడుతున్నాయి. కుంచె పట్టుకొని కసరత్తులు చేయాల్సిన అవసరం లేకుండా సింపుల్ సెంటెన్స్, ప్రాంప్ట్‌నెస్‌తో అందరూ మెచ్చే సుందరచిత్రాన్ని సృష్టిస్తున్నారు. దీనికి ఉదాహరణ డాల్-ఇ2. ఓపెన్ ఏఐ 'డాల్-ఇ'కి కొనసాగింపుగా వచ్చిన 'డాల్-ఇ2' కాన్సెప్ట్స్, స్టైల్స్, క్వాలిటీల కలబోత. ఇన్‌పుట్‌లో టైప్ చేస్తే చాలు ఔట్‌పుట్‌లో మనకు కావాల్సిన చిత్రం ప్రత్యక్షమవుతుంది.

ఏఐ టూల్స్ పుణ్యమా అని ఆర్ట్ గురించి అంతంత మాత్రమే తెలిసిన వారు కూడా పికాసో స్టైల్లో బొమ్మలు వేస్తున్నారు. పాప్ ఆర్ట్, ఇంప్రెషనిజమ్, స్ట్రీట్ ఆర్ట్.... ఒక్కటనేమిటీ రకరకాల ఆర్ట్‌ఫామ్‌లతో ఔరా అనిపిస్తున్నారు. ఈ జెనరేషన్‌లో ఏఐ ఆర్ట్ జెనరేటర్స్ సంఖ్య పెరుగుతోంది. ఎంత ఏఐ అయినా దానికంటూ కొన్ని పరిమితులు ఉంటాయి కదా! వాటిని అధిగమించడానికి 'డాల్-ఇ2' కమ్యూనిటీలోని యూజర్స్ ఒకరికొకరు సహాలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. 'ప్రాంప్టింగ్ క్రాఫ్ట్' మెరుగుపరుచుకోవడానికి రకరకాల మార్గాలు వెదుకుతున్నారు.

ఇక 'ర్యాప్‌జామ్' అనే టూల్ సాధారణ వాక్యాలను కూడా 'రైమ్స్'గా మారుస్తుంది.ఈ జీపీటీ-4 ఆధారిత టూల్ టెక్స్ట్ ప్రాంప్ట్‌ను ర్యాప్ సాంగ్‌గా మార్చి అలరిస్తుంది.

అంకుల్ ర్యాబిట్ నుంచి టెక్స్ట్-టు-ర్యాప్ వరకు ఎన్నో ఏఐ టూల్స్ యువతరానికి ఆత్మీయనేస్తాలు, సూపర్‌ఛార్జర్స్ అయ్యాయి.



ఐపీఎల్, డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అయ్యర్ దూరం

భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ టోర్నీ మొత్తానికి, జూన్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు దూరమయ్యాడు. అయ్యర్ వెన్ను గాయానికి శస్త్ర చికిత్స విదేశంలో జరగనుందని... అతను కోలుకోవడానికి కనీసం ఐదారు నెలలు పడుతుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీకి కూడా అయ్యర్ అందుబాటులో ఉంటాడో లేదో ఇప్పుడే చెప్పలేమని బీసీసీఐ వర్గాలు వివరించాయి.

రజత్ పటిదార్ కూడా అవుట్...

గత ఏడాది ఐపీఎల్ టోర్నీలో 333 పరుగులతో విశేషంగా రాణించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) బ్యాటర్ రజత్ పటిదార్ ఈ సీజన్‌లో మాత్రం బరిలోకి దిగడంలేదు. మధ్యప్రదేశ్‌కు చెందిన 29 ఏళ్ల పటిదార్ మడమ గాయంతో బాధపడుతున్నాడు. ఇప్పట్లో అతను గాయం నుంచి కోలుకునే అవకాశం లేకపోవడంతో ఐపీఎల్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడని ఆర్‌సీబీ వర్గాలు తెలిపాయి.





హంపి, హారిక పదో రౌండ్ గేమ్‌లు ‘డ్రా’

న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక ఖాతాలో మరో ‘డ్రా’ చేరింది. మంగళవారం నినో బత్సియాష్‌విలి (జార్జియా)తో జరిగిన పదో రౌండ్ గేమ్‌ను హంపి 44 ఎత్తుల్లో... కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌ను హారిక 30 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నారు. భారత్‌కే చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) వైశాలి నాలుగో ఓటమిని మూటగట్టుకుంది. జు జినెర్ (చైనా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 31 ఎత్తుల్లో ఓడిపోయింది. పదో రౌండ్ తర్వాత హంపి నాలుగు పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో, హారిక 3.5 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో ఉన్నారు. 5.5 పాయింట్లతో అలెక్సాండ్రా గొర్యాక్చినా (రష్యా), జు జినెర్, బిబిసారా (కజకిస్తాన్) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

ఐర్లాండ్ 214 ఆలౌట్


తైజుల్

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఐర్లాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 77.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్‌ను బంగ్లాదేశ్ ఎడం చేతి వాటం స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (5/53), మీడియం పేసర్ ఇబాదత్ హుస్సేన్ (2/54), స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ (2/43) దెబ్బ కొట్టారు. ఐర్లాండ్ జట్టులో హ్యారీ టెక్టర్ (50; 6 ఫోర్లు, 1 సిక్స్), లొర్కాన్ టకెర్ (37; 3 ఫోర్లు), క్యాంఫెర్ (34; 6 ఫోర్లు) రాణించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 10 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 34 పరుగులు సాధించింది.

టైటాన్స్ ఆడుతూ పాడుతూ...

గుజరాత్ టైటాన్స్... దాదాపు తొలి మ్యాచ్ తరహాలోనే... ఎలాంటి హంగామా, వ్యక్తిగతంగా మెరుపు ప్రదర్శనలు లేవు... విధ్వంసక ఆట లేదు... అంతా సమష్టి తత్వం, అటు బౌలర్లు, ఇటు బ్యాటర్లు తలా ఓ చేయి వేశారు... ముందుగా చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థి కట్టడి, ఆపై ప్రశాంతంగా లక్ష్య ఛేదన...డిఫెండింగ్ చాంపియన్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సత్తా చాటింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ సొంత మైదానంలో ఆడుతున్న ప్రయోజనాన్ని ఏమాత్రం ఉపయోగించుకోలేక చతికిలపడింది. ఫలితమే వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది.

- గుజరాత్‌కు వరుసగా రెండో విజయం
- గెలిపించిన రషీద్, సుదర్శన్
- 6 వికెట్ల తేడాతో ఓడిన ఢిల్లీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ కొత్త సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో విజయంతో తమ స్థాయిని ప్రదర్శించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (32 బంతుల్లో 37; 7 ఫోర్లు), అక్షర్ పటేల్ (22 బంతుల్లో 36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), సర్ఫరాజ్ ఖాన్ (34 బంతుల్లో 30; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు.


రషీద్, షమీ


సాయి సుదర్శన్

రషీద్ ఖాన్, షమీ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం గుజరాత్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 163 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సాయి సుదర్శన్ (48 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, మిల్లర్ (16 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 29 బంతుల్లోనే 56 పరుగులు జోడించారు.

సమష్టి వైఫల్యం...

తొలి మ్యాచ్‌తో పోలిస్తే ఈసారి కూడా ఢిల్లీ బ్యాటింగ్ ఏమాత్రం మెరుగుపడలేదు. పృథ్వీ షా, మిచెల్ మార్ష్ మళ్లీ విఫలం కాగా, వార్నర్ మరోసారి తన శైలికి భిన్నంగా దాదాపు అదే తరహాలో 115 స్ట్రయిక్‌రేట్‌తో ఆడాడు. టైటాన్స్ బౌలర్లు ఆరంభం నుంచి ప్రత్యర్థిని కట్టి పడేశారు. తన వరుస రెండు ఓవర్లలో పృథ్వీ షా (7), మార్ష్ (4)లను షమీ వెనక్కి పంపగా, వార్నర్ చేసిన పరుగులతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 52/2కు చేరింది. అనంతరం వరుస బంతుల్లో వార్నర్, రోసో (0)లను అవుట్ చేసి జోసెఫ్ ఢిల్లీని దెబ్బ కొట్టాడు. మరో ఎండ్‌లో సర్ఫరాజ్ నిలబడినా, అతనూ వేగంగా ఆడలేకపోయాడు. 13 పరుగుల వద్ద జోష్ లిటిల్ క్యాచ్ వదిలేసి మరో అవకాశం దక్కినా అతను దానిని ఉపయోగించుకోలేదు. అభిషేక్ పోరెల్ (11 బంతుల్లో 20; 2 సిక్స్‌లు) ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా అది ఎక్కువసేపు సాగలేదు. అయితే 101/5 వద్ద క్రీజ్‌లోకి వచ్చిన అక్షర్ కీలక పరుగులు సాధించాడు. చివర్లో అతను కొట్టిన మూడు సిక్సర్లతోనే ఢిల్లీ చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగింది.

కీలక భాగస్వామ్యం...

ఖలీల్ వేసిన తొలి ఓవర్లోనే 2 ఫోర్లు, సిక్స్ కొట్టి వృద్ధిమాన్ సాహా (14) జోరుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టగా, ముకేశ్ వేసిన తర్వాతి ఓవర్లో శుబ్‌మన్ గిల్ (14) రెండు ఫోర్లు కొట్టాడు. అయితే అద్భుత బంతులతో నోర్జే వీరిద్దరిని క్లీన్‌బౌల్డ్ చేశాడు. హార్దిక్ పాండ్యా (5) కూడా విఫలమయ్యాడు. ఇలాంటి దశలో సుదర్శన్, విజయ్ శంకర్ (23 బంతుల్లో 29; 3 ఫోర్లు) కీలక భాగస్వామ్యంతో టైటాన్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఎలాంటి సాహసాలకు పోకుండా వీరిద్దరు జాగ్రత్తగా ఆడుతూ లక్ష్యం దిశగా నడిపించారు. ఈ క్రమంలో కొన్ని చక్కటి షాట్లతో సుదర్శన్ ఆకట్టుకున్నాడు. నాలుగో వికెట్‌కు 44 బంతుల్లో 53 పరుగులు జోడించిన అనంతరం శంకర్‌ను అవుట్ చేసి ఈ జోడీని విడదీశాడు. అయితే వచ్చీ రాగానే మిల్లర్ తన దూకుడును ప్రదర్శించాడు. ముకేశ్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాది టైటాన్స్ పని సులువు చేశాడు. 44 బంతుల్లో సుదర్శన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, మరో 11 బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ విజయాన్నందుకుంది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (బి) జోసెఫ్ 37; పృథ్వీ షా (సి) జోసెఫ్ (బి) షమీ 7; మార్ష్ (బి) షమీ 4; సర్ఫరాజ్ (సి) లిటిల్ (బి) రషీద్ 30; రోసో (సి) తెవాటియా (బి) జోసెఫ్ 0; పోరెల్ (బి) రషీద్ 20; అక్షర్ (సి) మిల్లర్ (బి) షమీ 36; అమన్ ఖాన్ (సి) పాండ్యా (బి) రషీద్ 8; కుల్దీప్ (నాటౌట్) 1; నోర్జే (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1–29, 2–37, 3–67, 4–67, 5–101, 6–130, 7–148, 8–158. **బౌలింగ్:** షమీ 4–0–41–3, లిటిల్ 4–0–27–0, పాండ్యా 3–0–18–0, జోసెఫ్ 4–0–29–2, యశ్ దయాల్ 1–0–12–0, రషీద్ ఖాన్ 4–0–31–3.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (బి) నోర్జే 14; గిల్ (బి) నోర్జే 14; సుదర్శన్ (నాటౌట్) 62; పాండ్యా (సి) పోరెల్ (బి) ఖలీల్ 5; విజయ్ శంకర్ (ఎల్బీ) (బి) మార్ష్ 29; మిల్లర్ (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 163. వికెట్ల పతనం:** 1–22, 2–36, 3–54, 4–107. **బౌలింగ్:** ఖలీల్ 4–0–38–1, ముకేశ్ 4–0–42–0, నోర్జే 4–0–39–2, మార్ష్ 3.1–0–24–1, కుల్దీప్ 3–0–18–0.


ఢిల్లీ, గుజరాత్ మ్యాచ్‌ను వీక్షించేందుకు స్టేడియానికి వచ్చిన రిషభ్ పంత్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	0.700
రాజస్తాన్	1	1	0	2	3.600
బెంగళూరు	1	1	0	2	1.981
లక్నో	2	1	1	2	0.950
పంజాబ్	1	1	0	2	0.438
చెన్నై	2	1	1	2	0.036
కోల్‌కతా	1	0	1	0	-0.438
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	1	0	1	0	-3.600

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

విలియమ్సన్ స్థానంలో షనక

మోకాలి గాయంతో ఐపీఎల్‌కు దూరమైన స్టార్ క్రికెటర్ కేన్ విలియమ్సన్ స్థానంలో శ్రీలంక జట్టు కెప్టెన్ దాసున్ షనకను గుజరాత్ టైటాన్స్ జట్టు తీసుకుంది. గత ఐపీఎల్ వేలంలో షనకను ఎవరూ కొనుగోలు చేయలేదు. ఇప్పుడు విలియమ్సన్ స్థానంలో షనకతో అతని కనీస ధర రూ. 50 లక్షలకు గుజరాత్ టైటాన్స్ ఒప్పందం చేసుకుంది.

వెయిట్‌లిఫ్టర్ సంజితపై నాలుగేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: డోపింగ్ పరీక్షలో విఫలమైన భారత వెయిట్‌లిఫ్టర్ సంజిత చానుపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నాలుగేళ్ల నిషేధం విధించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల సందర్భంగా సంజిత చాను నుంచి డోపింగ్ శాంపిల్స్ సేకరించారు. ఆమె శాంపిల్స్‌ను పరీక్షించగా ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత ఉత్ప్రేరకాల జాబితాలో ఉన్న డ్రోస్టానోలోన్ మెటాబోలైట్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దాంతో సంజితపై ‘నాడా’ క్రమశిక్షణ ప్యానెల్ నాలుగేళ్ల నిషేధం విధించింది. మణిపూర్‌కు చెందిన 29 ఏళ్ల సంజిత పలు మెగా ఈవెంట్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. సంజిత 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో 48 కేజీల విభాగంలో... 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో 53 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది.

కిర్గిజ్ రిపబ్లిక్‌పై భారత్ ఘనవిజయం

బిష్కెక్: ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) మహిళల ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ రౌండ్–1లో భారత జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ ‘జి’లో భాగంగా మంగళవారం కిర్గిజ్ రిపబ్లిక్‌తో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ విశేషంగా రాణించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సౌమ్య ఈ మ్యాచ్‌లో ఒక గోల్ చేయడంతో పాటు సహచరిణి అంజు తమాంగ్ రెండు గోల్స్ చేయడంలో సహాయం చేసింది. భారత జట్టుకు అంజు తమాంగ్ (6వ, 42వ ని.లో) రెండు గోల్స్ అందించగా... సౌమ్య గుగులోత్ (45+3వ ని.లో), షిల్కీ దేవి (61వ ని.లో), రేణు (63వ ని.లో) ఒక్కో గోల్ సాధించి పెట్టారు. శుక్రవారం కిర్గిజ్ రిపబ్లిక్ జట్టుతోనే భారత్ రెండో లీగ్ మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ ‘జి’లోని మూడో జట్టు తుర్క్‌మెనిస్తాన్ టోర్నీ నుంచి వైదొలిగింది.


సౌమ్య గుగులోత్

సినిమా


రామ్‌చరణ్, సల్మాన్ ఖాన్, వెంకటేశ్

ఏంటమ్మా అదుర్స్...

‘ఏంటమ్మా.. ఏంటమ్మా...’ అంటూ లుంగీ డ్యాన్స్‌తో ఇరగదీశారు హీరోలు వెంకటేశ్, సల్మాన్ ఖాన్, రామ్‌చరణ్. ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్, పూజా హెగ్డే జంటగా వెంకటేశ్ కీలక పాత్రలో నటించిన హిందీ చిత్రం ‘కిసీ కా భాయ్ కిసీ కీ జాన్’. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం రంజాన్ సందర్భంగా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ చిత్రంలోని ‘ఏంటమ్మా.. ఏంటమ్మా...’ అంటూ సాగే పాటలో సల్మాన్, వెంకటేశ్, పూజా హెగ్డేలతో కలిసి రామ్‌చరణ్ డ్యాన్స్ చేశారు. ఈ మాస్ పాటను చిత్రయూనిట్ మంగళవారం విడుదల చేసింది. ‘‘ఇద్దరు లెజెండ్స్‌తో (సల్మాన్ ఖాన్, వెంకటేశ్) స్టెప్పులేయడం మర్చిపోలేని అనుభూతి. వెండితెరపై మర్చిపోలేని క్షణాల్లో ఇవి కూడా ఉన్నాయి.. లవ్ యూ భాయ్’ అంటూ ట్వీట్ చేశారు రామ్‌చరణ్.

ఇలాంటి కథ తెలుగులో రాలేదు

- సుధీర్ వర్మ



‘‘రవితేజగారితో ఫలానా జానర్ సినిమా చేయాలని ముందుగా అనుకోలేదు. రైటర్ శ్రీకాంత్ చెప్పిన కథ రవితేజగారికి నచ్చడంతో దర్శకునిగా నేనైతే బావుంటుందని నా వద్దకు పంపించారు. థ్రిల్లర్ జానర్‌లో ‘రావణాసుర’ వంద శాతం కొత్త మూవీ. ఇలాంటి కథ ఇప్పటివరకూ తెలుగులో రాలేదు’’ అని డైరెక్టర్ సుధీర్ వర్మ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం ‘రావణాసుర’. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సుధీర్ వర్మ మాట్లాడుతూ– ‘‘రావణాసుర’లో థ్రిల్స్, షాకింగ్, సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. అందులో ఏది ముందు చెప్పినా సినిమా చూసినప్పుడు ప్రేక్షకులకు ఆ థ్రిల్ ఉండదు.. వారికి ఆ అనుభూతిని ఇవ్వడానికే కథ గురించి చెప్పడం లేదు. అయితే సినిమా చూసిన తర్వాత మన భావోద్వేగాలు మిస్సయిన ఫీలింగ్ ఆడియన్స్‌కి రాదని నా నమ్మకం. ‘రావణాసుర’ పూర్తిగా రవితేజగారి సినిమా. నటన పరంగా ఆయన సినిమాల్లో టాప్ త్రీలో ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతోనే రవితేజగారు ఓ నిర్మాతగా వ్యవహరించారు. అభిషేక్‌గారితో నేను చేసిన రెండో సినిమా ‘రావణాసుర’. నాపై నమ్మకంతో ఆయన సెట్స్‌కే రారు. ‘సుధీర్ ఏం అడిగితే అది ఇచ్చేయండి’ అని యూనిట్‌కి చెబుతారు. ‘అంతం’ మూవీలో నాగార్జునగారి, ‘సత్య’లో జేడీ చక్రవర్తిగారి పాత్రల్లో గ్రే షేడ్స్ ఉంటాయి. అయితే హీరోలని గ్రే షేడ్స్‌లో చూపించడం ఈ మధ్య ఎక్కువ అయింది. మణిరత్నంగారి ‘రావణ్’ సినిమాకి, మా ‘రావణాసుర’కి ఎలాంటి సంబంధం లేదు. ‘రావణాసుర’ని హిందీ, తమిళ్‌లో విడుదల చేయాలనుకున్నాం కానీ కుదరలేదు. తెలుగులో విడుదలైన రెండో వారం నుంచి హిందీలో ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం నిఖిల్ హీరోగా నా దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ఆ తర్వాత త్రివిక్రమ్‌గారి కథతో పవన్ కల్యాణ్‌గారితో నేను ఓ సినిమా చేసే అవకాశం ఉంది’’ అన్నారు.


అల్లు అర్జున్

బర్త్ డే ట్రీట్

ఫ్యాన్స్‌కు బర్త్ డే ట్రీట్‌ను సిద్ధం చేస్తున్నారు అల్లు అర్జున్. ‘ఆర్య’, ‘ఆర్య 2’ చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో ‘పుష్ప’ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. రెండు భాగాల ఈ చిత్రంలోని తొలి భాగం ‘పుష్ప: ది రైజ్’ 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండో భాగం ‘పుష్ప: ది రూల్’ సెట్స్‌పై ఉంది. త్వరలోనే ఈ సినిమా విదేశీ షెడ్యూల్ ఆరంభం కానుంది. థాయ్‌లాండ్, శ్రీలంక లొకేషన్స్‌లో షూటింగ్‌ను ప్లాన్ చేశారట. కాగా ఈ నెల 8న అల్లు అర్జున్ బర్త్‌డే. ఈ సందర్భంగా ‘పుష్ప: ది రూల్’ కాన్సెప్ట్ టీజర్‌ను 7న, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 8న రిలీజ్ చేసేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిందని తెలిసింది. రష్మికా మందన్నా హీరోయిన్‌గా, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ అవుతుంది.

సినిమా బాగుంటే థియేటర్లలోనే చూస్తారు

- చెర్రీ



‘‘కథ పరంగా ‘మీటర్’ సినిమా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. మంచి కథని ప్రయోగాత్మకంగా చెప్పొచ్చు.. కమర్షియల్‌గా కూడా చూపించొచ్చు. డైరెక్టర్లు బాబీ, గోపీచంద్ మలినేని వద్ద పని చేసిన అనుభవంతో దర్శకుడు రమేష్ ‘మీటర్’ని కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా చక్కగా తీశాడు’’ అని నిర్మాత చిరంజీవి (చెర్రీ) అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వం వహించిన చిత్రం ‘మీటర్’. నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిరంజీవి (చెర్రీ) మాట్లాడుతూ– ‘‘మా క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో ‘ఒక్కడున్నాడు, మత్తు వదలరా, హ్యాపీ బర్త్ డే’ వంటి ప్రయోగాత్మక చిత్రాలు తీశాం. తొలిసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్ చేస్తే బాగుంటుందని ‘మీటర్’ చేశాం. చాలా బలమైన కథతో రమేష్ ఈ సినిమాని తీశాడు. ‘ఎస్‌ఆర్ కళ్యాణ మండపం’ చూసి కిరణ్‌ని ‘మీటర్’కి తీసుకున్నాం. ఏ పాత్ర అయినా చేయగల సత్తా ఉన్న నటుడు కిరణ్. తన కెరీర్‌లో అత్యధిక బడ్జెట్ మూవీ ఇది. ప్రయోగాత్మక చిత్రాలకు మంచి పేరు రావచ్చు కానీ డబ్బులు రావు. ‘మీటర్’ లాంటి మూవీస్‌కి సినిమా బావుందంటే మాత్రం బాక్సాఫీస్ కలెక్షన్స్ బెటర్‌గా ఉండే అవకాశం ఉంటుంది. ఓటీటీల ప్రభావం థియేటర్స్‌పై పెద్దగా ఉండదు. సినిమా బావుంది అంటే తప్పకుండా థియేటర్లకి వెళతారు. ఇందుకు ఉదాహరణ ఇటీవల రిలీజైన ‘వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య’. చిన్న సినిమాలకు స్కోప్ లేదని నేనెప్పుడూ అనుకోలేదు. మంచి కథ కుదిరితే మళ్లీ ప్రయోగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతం రితేష్ రానా దర్శకత్వంలో ఓ సినిమా నిర్మిస్తున్నాం. అలాగే ఓ కొత్త దర్శకుడితో మరో సినిమా ఉంటుంది’’ అన్నారు.

యూత్‌ఫుల్ జంక్షన్


నైనా సర్వార్, ఈశ్వర్

‘కొత్తగా మా ప్రయాణం’ ఫేమ్ ఈశ్వర్, నైనా సర్వార్ జంటగా నటించిన చిత్రం ‘సూర్యాపేట్ జంక్షన్’. ‘కథనం’ ఫేమ్ నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ఎస్ రావు, విష్ణువర్ధన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెలాఖరులో విడుదలకు సిద్ధమవుతోంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ‘‘యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం ఇది. త్వరలో సెన్సార్‌కి వెళ్లనున్నాం. మా చిత్రంలోని ‘మ్యాచింగ్ మ్యాచింగ్..’ పాట రీల్స్ పోటీ విజేతలను త్వరలో ప్రకటించి, ప్రీ రిలీజ్ వేడుకలో బహుమతులు ఇస్తాం’’ అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పాండు అలిజాల, మ్యూజిక్: రోషన్ సాలూరి, గౌర హరి, కెమెరా: అరుణ్ ప్రసాద్.

మూడేళ్ల తర్వాతే బ్రహ్మాస్త్రం పార్ట్ 2



‘బ్రహ్మాస్త్రం’ చిత్రంలోని తర్వాతి భాగాలను చూడాలనుకుంటున్న ప్రేక్షకులు మరింత సమయం వేచి ఉండక తప్పదు. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న హిందీ ట్రయాలజీ ‘బ్రహ్మాస్త్ర’. మూడు భాగాల ‘బ్రహ్మాస్త్రం’లోని తొలి భాగం ‘బ్రహ్మాస్త్ర: పార్ట్ వన్ శివ’ గత ఏడాది సెప్టెంబరు 9న విడుదలై, ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ హీరో హీరోయిన్లుగా అమితాబ్ బచ్చన్, నాగార్జున కీలక పాత్రల్లో ఈ చిత్రం రూపొందింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. కాగా ‘బ్రహ్మాస్త్ర’ ట్రయాలజీలోని రెండో భాగం ‘బ్రహ్మాస్త్ర: పార్టు 2 దేవ్’, ‘బ్రహ్మాస్త్ర’ థర్డ్ పార్టులను వరుసగా 2026 డిసెంబరు, 2027 డిసెంబరులో విడుదల చేయనున్నట్లు దర్శకుడు అయాన్ ముఖర్జీ మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ‘‘బ్రహ్మాస్త్ర: పార్ట్ 1 శివ’కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో సెకండ్ పార్ట్, థర్డ్ పార్ట్ స్క్రిప్ట్స్‌పై మరింత ఫోకస్ పెట్టాను. అలాగే ఈ రెండు సినిమాలను ఏడాది గ్యాప్‌లో విడుదల చేయాలనుకుంటున్నాం’’ అని పేర్కొన్నారు దర్శకుడు అయాన్ ముఖర్జీ. అలాగే తాను మరో సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఉందని, సరైన టైమ్‌లో ఆ విషయాన్ని వెల్లడిస్తానని కూడా అయాన్ పేర్కొన్నారు. దాంతో ఇది ‘వార్ 2’ సినిమా గురించే అనే ఊహాగానాలు మొదలయ్యాయి.


అయాన్ ముఖర్జీ

త్వరలో సెట్స్‌కి వార్ 2


హృతిక్ రోషన్

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలింస్ స్పై బ్యాక్‌డ్రాప్‌లో వరుసగా చిత్రాలను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. సల్మాన్ ఖాన్‌తో ‘ఏక్తా టైగర్, టైగర్ జిందా హై’, హృతిక్ రోషన్‌తో ‘వార్’, షారుక్ ఖాన్‌తో ‘పఠాన్’.. ఇలా యశ్ రాజ్ ఫిలింస్ స్పై బ్యాక్‌డ్రాప్‌లో నిర్మించిన చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే ఇదే సంస్థలో ‘టైగర్’ ఫ్రాంచైజీలో సల్మాన్ ఖాన్ నటించిన ‘టైగర్ 3’ వచ్చే ఏడాది ఈద్‌కు రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హృతిక్ రోషన్‌తో ‘వార్ 2’, సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్‌లతో ‘పఠాన్ వర్సెస్ టైగర్’ చిత్రాలను భారీ బడ్జెట్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యశ్ రాజ్ ఫిలింస్ భావిస్తోంది. ఇందులో భాగంగానే ‘వార్ 2’ సినిమాను త్వరలోనే సెట్స్‌పైకి తీసుకువెళ్లనున్నారు మేకర్స్. హృతిక్ రోషన్ హీరోగా, టైగర్ ష్రాఫ్ లీడ్ రోల్‌లో నటించిన ‘వార్’ చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించారు. ‘వార్ 2’కు మాత్రం అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్నారని టాక్. ప్రస్తుతం హృతిక్ హీరోగా ‘ఫైటర్’ చిత్రం తెరకెక్కిస్తున్నారు దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్. వచ్చే ఏడాది జనవరి 25న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

పఠాన్ వర్సెస్ టైగర్?

స్పై బ్యాక్‌డ్రాప్‌లో షారుక్‌తో ‘పఠాన్’, సల్మాన్‌తో ‘టైగర్’ చిత్రాలను యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించిన సంగతి తెలిసిందే. ‘పఠాన్’ చిత్రంలో షారుక్‌ను కాపాడేందుకు టైగర్‌గా వస్తారు సల్మాన్. ఈ యాక్షన్ సీక్వెన్స్ ఈ ఇద్దరు హీరోల ఫ్యాన్స్‌ను అలరించింది. కాగా ఈ ఇద్దరూ శత్రువులైతే ఎలా ఉంటుందనే నేపథ్యంలో ‘పఠాన్ వర్సెస్ టైగర్’ సినిమాను ప్లాన్ చేస్తోందట యశ్ రాజ్ ఫిలింస్. ఇదే నిజమైతే చాలాకాలం తర్వాత ఒకే సినిమాలో షారుక్, సల్మాన్‌లను లీడ్ రోల్స్‌లో చూడొచ్చు. ఈ సినిమాకు సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.


షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్

సాక్షి బిజినెస్
బుధవారం
5-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	115	59,106
నిఫ్టీ ▲	38	17,398

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,141	▽	47
డోజోన్స్	33,395	▽	206
ఎఫ్‌టీఎస్ఈ 100	7,635	▽	38
డాక్స్	15,603	▲	23
షాంఘై	3,313	▲	16
నికాయ్	28,287	▲	23

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,715
బంగారం (22 క్యారట్)	59,476
వెండి (కిలో)	71,700

2 బిలియన్ డాలర్ల సమీకరణలో రిలయన్స్, జియో

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ మరో 2 బిలియన్ డాలర్లను (సుమారు రూ. 16,400 కోట్లు) సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టాయి. విదేశీ కరెన్సీలో తక్కువ వడ్డీ రేట్లకు ఈ నిధులను సమీకరించే యోచనలో కంపెనీలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రెండు సంస్థలు ఇటీవలే 3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 24,600 కోట్లు) మొత్తాన్ని సిండికేట్ లోన్ ద్వారా సమీకరించాయి. రెండు డజన్ల తైవాన్ బ్యాంకులతో పాటు బ్యాంక్ ఆఫ్ అమెరికా, హెచ్ఎస్‌బీసీ తదితర 55 దిగ్గజ సంస్థలు ఈ నిధులను అందించాయి. ఆ ఒప్పందాల ప్రాతిపదికనే కొత్తగా 2 బిలియన్ డాలర్లను రిలయన్స్, జియో సమీకరించనున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి.

జాన్ ప్లేయర్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా సిద్ధార్థ్ మల్హోత్రా

ముంబై: దేశీయ ఫ్యాషన్ కంపెనీ జాన్ ప్లేయర్స్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా నటుడు సిద్ధార్థ మల్హోత్రాను ప్రకటించింది. అలాగే ''న్యూ స్ప్రింగ్ సమ్మర్ 23 కలెక్షన్''ను ఆవిష్కరించింది. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్లుగా ఉత్పత్తులను తీసుకువస్తున్న జాన్ ప్లేయర్స్‌తో కలిసి పనిచేయటం ఎంతో సంతోషంగా ఉందని మల్హోత్రా తెలిపారు. దేశవ్యాప్తంగా బ్రాండ్‌కు మరింత ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో సిద్ధార్థ మల్హోత్రాను ప్రచారకర్తగా నియమించుకున్నామని కంపెనీ బిజినెస్ హెడ్ నితిన్ సైగల్ పేర్కొన్నారు. సంప్రదాయ ప్రింట్స్, అతి సున్నితమైన డిజైన్లతో కలిగిన వస్త్రాలు న్యూ స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్‌లో భాగంగా ఉన్నాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
5-4-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417-00
విజయవాడ	417-00
రిటైల్ ధర (డజను)	66.00
4-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

భారత్ వృద్ధి రేటుకు ప్రపంచ బ్యాంక్ కోత

- 2023-24 అంచనాలు 6.3 శాతానికి డౌన్
- క్రితం అంచనాలు 6.6 శాతం
- వడ్డీరేట్ల పెరుగుదల, ఆదాయ వృద్ధిలో నెమ్మది కారణం
- అధిక ధరలు, ప్రపంచ పరిణామాలు కూడా అడ్డంకులే..



వాషింగ్టన్: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏప్రిల్‌తో ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో (2023-24) 6.3 శాతానికి పరిమితమవుతుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఈ మేరకు క్రితం అంచనాలను 6.6 శాతం నుంచి 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. పెరుగుతున్న వడ్డీరేట్లు, ఆదాయ వృద్ధి మందగమనం, అధిక ధరలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు తన క్రితం అంచనాల తాజా తగ్గింపునకు కారణమని దక్షిణాసియాకు సంబంధించి ఆవిష్కరించిన నివేదికలో బహుళజాతి బ్యాంకింగ్ దిగ్గజం పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వార్షిక (స్ప్రింగ్) సమావేశాలకు ముందు వరల్డ్ బ్యాంక్ చీఫ్ ఎకనమిస్ట్ (దక్షిణాసియా) హన్స్ టిమ్మర్ ఈ నివేదిక విడుదల చేశారు. నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు...

- బలహీన వినియోగం, కఠిన వడ్డీరేట్ల వ్యవస్థ ముఖ్యంగా ప్రభుత్వ ప్రస్తుత వ్యయ నియంత్రణ అంచనాల డౌన్‌గ్రేడ్‌కు ప్రధాన కారణం.
- దక్షిణాసియాలోని అనేక ఇతర దేశాల కంటే భారతదేశంలో పరిస్థితి మెరుగ్గానే ఉంది. ఆర్థిక రంగంలో పరిస్థితి ఇతర దేశాల కంటే బాగుంది. భారతదేశంలోని బ్యాంకులు పటిష్ట స్థితిలో ఉన్నాయి. మహమ్మారి తర్వాత బ్యాంకింగ్ చక్కటి రికవరీ సాధించింది. ఆర్థిక వ్యవస్థలో తగిన రుణాలకుగాను లిక్విడిటీ బాగుంది. ఇటీవలి సంవత్సరాలతో పోలిస్తే ప్రైవేట్ పెట్టుబడులు చాలా బలంగా ఉన్నాయి. సమస్యల్లా దేశం తన సామర్థ్యాన్ని తక్కువ స్థాయిలో వినియోగించుకోవడమే.
- భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం 20 శాతం కంటే తక్కువకు పడిపోయింది. అసంఘటిత రంగం ఉత్పాదకత పెరుగుతోందన్న దాఖలాలు లేవు. అలాగని ఫలితాలూ మరీ అధ్వానంగానూ లేవు. ఆయా అంశాలను పరిశీలిస్తే అన్ని వర్గాల భాగస్వామ్యంతో వృద్ధిని మరింత పెంచడానికి భారత్ ముందు భారీ నిర్మాణాత్మక ఎజెండా ఉందని భావిస్తున్నాం.
- విదేశాల నుండి ప్రైవేట్ పెట్టుబడులు మరింత పెరగాలి. ముఖ్యంగా సేవల రంగాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. ఇందుకుగాను సంస్కరణల ఎజెండాను మరింత ముందుకు తీసుకువెళ్లాలి. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వాతావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఉద్యోగాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలి.

దక్షిణాసియా దేశాలపై ఇలా..

స్వల్పకాలికంగా చూస్తే, భారత్ దక్షిణాసియాలో ఇతర దేశాలకంటే పటిష్ట ఎకానమీని కలిగి ఉంది. భూటాన్ మినహా ఈ ప్రాంతంలోని అన్ని దేశాలు తమ వృద్ధి అంచనాలను కుదించుకుంటున్నాయి. గత ఏడాది విపత్తు వరదల ప్రభావంతో పాకిస్తాన్ ఇంకా సతమతమవుతూనే ఉంది. సరఫరాల వ్యవస్థకు తీవ్ర అంతరాయాలు ఎదురవుతున్నాయి. పెట్టుబడిదారుల విశ్వాసం దిగజారుతోంది. అధిక రుణ, మూలధన వ్యయాలు భారమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాక్ వృద్ధి ఈ ఏడాది 0.4 శాతానికి తగ్గుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఇక రుణ సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక ఎకానమీలో వృద్ధి లేకపోగా, ఇది ఈ ఏడాది 4.3% క్షీణిస్తుందన్నది అంచనా. పర్యాటకం ఊపందుకోవడం మాల్దీవులు, నేపాల్‌కు సానుకూల అంశాలైనా, అంతకు మించి అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి ప్రభావాలు ఈ దేశాలు ఎదుర్కొననున్నాయి. దక్షిణాసియాలో 2023లో 8.9 శాతం ద్రవ్యోల్బణం అంచనాలు ఉన్నాయి. 2024లో ఇది 7% లోపునకు తగ్గవచ్చు. అయితే బలహీన కరెన్సీలు పెద్ద సమస్యగా ఉంది. ద్రవ్యోల్బణం భయాలను పెంచే అంశమిది.

వృద్ధి 6.4 శాతం: ఏడీబీ



ఇదిలాఉండగా, 2023-24లో భారత్ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) అవుట్‌లుక్ ఒకటి పేర్కొంది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేసిన ఏడీబీ, 2023-24లో ఈ రేటు తగ్గడానికి కఠిన ద్రవ్య పరిస్థితులు, చమురు ధరలు పెరగడాన్ని కారణంగా చూపింది. కాగా, 2024-25లో వృద్ధి రేటు 6.7 శాతానికి పెరుగుతుందని ఏడీబీ అంచనావేసింది. ప్రైవేటు వినియోగం, పెట్టుబడులు పెరగడం దీనికి కారణంగా చూపింది. రవాణా రంగం పురోగతికి, వ్యాపార పరిస్థితులు మెరుగుపడ్డానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు ఫలితాలు ఇస్తాయని ఏడీబీ వివరించింది. అంతర్జాతీయంగా పలు దేశాలు మాంద్యం ముంగిట నుంచున్నప్పటికీ, భారత్ ఎకానమీ తన సహచర దేశాల ఎకానమీలతో పోల్చితే పటిష్టంగా ఉందని ఏడీబీ కంట్రీ డైరెక్టర్ టకియో కినీషీ పేర్కొన్నారు.

వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వండి.. ఉక్కు ఇస్తాం

వైజాగ్ స్టీల్ వినూత్న ప్రతిపాదన



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ (ఆర్ఐఎన్ఎల్ - వైజాగ్ స్టీల్) నిధుల సమీకరణ కోసం మార్గాలు అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా తమకు నిర్వహణ మూలధనం లేదా ముడి సరుకును సమకూర్చే కంపెనీలకు ప్రతిగా ఫినిష్డ్ ఉక్కు ఉత్పత్తులను సరఫరా చేసే వినూత్న ప్రతిపాదనను తొలిసారిగా తెరపైకి తెచ్చింది. దీనికి సుముఖంగా ఉన్న ఉక్కు, ఉక్కు సంబంధ ముడి వస్తువుల వ్యాపారం చేసే సంస్థలు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (ఈవోఐ) సమర్పించాలని ఆహ్వానించింది. కోకింగ్ కోల్, ఇనుప ఖనిజం మొదలైన వాటిని సరఫరా చేయడం లేదా నిర్వహణ మూలధనం సమకూర్చడం ద్వారా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావచ్చని ఒక నోటీసులో ఆర్ఐఎన్ఎల్ తెలిపింది. దానికి బదులుగా పరస్పరం ఆమోదయోగ్యమైన నిబంధనల ప్రకారం ఉక్కు ఉత్పత్తులను పొందవచ్చని వివరించింది. ఈవోఐల దాఖలుకు ఏప్రిల్ 15 ఆఖరు తేదీ.

ఆసియా కుబేరుడు ముకేశ్

- టాప్-10 ప్రపంచ సంపన్నుల్లో చోటు
- 24వ ర్యాంకుకు జారిన అదానీ
- ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదల



న్యూఢిల్లీ: ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ తిరిగి టాప్ ర్యాంకును కైవసం చేసుకున్నారు. 83.4 బిలియన్ డాలర్ల సంపదతో ఆసియా కుబేరుడిగా ఆవిర్భవించారు. ప్రపంచ కుబేరుల్లో 9వ ర్యాంకును ఆక్రమించారు. వ్యక్తిగత సంపదపై ఫోర్బ్స్ విడుదల చేసిన 2023 ప్రపంచ బిలియనీర్ల తాజా జాబితాలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 24వ ర్యాంకుకు దిగిపోయారు. ఈ ఏడాది జనవరి 24న గౌతమ్ అదానీ 126 బిలియన్ డాలర్ల ఆస్తులతో ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా మూడో ర్యాంకులో నిలిచారు. అయితే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక నేపథ్యంలో అదానీ సంపద 47.2 బిలియన్ డాలర్లకు పడిపోయింది.

ప్రపంచ కుబేరుల తీరిలా

అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ సంపదలో 38 శాతం(57 బిలియన్ డాలర్లు) నష్టపోయారు. ఫలితంగా ప్రపంచ కుబేరుల్లో రెండు నుంచి మూడో స్థానానికి తగ్గారు. ఈ ఏడాది టెస్లా చీఫ్ ఎలన్ మస్క్ సంపదలో 39 బిలియన్ డాలర్లు ఆవిరికావడంతో రెండో ర్యాంకుకు పరిమితమయ్యారు. కాగా.. విలాస వస్తువుల ఫ్రెంచ్ టైకూన్ బెర్నార్డ్ ఆర్నాల్ట్ 211 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌తో తొలిసారి ప్రపంచ టాప్ ర్యాంకును ఆక్రమించారు. మస్క్ సంపద 180 బిలియన్ డాలర్లు కాగా, బెజోస్ ఆస్తులు 114 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ఈ-కామర్స్ వ్యాపారంలోకి ఫోన్‌పే

పిన్‌కోడ్ పేరుతో షాపింగ్ యాప్



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే తాజాగా ఈ-కామర్స్ వ్యాపారంలోకి ప్రవేశించింది. పిన్‌కోడ్ పేరిట షాపింగ్ యాప్‌ను రూపొందించింది. తొలుత బెంగళూరులో ఈ యాప్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఫోన్‌పే వ్యవస్థాపకుడు సమీర్ నిగమ్ తెలిపారు. రోజుకు 10,000 పైచిలుకు లావాదేవీలు సాధించిన తర్వాత ఇతర నగరాలకు కూడా దీన్ని విస్తరిస్తామని చెప్పారు. డిసెంబర్ నాటికి రోజుకు లక్ష లావాదేవీలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వినియోగదారులకు సంబంధించి గత ఏడేళ్లలో ఫోన్‌పే నుంచి ఇది రెండో యాప్ అని చెప్పారు. కేంద్రం తీర్చిదిద్దిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫాం ఆధారంగా పిన్‌కోడ్ యాప్‌ను రూపొందించారు.

విప్రో కన్జూమర్ అమ్మకాలు @ రూ. 10 వేల కోట్లు

న్యూఢిల్లీ: ఇటీవలే ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయం రూ. 10,000 కోట్ల మైలురాయిని దాటినట్లు విప్రో కన్జూమర్ కేర్ అండ్ లైటింగ్ వెల్లడించింది. వివిధ ప్రాంతాలు, బ్రాండ్లు, కేటగిరీలవారీగా విక్రయాలు గణనీయంగా వృద్ధి చెందడం ఇందుకు దోహదపడినట్లు పేర్కొంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 8,634 కోట్లుగా నమోదైంది. దేశీయంగా ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్)వ్యాపార విభాగం 17 శాతం పెరిగినట్లు తెలిపింది. సబ్బుల బ్రాండ్ సంతూర్ ఇప్పుడు నిర్దిష్ట విభాగంలో రూ. 2,650 కోట్ల అమ్మకాలతో రెండో స్థానానికి చేరిందని పేర్కొంది. అటు వియత్నాం మార్కెట్‌లో రెండంకెల స్థాయి వృద్ధితో 10 కోట్ల డాలర్ల ఆదాయం మార్కును దాటినట్లు .. దక్షిణాఫ్రికా, మధ్యప్రాచ్యం, ఫిలిప్పీన్స్ తదితర మార్కెట్లలోను రెండంకెల స్థాయి వృద్ధి సాధించినట్లు కంపెనీ తెలిపింది. 2003లో రూ. 300 కోట్ల ఆదాయం ఉండగా .. గత రెండు దశాబ్దాల్లో 33 రెట్లు పెంచుకుని నేడు అంతర్జాతీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజంగా ఎదిగామని సంస్థ సీఈవో వినీత్ అగ్రవాల్ తెలిపారు. 1945లో వనస్పతి సంస్థగా ప్రారంభమైన విప్రో కన్జూమర్ కేర్ అండ్ లైటింగ్‌కు ప్రస్తుతం 60 పైగా దేశాల్లో కార్యకలాపాలు ఉన్నాయి. 18 ఫ్యాక్టరీలు, 10,000 మంది పైచిలుకు సిబ్బంది ఉన్నారు. ఆదాయంలో 51 శాతం వాటా అంతర్జాతీయ వ్యాపారం నుంచి ఉంటోంది.



భవిత

జాబ్ పాయింట్

డిగ్రీతో 7500 కేంద్ర కొలువులు

ఎస్ఎస్‌సీ సీజీఎల్-2023 నోటిఫికేషన్ విడుదల

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ లెవల్(సీజీఎల్) పరీక్ష-2023కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని గ్రూప్-బి, గ్రూప్-సి విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేయనున్నారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 7500
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఐబీ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఎవోఆర్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఎంవోఈఏ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎఫ్‌హెచ్‌క్యూ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఈ అండ్ ఐటీ), అసిస్టెంట్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎస్/పీజీ డిగ్రీ/ఎంబీఏ(ఫైనాన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి ఖాళీలను అనుసరించి 18-27 ఏళ్లు, 20-30 ఏళ్లు, 18-30 ఏళ్లు, 18-32 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్ల పాటు వయోసడలింపు కల్పించారు. వీరితో పాటు దివ్యాంగులకు ప్రత్యేకంగా వయో సడలింపు ఇచ్చారు.
» **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.1,51,100(ఆయా పోస్టును బట్టి)
» **ఎంపిక విధానం:** టైర్-1, టైర్-2 ఎగ్జామినేషన్, డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్, ఫిజికల్/మెడికల్ టెస్టులు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో రూ.100ను ఎగ్జామ్ ఫీజుగా చెల్లించాలి (ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది).
» **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.05.2023.
» **టైర్-1 పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష):** జూలై 2023.
» **టైర్-2 పరీక్ష తేది:** ప్రకటించాల్సి ఉంది.
» **వెబ్‌సైట్:** www.ssc.nic.in

ఎంపీసీ.. ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో!

ఇంటర్మీడియెట్.. పరీక్షలు రాశారా.. భవిష్యత్ ఉన్నత విద్యావకాశాల గురించి ఆలోచిస్తున్నారా.. బీటెక్‌తోపాటు.. ఇతర కోర్సులు ఏమున్నాయని అన్వేషిస్తున్నారా?! ఇంటర్ ఎంపీసీతో ఇంజనీరింగ్‌తోపాటు అనేక వినూత్న కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటి గురించి ముందుగానే తెలుసుకొని సన్నద్ధమైతే లక్ష్య సాధన సులువవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ పరీక్షలు ముగిశాయి. ఈ నేపథ్యంలో.. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్య కోర్సుల వివరాలు..

» ఇంటర్మీడియెట్ ఎంపీసీ అర్హతతో అనేక ఉన్నత విద్యావకాశాలు
» ఇంజనీరింగ్, సైన్స్, లా, ఫార్మసీ, ఫ్యాషన్ కోర్సుల్లో చేరొచ్చు



ఇంజనీరింగ్.. ఎవర్‌గ్రీన్

ఇంజనీరింగ్(బీఈ/బీటెక్).. ఎంపీసీ విద్యార్థులకు ఎవర్‌గ్రీన్ కోర్సు. ఇందుకోసం జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, టీఎస్ ఎంసెట్, ఏపీ ఈఏపీసెట్, బిట్‌శాట్ వంటి ఎంట్రన్స్ టెస్ట్‌లకు విద్యార్థులు సిద్ధమవుతుంటారు.

జేఈఈ-మెయిన్

జేఈఈ-మెయిన్.. జాతీయ స్థాయిలోని ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రామాణికంగా నిలుస్తున్న పరీక్ష ఇది. మొత్తం మూడు విభాగాల్లో(ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. జేఈఈ-మెయిన్‌తో బీటెక్ మాత్రమే కాకుండా..నిట్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో సైతం ప్రవేశం లభిస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిర్వహించే జేఈఈ-మెయిన్ పేపర్-2లో ర్యాంకు పొందాల్సి ఉంటుంది. పేపర్-2బి పేరుతో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మరో పేపర్‌లో పరీక్ష నిర్వహిస్తారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jeemain.nta.nic.in

జేఈఈ-అడ్వాన్స్‌డ్

ఐఐటీ క్యాంపస్‌ల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. జేఈఈ అడ్వాన్స్‌డ్. జేఈఈ-మెయిన్ పేపర్-1లో ప్రతిభ ఆధారంగా 2.5 లక్షల మందిని జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా ఐఐటీలతోపాటు ఐఐఎస్‌టీ, ఐఐఎస్‌సీ తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ప్రవేశం పొందొచ్చు.

2023కు సంబంధించి జేఈఈ-అడ్వాన్స్‌డ్ దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 30 నుంచి మొదలు కానుంది. ఎంట్రన్స్‌ను జూన్ 4న నిర్వహించనున్నారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.jeeadv.ac.in

టీఎస్ ఎంసెట్/ఏపీ ఈఏపీసెట్

- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రన్స్‌లు టీఎస్ ఎంసెట్, ఏపీ ఈఏపీసెట్.
- తెలంగాణ రాష్ట్రంలో ఎంసెట్ పేరుతో, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఈఏపీ(ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ) సెట్ పేరుతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.
- రెండు స్ట్రీమ్‌లకు సంబంధించి 160 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్‌లో 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- అగ్రికల్చర్, ఫార్మసీ, మెడిసిన్ విభాగాల్లో బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.
- టీఎస్ ఎంసెట్-2023(ఇంజనీరింగ్ స్ట్రీమ్) పరీక్షను మే 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నారు. ఏప్రిల్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలకు వెబ్‌సైట్: https://eamcet.tsche.ac.in
- ఏపీ ఈఏపీసెట్-2023 ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మే 15నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

బిట్‌శాట్

బీటెక్ అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో ఎంట్రన్స్ టెస్ట్.. బిట్ శాట్. ఇంజనీరింగ్ విద్యలో పేరు గడించిన ది బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ -పిలానీ) బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బిట్‌శాట్ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ప్రతిభ ద్వారా బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉంది.

- ఈ పరీక్షను కూడా పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలోనే ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. అవి.. ఫిజిక్స్; కెమిస్ట్రీ; ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్; మ్యాథమెటిక్స్(ఇంజనీరింగ్ ఔత్సాహికులకు); బయాలజీ(బీఫార్మసీ అభ్యర్థులు). మొత్తం 130 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- 2023కు సంబంధించి బిట్‌శాట్-2023 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది బిట్‌శాట్‌ను రెండు దశలుగా నిర్వహించనున్నారు. తొలిదశకు ఏప్రిల్ 9 వరకు; రెండో దశకు మే 22 నుంచి జూన్ 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. తొలిదశ పరీక్ష మే 21-26, రెండో దశ పరీక్ష జూన్ 18-22 తేదీల్లో నిర్వహిస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: www.bitsadmission.com

ఆర్కిటెక్చర్‌కు నాటా

ఎంపీసీతో ప్రవేశం పొందే అవకాశమున్న కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఇందులో ప్రవేశానికి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా బీఆర్క్ కోర్సులో చేరొచ్చు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నాటాలో 125 ప్రశ్నలు(200 మార్కులు) ఉంటాయి. డయగ్రమాటిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రస్తుతం నాటా-2023 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం మూడు విడతల్లో నిర్వహించనున్నారు. తొలి విడత ఏప్రిల్ 21న, రెండో విడత మే 28న, మూడో విడత జూలై 9న నిర్వహించనున్నారు. తొలి విడత దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 10.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nata.in

ఐఐఎస్ఈఆర్.. బీఎస్+ఎంఎస్

సైన్స్ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు అందుబాటులో చక్కటి మార్గం..ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)క్యాంపస్‌లలో బీఎస్+ఎంఎస్! ఇందుకోసం 3 అర్హత ప్రమాణాలను నిర్దేశించారు.

- అవి.. జేఈఈ-అడ్వాన్స్‌డ్‌లో పది వేలలోపు ర్యాంకు సాధించిన వారు నేరుగా ఐఐఎస్ఈఆర్ అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- కేవీపీవై ఎస్ఏ స్ట్రీమ్‌లో సైన్స్ సబ్జెక్ట్‌లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కూడా ఐఐఎస్ఈఆర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఐఐఎస్ఈఆర్ నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ర్యాంకుతోనూ ప్రవేశం పొందొచ్చు. ఈ టెస్ట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లలో 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలతో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. 2023 సంవత్సరానికి సంబంధించి ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను జూన్ 17న నిర్వహించనున్నారు. ఏప్రిల్ 15 నుంచి మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలకు వెబ్‌సైట్: https://iiseradmission.in

హోటల్ మేనేజ్‌మెంట్

వినూత్న కెరీర్‌ను కోరుకునే విద్యార్థులు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంచుకోవచ్చు. జాతీయ స్థాయిలో టూరిజం శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును అందిస్తున్నాయి. ఇందులో ప్రవేశానికి ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఈ ఎంట్రన్స్‌ను అయిదు విభాగాల్లో (న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్; రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్; జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్; ఇంగ్లిష్ లాంగ్వేజ్; ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్) 200 ప్రశ్నలు అడుగుతారు. 2023కు సంబంధించి ఎన్‌సీహెచ్ఎం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఏప్రిల్ 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రన్స్ టెస్ట్‌ను మే 14న నిర్వహించనున్నారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://nchmjee.nta.nic.in

'న్యాయ శాస్త్రం'లో ఎల్ఎల్‌బీ

ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే లాసెట్‌లో స్కోర్ ఆధారంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

- ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ లాసెట్ పరీక్ష.. మూడు విభాగాల్లో(జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ; కరెంట్ అఫైర్స్; ఆప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లా) 120 మార్కులకు నిర్వహిస్తున్నారు.
- తెలంగాణలో టీఎస్ లాసెట్ పేరుతో ఎంట్రన్స్ నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష కూడా ఏపీ లాసెట్ మాదిరిగానే ఉంటుంది.
- టీఎస్ లాసెట్ 2023, ఏపీ లాసెట్‌లకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.
- టీఎస్ లాసెట్ వివరాలకు వెబ్‌సైట్: https://lawcet.tsche.ac.in
- ఏపీ లాసెట్ వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

క్లాట్‌తో నేషనల్ లా స్కూల్స్

న్యాయ విద్యలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా యూనివర్సిటీల్లో.. ఇంటర్‌తోనే ప్రవేశం పొందొచ్చు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్ఎల్‌బీలో అడ్మిషన్ కోసం కామన్ లా అడ్మిషన్ టెస్ట్-యూజీ (క్లాట్-యూజీ) ఎంట్రన్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత, బెస్ట్ స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలో నెలకొల్పిన 22 లా యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకోవచ్చు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ

వినూత్న కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గం .. నిఫ్ట్ కోర్సులు. ఫ్యాషన్ కోర్సులను అందించడంలో జాతీయ స్థాయిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా ఇంటర్మీడియెట్ అర్హతగా బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సును నిఫ్ట్ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. ఈ కోర్సులను పూర్తి చేసుకున్న వారికి గార్మెంట్స్, ఫ్యాషన్ సంబంధిత విభాగాల్లో చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

బీఫార్మసీ, ఫార్మ్-డి

బీఫార్మసీ..ఫార్మసీ రంగంలో అడుగు పెట్టే అవకాశం కల్పించే కోర్సు. ఇందులో ఎంపీసీ విద్యార్థులకు కూడా అవకాశం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో బీ ఫార్మసీ, ఫార్మ్-డి కళాశాలల్లో సీట్ల భర్తీని ఎంసెట్(తెలంగాణలో), ఈఏపీసెట్ (ఆంధ్రప్రదేశ్)లో ర్యాంకు ఆధారంగా చేపడతారు. మొత్తం బీఫార్మసీ సీట్లలో 50 శాతం సీట్లను ఎంపీసీ విద్యార్థులకు కేటాయిస్తారు. బీ.ఫార్మసీ పూర్తి చేసుకుంటే.. ఫార్మాస్యుటికల్ సంస్థలు, డ్రగ్ డిస్కవరీ, ఫార్ములేషన్, బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ సంస్థల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

క్లుప్తంగా...

లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎంపీ సంతోష్‌కు చోటు



సాక్షి, హైదరాబాద్: ఒక గంటలో ఒక ప్రాంతంలో 3,54,900 మొక్కలు నాటడం అనే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టినందుకు ''గ్రీన్ ఇండియా ఛాలెంజ్'' సృష్టికర్త, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌కు లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. మంగళవారం ప్రగతిభవన్‌లో లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్ ఎడిటర్ వత్సాల కౌల్ బెనర్జీ లిమ్కాబుక్ ప్రశంస పత్రాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సంతోష్ కుమార్‌కి అందించారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 8న రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది, అంబులెన్స్, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రధాని కాన్వాయ్ ప్రయాణించే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సీఎస్ సూచించారు. సమావేశానికి డీజీపీ అంజనీకుమార్, సీనియర్ పోలీసు అధికారులు, రైల్వే, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

ఉచితంగా లింగమార్పిడి ఆపరేషన్లు: కొప్పుల



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ లింగమార్పిడికి సంబంధించిన ఆపరేషన్లను ఉచితంగా నిర్వహిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేస్తున్నారని, రానున్న కాలంలో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో కూడా ఉచితంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ట్రాన్స్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ అనాథలైన ట్రాన్స్‌జెండర్స్‌ను ఆదుకునేందుకు ప్రత్యేక హోమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పలువురు వృద్ధ ట్రాన్స్‌జెండర్స్‌ను జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించారు. తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డితదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు

సంస్థాన్ నారాయణపురం: జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన వైద్య సేవలతో పాటు రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించినందుకు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. నేషనల్ హెల్త్ మిషన్ కింద నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) గుర్తింపు ధ్రువపత్రం పీహెచ్‌సీకి లభించింది.

ఐఎఫ్‌ఎస్ అధికారులు ప్రమాదాల్లో చనిపోతే రూ.కోటి

సాక్షి, హైదరాబాద్: అడవుల సంరక్షణ విధుల్లో భాగంగా తీవ్రవాదులు, అసాంఘిక శక్తుల చేతుల్లో హతం కావడం లేదా తీవ్రంగా గాయపడిన సందర్భాల్లో అటవీ అధికారులు, సిబ్బందికి చెల్లించే నష్టపరిహారాన్ని భారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి దాడుల్లో ఐఎఫ్‌ఎస్ అధికారులు చనిపోతే వారికి రూ.కోటి, అసిస్టెంట్/డిప్యూటీ కన్జర్వేటర్ ఫారెస్ట్–సత్సమాన ర్యాంకుల వారికి రూ.75 లక్షలు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు సమాన ర్యాంక్ వారికి రూ.50 లక్షలు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, సత్సమాన ర్యాంకుల వారికి రూ.45 లక్షలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సమాన ర్యాంక్ వారికి రూ.30 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. శాశ్వత వైకల్యం కలిగితే ఐఎఫ్ఎస్‌లకు రూ.50 లక్షలు, అసిస్టెంట్/డిప్యూటీ కన్జర్వేటర్, సమాన ర్యాంకులకు రూ.40 లక్షలు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సత్సమాన ర్యాంకుల వారికి రూ.30 లక్షలు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సమాన ర్యాంక్ వారికిరూ.25 లక్షలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సమాన ర్యాంక్‌ల వారికి రూ.20 లక్షలు, గాయపడిన ఐఎఫ్‌ఎస్‌లకు రూ.6 లక్షలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు రూ.3 లక్షలు, మిగతా కేటగిరీలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేస్తూ మంగళవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

ఈ చేప వయసు 18 కోట్ల ఏళ్లు!

చేప శిలాజం



➤ కోట్ల ఏళ్ల క్రితం ఎన్నో అరుదైన జీవజాతులు తెలంగాణ ప్రాంతంలో తమ అస్తిత్వాన్ని చాటుకున్నాయి. ఇక్కడ వెలుగు చూస్తున్న అప్పటి జీవ, వృక్ష జాతుల శిలాజాలు (ఫాసిల్స్) ఈ విషయం స్పష్టం చేస్తున్నాయి. ఆర్కియాలజీ (పురావస్తు పరిశోధన), పేలియంటాలజీ (శిలాజాల పరిశోధన) విభాగాల పరిశోధనల్లో ఇవి బహిర్గతమవుతున్నాయి. జురాసిక్ యుగం కన్నా ముందు యుగమైన ట్రయాసిక్ యుగం నాటి శిలాజాలు కూడా తెలంగాణలో దొరుకుతుండటం గమనార్హం. అనేక అరుదైన శిలాజాలను తెలంగాణ తన గర్భంలో దాచుకుందని, అనేక కొత్త అధ్యాయాలకు తెరతీసే అంతటి చరిత్ర ఇక్కడ దాగి ఉందని పరిశోధకులు అంటున్నారు. – సాక్షి, హైదరాబాద్

శిలాజాల గని.. తెలంగాణ

- కోట్ల ఏళ్ల నాటి ఆకుల నుంచి డైనోసార్ల వరకు లభ్యం
- పలు ప్రాంతాల్లో వెలికితీస్తున్న పరిశోధకులు
- భూపాలపల్లి జిల్లాలో బయటపడిన 25 కోట్ల ఏళ్ల నాటి రింకోసారా డైనోసార్ శిలాజం
- పెద్దపల్లి, మంచిర్యాల, అసిఫాబాద్ ప్రాంతాల్లోనూ శిలాజ సంపద

వేమనపల్లిలో డైనోసార్ వెన్నుపూస



డైనోసార్ వెన్నుపూస (శిలాజం)

➤ శిలాజాలపై 200 ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. గత చరిత్రకు, ప్రస్తుత తరానికి మధ్య జీవపరిణామ అంశాలను, జీవ వైవిధ్యాన్ని, జీవన స్థితిగతులను తెలియజేసేవే శిలాజాలు. సాధారణంగా ప్రిజర్వ్ (బురద, బంక, మంచులో కూరుకుపోయి ఏర్పడిన శిలాజాలు), ట్రేస్, కార్బన్, మోల్డ్స్, పెట్రిఫైడ్ అనే ఐదు రకాల శిలాజాలు ఉంటాయి. దాదాపుగా ఈ ఐదు రకాల శిలాజాలూ తెలంగాణలో లభ్యమయ్యాయి. ప్రస్తుత భూపాలపల్లి జిల్లా కాటారంలో రింకోసారా జాతికి చెందిన 25 కోట్ల సంవత్సరాల నాటి డైనోసార్ శిలాజాన్ని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) 2000 సంవత్సరంలో వెలికితీసింది. పెద్దపల్లి, మంచిర్యాల, అసిఫాబాద్ ప్రాంతాల్లో కూడా శిలాజ సంపద ఎక్కువగా ఉంది. మంచిర్యాలలోని వేమనపల్లిలో డైనోసార్ వెన్నుపూస (శిలాజం) బయటపడింది. చెన్నూరు అడవుల్లో ఆకుల శిలాజాలను, ఆసిఫాబాద్ జిల్లాలో షెల్ ఫాసిల్స్‌ను, మరోచోట పిల్లి జాతి (పిల్లి, పులి, చిరుత...)కి చెందిన పాదముద్రల శిలాజాలను పరిశోధకులు గుర్తించారు. మంచిర్యాలలోని జైపూర్‌లో ఓ క్షీరదానికి సంబంధించిన శిలాజం వెలుగు చూసింది. వేమనపల్లి పరిసర ప్రాంతాల్లో జురాసిక్ యుగం నాటి పాదముద్రలు, గోదావరి పరిసర ప్రాంతాల్లో మైక్రో (సూక్ష్మ) ఫాసిల్స్ విరివిగా ఉన్నాయి. వోల్కనిక్ ఎరా (అగ్ని పర్వతాల నుంచి లావా వెలువడి అధిక శాతం జీవజాలం నశించిన సమయం)కు సంబంధించిన ఆరున్నర కోట్ల ఏళ్లనాటి శిలాజాలు దక్కన్ ప్రాంతంలో ఎక్కువగా బయటపడుతున్నాయి. శిలాజాల కోసం తమిళనాడు, కోల్‌కతా, మహారాష్ట్రలో ప్రత్యేకంగా పార్కులు నిర్మించి భద్రపరుస్తున్నారు. రాష్ట్రంలో కూడా ఫాసిల్ పార్క్ ఏర్పాటు చేస్తే అరుదైన సంపదను సంరక్షించవచ్చని, వీటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలవుతుందని పలువురు పరిశోధకులు సూచిస్తున్నారు.

ఫాసిల్ పార్కు ఏర్పాటు చేయాలి..



➤ మన వద్ద 50 కోట్ల ఏళ్ల నాటి శిలాజ సంపద కూడా ఉంది. అయితే వీటి పరిరక్షణ, ఇతర పరిశోధనల విషయంలో అవసరమైనంత మేర కృషి జరగడం లేదు. ఈ మధ్య కాలంలో పలువురు యువ ఔత్సాహికులు శిలాజాలపై పరిశోధనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల మాదిరి ఇక్కడ కూడా ఫాసిల్ పార్కుల దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– చక్కిలం వేణుగోపాల్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, జీఎస్ఐ

2012 నుంచి పరిశోధనలు..



➤ తెలంగాణలో అనేక అరుదైన శిలాజాలు ఉన్నాయి. నేను 2012లో వీటిపై వ్యక్తిగతంగా పరిశోధనలు ప్రారంభించా. ప్రొఫెసర్లు, ఇతర పరిశోధకుల సహకారంతో నైపుణ్యం సాధించా. ఇప్పటివరకు ఆదిమానవుడి రాతి పనిముట్లు, కోట్ల సంవత్సరాల నాటి డైనోసార్ల అవయవాలకు సంబంధించిన శిలాజాలు సేకరించా. నా పరిశోధనల సంబంధిత సమాచారాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోని వర్సిటీల విద్యార్థులకు సెమినార్లు, ప్రదర్శనల ద్వారా తెలియజేస్తున్నా.

– సునీల్ సముద్రాల, ఔత్సాహిక పరిశోధకుడు, బేగంపేట, పెద్దపల్లి జిల్లా



అప్పటి రాతి పనిముట్లు

అన్నింటా మనమే టాప్

- ఐటీ సేవలు, లైఫ్ సైన్సెస్ రంగాలతో పాటు వ్యవసాయ– ఆహార రంగంలోనూ తెలంగాణ అగ్రస్థానం
- 'ఫుడ్ కాంక్లేవ్ 2023' పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్ వెల్లడి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సేవలు, లైఫ్ సైన్సెస్ రంగాలతో పాటు వ్యవసాయ– ఆహార రంగంలోనూ గత ఎనిమిదేళ్లుగా తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తోందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు వెల్లడించారు. ఏప్రిల్ 28, 29 తేదీల్లో హైదరాబాదులో రెండు రోజులపాటు జరిగే 'ఫుడ్ కాంక్లేవ్ 2023' పోస్టర్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సాగునీరు, ఇతర పథకాలపై దృష్టి కేంద్రీకరించడంతో రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లతో పాటు అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయని, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దేశం, రాష్ట్రం ఒకే రీతిలో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ క్రమంలోనే సంబంధిత రంగానికి చెందిన భాగస్వాములందరినీ ఒకచోట చేర్చేందుకు ఫుడ్ కాంక్లేవ్ 2023 ఉపయోగపడుతుందని మంత్రి కేటీ రామారావు తెలిపారు. వ్యవసాయం, వంట నూనెలు, పాడి పరిశ్రమ, మాంసం, కోళ్ల పరిశ్రమ, మత్స్య పరిశ్రమకు సంబంధించిన అంశాలపై ఈ సదస్సులో చర్చ జరుగుతుందన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఇండియా విభాగం, వంటనూనెల ఉత్పత్తిదారుల అసోసియేషన్, భారతీయ పాడి పరిశ్రమ అసోసియేషన్, హైపర్ ఇంటర్నేషనల్, ఆక్వాకల్చర్ ప్రొఫెషనల్ సొసైటీ ఈ సదస్సులో భాగస్వామ్యం వహిస్తాయి. సదస్సులో భాగంగా జరిగే 27 బృంద చర్చలు, 5 రౌండ్ టేబుల్ సమావేశాలు, 40 ముఖాముఖి సమావేశాల్లో ప్రభుత్వ, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారు. వ్యవసాయ రంగానికి చెందిన అనేకమంది ప్రముఖులు దేశం నలుమూలల నుంచి హాజరవుతారని సదస్సు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

రిటైరైనా 'సెటిల్‌మెంటు' జరగదాయె!

- ఆర్టీసీలో ఎనిమిది నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు
- సర్వీసు కాలంలో ప్రతినెలా జీతం నుంచి మినహాయించిన మొత్తం పొందలేని ఉద్యోగులు



సాక్షి, హైదరాబాద్: సర్వీసులో ఉన్నంత కాలం ప్రతినెలా జీతం నుంచి సంస్థ మినహాయిస్తూ వచ్చిన సొమ్ముల కోసం ఇప్పుడు వందలాది మంది ఆర్టీసీ పూర్వ ఉద్యోగులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆర్టీసీ సహకార పరపతి సంఘం(సీసీఎస్)లో డిపాజిట్ అయి ఉన్న ఆ మొత్తాన్ని ఆర్టీసీ వినియోగించుకోవటంతో ఈ దుస్థితి తలెత్తింది. ఆర్టీసీలో ఉద్యోగులు ప్రతినెలా 7 శాతం తమ జీతం నుంచి మినహాయించి సహకార పరపతి సంఘంలో డిపాజిట్ చేస్తారు. ప్రస్తుతం సీసీఎస్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దాని నిధులను ఆర్టీసీ వాడేసుకుని ఖాళీ చేయటంతో సీసీఎస్ భవితవ్యమే గందరగోళమైంది. అయితే ఇప్పటివరకు సీసీఎస్‌కు సంబంధించి మిగతా వ్యవహారాల్లో ప్రతిష్టంభన ఉన్నా.. రిటైరైన ఉద్యోగులకు సెటిల్మెంట్ల విషయంలో మాత్రం లోటు రానివ్వలేదు. కానీ గత ఆగస్టు నుంచి ఈ సెటిల్మెంట్ల విషయంలో కూడా ఆర్టీసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఆ నెల నుంచి పదవీ విరమణ పొందిన వారికి ఇప్పటి వరకు ఆ డిపాజిట్ మొత్తాలను ఇవ్వలేదని అంటున్నారు. సగటున ఒక్కో ఉద్యోగికి కనిష్టంగా రూ.6 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. అలా దాదాపు 500 మంది ఉద్యోగులకు ఈ మొత్తాన్ని చెల్లించలేదని చెబుతున్నారు.

అధిక వడ్డీ ఆశతో..

సర్వీసులో ఉన్న ఉద్యోగులకు జీతాల నుంచి వచ్చే ఈ మొత్తమే చివరి వరకు ఆయువు పట్టు. అలా ప్రతినెలా జమ అయ్యే నిధులతోనే ఆ సంస్థ ఉద్యోగులకు రుణాలు ఇస్తుంది. ఆ డిపాజిట్ మొత్తాలపై అధిక వడ్డీని ఉద్యోగులకు చెల్లిస్తుంది. దీంతో చాలా మంది మధ్యలో డిపాజిట్ మొత్తాన్ని తీసుకోకుండా పదవీవిరమణ వరకు అలాగే కొనసాగిస్తారు. కొందరైతే, రిటైర్ అయిన తర్వాత కూడా దాన్ని కొనసాగిస్తూ అధిక వడ్డీ పొందుతారు. కానీ ఇప్పుడు పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆగస్టు నుంచి ఆర్టీసీ సీసీఎస్‌కు పెద్దగా నిధులు విడుదల చేయకపోవటంతో పదవీవిరమణ పొందిన వారికి కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. రిటైర్‌మెంట్ సెటిల్‌మెంట్లతో రకరకాల ప్రణాళికలు చేసుకుని, ఇప్పుడు ఆ మొత్తం అందని వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

చట్టసభల ప్రతినిధులతో జాతీయ సదస్సు ముంబైలో

జూన్ 15 నుంచి 18 వరకు..

సాక్షి, హైదరాబాద్: దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించేందుకు ఈ ఏడాది జూన్‌లో భారీ సదస్సు ఒకటి జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు మూడు వేల మంది చట్టసభల ప్రతినిధులతో 'ద నేషనల్ లెజిస్లేచర్స్ కాన్ఫరెన్స్, భారత్ (ఎన్ఎల్‌సీ భారత్)'జరగనుంది. ఈ ఏడాది జూన్ 15 నుంచి 18వ తేదీ వరకు దేశ వాణిజ్య రాజధాని ముంబైలో ఈ సదస్సును నిర్వహించనున్నారు. చట్టసభ సభ్యులతో ఇలాంటి సదస్సు ఒకటి నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని.. ప్రజాజీవితంలో తాము ఆచరిస్తున్న వినూత్న పద్ధతులు, ఆలోచనలను పంచుకునేందుకు ఈ సదస్సు వారికి అవకాశం కల్పిస్తోందని నిర్వాహకులు తెలిపారు. చట్టసభల పనితీరును మెరుగు పరిచేందుకు ఈ సదస్సులో జరిపే చర్చలు ఉపయోగపడతాయని అంచనా. 'భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకుసదస్సు ఉపయోగపడుతుందని ఎన్ఎల్‌సీ భారత్ కౌన్సిల్ సభ్యురాలు, లోక్‌సభ మాజీ స్పీకర్ డాక్టర్ మీరాకుమార్ తెలిపారు.

రైలు ప్రమాదాన్ని తప్పించిన బామ్మ

- రైలు పట్టాలపై కూలిన భారీ వృక్షం
- ఎర్రటి వస్త్రం ఊపుతూ వెళ్లి రైలు ఆపేసిన వృద్ధురాలు
- గుండె ఆపరేషన్ చేయించుకున్నా సాహసం



సాక్షి బెంగళూరు: రైల్వే పట్టాలపై ఓ పెద్ద చెట్టు విరిగిపడింది. అంతలోనే ఆ పట్టాలపై రైలు వస్తోంది. మరికొద్ది నిమిషాల్లో పెను ప్రమాదం జరిగేది. కానీ.. ఓ బామ్మ ఎరుపు రంగు వస్త్రంతో దేవతలా వచ్చి ఆ రైలును ఆపేసింది. ఇదేదో సినిమాలో సీన్ కాదు. నిజంగా జరిగిన ఉదంతం. ఈ ఘటన మంగళూరు–పడీల్ జోకెట్ట మధ్యలో గల పచ్చనాడి సమీపంలోని మందారలో మార్చి 21వ తేదీన చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్చి 21 మధ్యాహ్నం 2.10 గంటలకు రైలు పట్టాలపై ఒక భారీ వృక్షం విరిగి పడింది. అదే సమయంలో మంగళూరు నుంచి ముంబై వెళ్లే మత్స్యగంధ రైలు వస్తోంది. దీన్ని గమనించిన 70 వృద్ధురాలు చంద్రావతి ఇంట్లోంచి ఎరుపు రంగు వస్త్రం తెచ్చి రైలుకు ఎదురుగా వెళ్లి జెండాలా ఊపుతూ నిలబడింది. దీనిని పసిగట్టిన లోకో పైలట్ రైలు వేగాన్ని తగ్గించి ఆపేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం స్థానికులు పట్టాలపై పడిన చెట్టును పక్కకు తొలగించారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఆమెను అభినందించారు.

'ఏం చేయాలో పాలుపోలేదు'

ఈ ఘటనపై చంద్రావతి మాట్లాడుతూ 'ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి బయట కూర్చొన్నాను. మా అక్క ఇంట్లోనే నిద్రపోతోంది. ఉన్నట్టుండి ఇంటి ఎదురుగా ఉన్న పట్టాలపై పెద్ద చెట్టు విరిగిపడింది. అదే సమయంలో మంగళూరు నుంచి ముంబైకి రైలు వెళుతుందనే విషయం గుర్తుకొచ్చింది. ఏం చేయాలో పాలుపోలేదు. ఎవరికైనా ఫోన్ చేసి చెబుదామని ఇంటి లోపలికి వెళ్లాను. అంతలోనే రైలు హారన్ వినిపించింది. వెంటనే ఇంట్లో ఉన్న ఎరుపు రంగు వస్త్రం తీసుకుని పట్టాల వద్దకు పరుగు తీశాను. నాకు గుండె ఆపరేషన్ అయింది. అయినా లెక్కజేయలేదు. రైలు వస్తున్నప్పుడు పట్టాల పక్కన నిలబడి ఆ ఎరుపు రంగు వస్త్రాన్ని ఊపాను. వెంటనే రైలు నెమ్మదించి ఆగిపోయింది. సుమారు అరగంట పాటు పట్టాలపై రైలు ఆగింది. స్థానికుల సహకారంతో ఆ చెట్టును తొలగించారు'అని చెప్పింది.

వైద్య సహాయానికి ముందుకొచ్చిన సహస్రా హాస్పిటల్

సాక్షి ఎఫెక్ట్



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్

ఖలీల్‌వాడి: 'తలకు మించిన భారం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన సహస్రా హాస్పిటల్‌కు చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ మారుతి బాబు స్పందించారు. బాధిత బాలుడికి ఉచితంగా ఆపరేషన్‌తో చేయడంతో పాటు బెడ్ సౌకర్యం కల్పిస్తామని, మందులు మాత్రం కొనుగోలు చేసుకోవాలని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఈ విషయమై డాక్టర్ మారుతిబాబును ఫోన్‌లో 'సాక్షి' సంప్రదించగా రిపోర్ట్‌ను పరిశీలించిన తర్వాత ఆపరేషన్ తలకు రెండు వైపులా చేయాలా అనేది పరిశీలిస్తామన్నారు. ఇదిలా ఉండగా నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి బాలుడిని తరలించారు. ఆర్మూర్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బొడ్డు హారిక తన కుమారుడు శివకుమార్ (8) తలలో నీరు చేరి భారీగా పెరిగిపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వైద్య సహాయం అందించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకుంది. ఈ మేరకు కలెక్టర్ వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. శివకుమార్‌కు 5 నెలలప్పుడే తలలో నీరు చేరింది. తల పరిమాణం పెరగడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్, నిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించారు. తలభాగం మెత్తగా ఉండటంతో అప్పుడు ఆపరేషన్ వీలుకాదని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తలభాగం గట్టిపడి ఆపరేషన్‌కు అనువుగా ఉంది. అందుకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు హారిక పేర్కొన్నారు.



జస్టిస్ నాగార్జునకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ కార్తీక్ తదితరులు

జస్టిస్ నాగార్జునకు ఘనంగా వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయిన న్యాయమూర్తి జస్టిస్ దేవరాజు నాగార్జునకు తెలంగాణ హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో గత వారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన మంగళవారం ఆయనకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగార్జున సేవలను చీఫ్ జస్టిస్ కొనియాడారు. ఈ సందర్భంగా తాను న్యాయవ్యవస్థలో అడుగు పెట్టినప్పటి నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కావడం.. అనంతరం న్యాయమూర్తిగా పదోన్నతి పొందడం వరకు జస్టిస్ నాగార్జున గుర్తు చేసుకున్నారు. హైకోర్టులో సీజేతో కలిపి 32 (1 ప్లస్ 31) మంది న్యాయమూర్తులుండగా, జస్టిస్ నాగార్జున బదిలీతో న్యాయమూర్తుల సంఖ్య 30కి తగ్గింది. 4 నెలల క్రితమే హైకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేయడం తెలిసిందే. జస్టిస్ కన్నెగంటి లలితను కర్ణాటక హైకోర్టుకు, జస్టిస్ అభిషేక్ రెడ్డిని పట్నా హైకోర్టుకు బదిలీ చేయాలనే కొలీజియం ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పనిచేస్తున్న గెల్లు



ప్రగతి భవన్‌లో గెల్లు శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ బాధ్యతల నిర్వహణకు అవసరమైన వసతి సదుపాయాలు, వాహనాలు, సిబ్బంది తదితరాలన్నీ సమకూర్చాలని పర్యాటక, సాంస్కృతిక శాఖకు ఆదేశాలు జారీచేసింది. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శ్రీనివాస్ నియామక పత్రం అందుకున్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన గెల్లు శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీలో రాజనీతిశాస్త్రంలో పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. బీసీ యాదవ సామాజికవర్గానికి చెందిన గెల్లు శ్రీనివాస్ 2003 నుంచి విద్యార్థి నేతగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి హైదరాబాద్ పట్టణ, రాష్ట్రకార్యదర్శిగా పనిచేస్తూ పలుమార్లు అరెస్టై జైలుకు కూడా వెళ్లారు. ఉద్యమ సమయంలో జరిగిన పలు ఎన్నికలు, ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున క్రియాశీలంగా పనిచేశారు. 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై గెల్లు శ్రీనివాస్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మరోమారు బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులు కావడం గమనార్హం.

కేసీఆర్, కేటీఆర్ సాయాన్ని మరువలేను

కేసీఆర్ ఆశీర్వాదంతోనే తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగానని మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తోడబుట్టిన సోదరుడిలా మంత్రి కేటీఆర్ తన వెంట నిలిచి ఎంతగానో సహకరించారని తెలిపారు. పర్యాటక శాఖాధికారులు అందించిన సహకారంతో పర్యాటకాభివృద్ధికి కృషి చేశానన్నారు. గెల్లు శ్రీనివాస్‌కు ఈ సందర్భంగా ఉప్పల శుభాకాంక్షలు తెలిపారు.



హద్దుల్లేని పొద్దు తిరుగుడు

సాధారణంగా పొద్దు తిరుగుడు మొక్కకు ఒక పువ్వు పూసి.. సూర్యుడిని అనుసరిస్తుందని నానుడి. కానీ, ఈ మొక్క సూర్యుడి చుట్టూ తిరగడం ఎందుకనుకుందో ఏమో.. ఇలా దిక్కు దిక్కుకూ ఒకటి చొప్పున ఆరు పూలు పూసింది. ఈ మొక్క జడ్చర్లలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో ఉంది. విత్తనంలో అగ్ర విభాజ్య కణజాలం దెబ్బ తిన్నప్పుడు ఇలా జరిగే ఆస్కారం ఉందని గార్డెన్ కో–ఆర్డినేటర్ సదాశివయ్య 'సాక్షి'కి తెలిపారు.

- జడ్చర్ల

పోతులమడుగులో వెయ్యేళ్లనాటి శిల్పాలు

ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం పోతులమడుగులోని వేణుగోపాలస్వామి సమీపంలో వెయ్యేళ్లనాటి శిల్పాలను గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన దేవాలయం ప్రాంగణానికి కొంత దూరంలో వృథాగా పడి ఉన్న శిల్పాలను పరిశీలించారు. కాకతీయుల కాలం నాటి వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం సమయంలో నాగదేవత, చాముండి, భద్రకాళి, నందీశ్వరుడు, నల్లశానపురాతన విగ్రహాలను ఆలయం వెలుపలకు చేర్చారని, కల్యాణి చాళుక్య, కాకతీయుల (క్రీ.శ.12, 13 శతాబ్దాలు) నాటి విగ్రహాలు చారిత్రక ప్రాధాన్యం కలవని పేర్కొన్నారు. వీటిని భద్రపర్చి భావితరాలకు అందించాలని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట స్థపతి బి.వెంకట్‌రెడ్డి ఉన్నారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.